PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 156 | విజయవాడ, మంగళవారం 9 జనవరి 2024 | 8 + 8 పేజీలు | వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 9 January 2024 | Rs

నేడు జైల్‌భరో

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలు, మున్సిపల్, సమగ్రశిక్షా ఉద్యోగులకు మద్దతుగా మంగళవారం అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యాన జైల్‌భరో నిర్వహించను న్నాయి. దీనిలో భాగంగా ఉదయం పది గంటలకు అలంకార్ సెంటర్లోని ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. సమ్మెలు సాగుతున్నా.. స్పందించని ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టనున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కేంద్రాల్లోనూ ఈ కార్యక్రమాలు జరుగుతాయని నాయకులు ప్రకటించారు.



ఆంధ్రకు ఆధిక్యత

- బెంగాల్ రంజీట్రోఫీ మ్యాచ్ డ్రా
- రికీ బుయ్ భారీ శతకం



బిల్కిస్ బానో కేసులో

దోషుల విడుదల చెల్లదు

- గుజరాత్ ప్రభుత్వం నేరస్తులతో కుమ్మక్కయింది
- కేంద్ర ప్రభుత్వానికీ ఈ పాపంలో వాటా ఉంది
- దోషులు రెండు వారాల్లో జైలుకెళ్లి లొంగిపోవాలి
- సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2002 గుజరాత్ నరమేధ సమయంలో గర్భిణిగా ఉన్న బిల్కిస్ బానోపైన, ఆమె కుటుంబ సభ్యులపైన సంఘ్ పరివార్ మూకలు సామూహిక అత్యాచారం చేసి, ఆమె అయిదేళ్ల కుమార్తెతో సహా 14 మంది కుటుంబ సభ్యులను మూకుమ్మడిగా హత్య చేసిన కేసులో 11 మంది దోషుల శిక్షాకాలం పూర్తవకుండానే ముందస్తుగా విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. 2022 ఆగస్టులో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా దోషులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడంపై అప్పట్లో పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి. దీనిపై బిల్కిస్ బానో, ఆమెకు మద్దతుగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణి ఆలీ, సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద తదితరుల సహకారంతో 22 ఏళ్లుగా సాగించిన న్యాయ పోరాటం ఫలించింది. అన్ని బెదిరింపులను ఎదుర్కొని ధైర్యంగా పోరాడిన బిల్కిస్ బానో చివరికి దోషులకు శిక్ష పడేలా చేశారు. అయితే, దోషుల శిక్షా కాలం పూర్తి కాకుండానే వారికి గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష కింద శిక్షను తగ్గించి జైలు నుంచి విడుదల జేసింది. వీరి విడుదలను విహెచ్‌పి కార్యకర్తలు వేడుకగా జరుపుకున్నారు. దోషుల విడుదలను సవాల్ చేస్తూ మిగతా 7లో

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

- సిపిఎం పొలిట్‌బ్యూరో

7

ఎస్మా రద్దు... జీతాలు పెంపు

- రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్
- వివిధ పార్టీలు, ప్రజాసంఘాల ఏకగ్రీవ తీర్మానం
- అవసరమైతే రాష్ట్ర బంద్ చేస్తాం
- నేడు రాస్తారోకోలు, ప్రదర్శనలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకుల అభివాదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలపై విధించిన ఎస్మాను తక్షణమే రద్దుచేయాలని, అదేవిధంగా అంగన్‌వాడీలతో పాటు మున్సిపల్, సర్వశిక్ష కార్మికుల జీతాలను పెంచాలని వివిధ రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. సంక్రాంతిలోపు ఈ డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించాయి. ఉద్యోగ కార్మిక సంఘాల సమ్మెలకు మద్దతుగా సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన సోమవారం ఉదయం విజయవాడ బాలోత్సవ భవన్లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీంవగా తీర్మానం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టిడిపి, సిపిఐ, కాంగ్రెస్, న్యూడెమోక్రసీ, ఎస్‌యుసిఐసితోపాటు సిఐటియు, విద్యార్థి యువజన, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న అబద్ధాలకు అంతు లేకుండా పోయిందని అన్నారు. ఎస్మా ప్రయోగించినా కార్మికులు పట్టువీడటం లేదంటే వారి బాధ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అంగన్‌వాడీలు అత్యవసర విభాగం అని భావిస్తే ఇన్ని రోజులు ఎందుకు సమస్యను పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో జగన్‌కు శృంగభంగం తప్పదని, మహిళలే తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఆందోళనలు చేస్తుంటే అరెస్టులు చేయడం తెలివితక్కువతనమని పేర్కొన్నారు. సర్వశిక్ష అభియాన్‌లో సిబ్బంది గొడ్డుచాకిరీ చేస్తున్నారని అన్నారు. సంక్రాంతిలోపు సమ్మెలో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అన్ని పార్టీలు ప్రత్యక్ష ఆందోళనకు దిగడంతోపాటు, రాష్ట్ర బంద్ చేపడతామని హెచ్చరించారు.

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ కార్మికులకు ఏమి కావాలో తెలుసుకోకుండా భయభ్రాంతులకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి సరైన ఆర్థిక విధానం లేదని, సమస్యపైనా అవగాహన లేదని విమర్శించారు. ఇన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా మంత్రులకు పట్టకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేసేందుకు గంటల సమయం తీసుకుంటున్న ముఖ్యమంత్రి 26 రోజులుగా సమ్మె చేస్తున్న మహిళలతో చర్చించేందుకు గంట సమయం కేటాయించకపోవడం అన్యాయమని అన్నారు. చిన్న ఉద్యోగులపై బ్రహ్మాస్త్రం ప్రయోగించడం సరికాదని పేర్కొన్నారు. ఇష్టం వచ్చినట్లు చేస్తే చూస్తు ఊరుకోవడానికి ఇది పాలెగాళ్ల రాజ్యం కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ ఒక్క అవకాశం అని అధికారంలోకి వచ్చిన తరువాత ఓటేసిన వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారని అన్నారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, ఎస్‌ఎస్‌ఎ సిబ్బంది పట్టువదలకుండా ఆందోళన కొనసాగిస్తున్నారని అభినందించారు. జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. అత్యవసర సేవల కింద వారిని చేరిస్తే వెంటనే సమస్యను పరిష్కరించాలని, గ్రాట్యుటీ పెంచాలని కోరితే కోర్టులో కంటెంప్ట్ వేసుకోమంటున్నారని, దానికి ప్రభుత్వం ఎందుకని అన్నారు. న్యూడెమొక్రసీ నాయకులు కె.పొలారి, రామకృష్ణ మాట్లాడుతూ కార్మికుల విషయంలో ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తోందని, విస్తృత పోరాటాల ద్వారానే తగిన బుద్ధిచెప్పాలని అన్నారు. ఎంసిపిఐయు నాయకులు ఖాదర్‌భాషా మాట్లాడుతూ పిల్లలకు అన్నం పెట్టే మహిళలను రోడ్డుపై నిలబెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు.

అమ్‌ఆద్మీ నాయకులు ఫణిరాజు మాట్లాడుతూ ఎస్మా నోటీసు ఇచ్చిన తరువాత న్యాయ సలహా తీసుకోవడం ప్రభుత్వ నిర్లక్ష్యపు పాలనకు నిదర్శనమని అన్నారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం ప్రజలు, ప్రజాతంత్ర హక్కులపై దాడి అని అన్నారు. వెనక్కు తీసుకోకపోతే లక్షన్నర మండి మహిళలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మె వెనుక ఐదు లక్షల మంది మహిళల భాగస్వామ్యం ఉందని అన్నారు. మహిళా సమాఖ్య నాయకులు పి.దుర్గాభవాని మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఐలు నాయకులు సంపర దుర్గా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమంలో భాగస్వాములైన అంగన్‌వాడీలను సంక్షోభంలోకి నెట్టారని మండిపడ్డారు. రైతు సంఘం నాయకులు వి.కృష్ణయ్య, కౌలు రైతు సంఘం నాయకులు హరిబాబు మాట్లాడుతూ ప్రస్తుత ఆందోళనలపై బహిరంగంగా చర్చించి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ప్రొఫెషనల్ ఫోరం నాయకులు నేతి మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమం పేరుతో రాజకీయ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు చేపడతామని అన్నారు. అంగన్‌వాడీ సంఘం నాయకులు రమాదేవి మాట్లాడుతూ జీతాలు పెంచమని కోరుతుంటే ప్రభుత్వ ఉద్యోగులు కాదని చెబుతున్నారని, అలాంటప్పుడు ఎస్మా ఎలా ప్రయోగించారని ప్రశ్నించారు. ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, డివైఎఫ్ఐ నాయకులు రామన్న, ఇన్సూరెన్స్ సంఘాల నాయకులు పాత్రుడు, విద్యార్థి సంఘ నాయకులు ప్రసన్న తదితరులు మాట్లాడారు.

ఎస్మాకు భయపడం

- కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
- బొత్స కాన్వాయ్ అడ్డగింత

3

రాజస్థాన్‌లో బిజెపికి ఎదురుదెబ్బ

- ఉప ఎన్నికలో మంత్రి ఓటమి

జైపూర్ : రాజస్థాన్‌లో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేసి నెల రోజులు కూడా గడవక ముందే బిజెపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కరణ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి, రాష్ట్ర మంత్రి సురేంద్ర పాల్ సింగ్ కాంగ్రెస్ అభ్యర్థి రూపేందర్ సింగ్ కూనర్ చేతిలో 11,283 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి గుర్మీత్ సింగ్ కూనర్ మరణించడంతో ఈ నెల 5న ఉప ఎన్నిక నిర్వహించి, సోమవారం ఫలితాలను ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి, గుర్మీత్‌సింగ్ కుమారుడు రూపేందర్ సింగ్ కూనర్‌కు 94,950 ఓట్లు, మంత్రి సురేంద్ర పాల్ సింగ్‌కు 83,667 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారులు తెలిపారు. రూపేందర్ సింగ్ కూనర్ మీడియాతో మాట్లాడుతూ కరణ్‌పూర్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 'కేంద్ర మంత్రులు కూడా ఇక్కడ ప్రచారానికి వచ్చారు. కానీ ప్రజలు వారిని తిరస్కరించారు. ప్రజాస్వామ్యాన్ని గెలిపించారు' అని తెలిపారు.

మున్సిపల్ కార్మికులపై పోలీసుల ప్రతాపం

- విజయవాడ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత
- పలు జిల్లాల్లో అరెస్టులు
- కొనసాగిన సమ్మె



కె.ఉమామహేశ్వరరావును ఈడ్చుకుపోతున్న పోలీసులు

ప్రజాశక్తి- యంత్రాంగం

మున్సిపల్ కార్మికులపై పలు జిల్లాల్లో పోలీసులు సోమవారం విరుచుకుపడి ప్రతాపం చూశారు. పలువురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. విజయవాడ కలెక్టరేట్ వద్ద పోలీసులు కర్కశంగా ప్రవర్తించడంతో ఉద్రిక్తత నెలకొంది. సమ్మె భాగంగా మున్సిపల్ కార్మికులు ఆందోళన ఉధృతం చేశారు. పోటీ కార్మికులను అడ్డుకున్నారు. వివిధ రూపాల్లో నిరసనలను కొనసాగించారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ బందరు రోడ్డులోని కలెక్టరేట్‌ను ముట్టడించిన మున్సిపల్ కార్మికుల పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహరించారు. పిడిగుద్దులు గుద్దారు. మహిళా కార్మికులను జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లి పోలీసు వ్యానులు, ఆటోల్లో ఎత్తిపడేశారు. ఈ నేపథ్యంలో పలువురి మహిళా కార్మికుల దుస్తులు చిరిగిపోయాయి. పెనుగులాటలో పలువురి నాయకులకు, కార్మికులకు గాయాలయ్యాయి. పలువురు మహిళా కార్మికులను మహిళా కానిస్టేబుళ్లు బూట్ కాళ్లతో పొత్తి కడుపులో తన్నారు. దీంతో, పలువురు స్పృహ తప్పి పడిపోయారు. ఓ మహిళా కానిస్టేబుల్ రెండుసార్లు బలంగా పొత్తుకడుపులో తన్నడంతో సీత అనే కార్మికురాలు బిగ్గరగా ఏడుస్తూ స్పృహ తప్పి పడిపోయారు. ఆమెను యూనియన్ నాయకులు అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్ సహా వందల మంది కార్మికులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. వంగలకుమారి అనే మహిళా కార్మికురాలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో స్పృహతప్పి పడిపోవడంతో ఆమెను వైద్యశాలకు తరలించారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ గేటు వద్ద ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిని విడుదల చేశారు.

విశాఖలో జివిఎంసి పరిధిలోని మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తుండగా మార్గమధ్యంలో పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకుంది. జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజుతోపాటు మిగతా 2లో

సమస్యలు పరిష్కరించకుంటే 23 నుంచి సమ్మెలోకి..

- ఎస్‌సిఎస్‌కు 104, 108 ఉద్యోగుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అనేక సంవత్సరాలుగా వైద్యారోగ్యశాఖలో సేవలందిస్తున్న తమ న్యాయమైన సమస్యలు ఈ నెల 22లోపు పరిష్కరించాలని, లేనిపక్షంలో 23 నుంచి సమ్మె చేపడతామని ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) తెలిపింది. సోమవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి సమ్మె నోటీసు అందజేసింది. ఈ మేరకు నాయకులు ఎవి నాగేశ్వరరావు, కిరణ్ కుమార్, కెవి నరసింహా రావు, ఆర్ శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు. సమ్మెకు సన్నాహకంగా తొమ్మిదో తేదీ నుండి 22 వరకూ చేపట్టనున్న కార్యాచరణ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ కూడా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి సమ్మె నోటీసు ఇచ్చింది. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో ఎవి నాగేశ్వరరావు, విఆర్ ఫణికుమార్, ఎం కృష్ణారెడ్డి, సిహెచ్ రాంబాబు ఉన్నారు. సిఎం జగన్ హామీలు నెరవేర్చలేదని, వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని నోటీసుల్లో పేర్కొన్నారు.

ఒఎన్‌జిసి 'ఫస్ట్ ఆయిల్' ప్రారంభం



కాకినాడ ఒఎన్‌జిసిలో ఈస్టర్న్ ఆఫ్‌షోర్ అసెట్

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

బంగాళాఖాతం తీరంలో లోతైన నీటిలో ఉన్న కెజి-డిడబ్ల్యుఎన్-98/2 బ్లాక్ నుంచి 'ఫస్ట్ ఆయిల్' ఉత్పత్తిని విజయవంతంగా ప్రారంభించామని కాకినాడ ఒఎన్‌జిసి ఈస్టర్న్ ఆఫ్‌షోర్ అసెట్ అసెట్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కెజి-డిడబ్ల్యుఎన్-98/2లో ఉత్పత్తి అవుతున్న ఆయిల్‌తో ఒఎన్‌జిసి మొత్తం ఆయిల్ ఉత్పత్తి 11 శాతం నుంచి 15 శాతానికి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. వివిధ సాంకేతిక, కోవిడ్ సంబంధిత సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రాజెక్ట్ మొదటి దశను మార్చి 2020లో విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ బ్లాక్‌లోని 'యు' ఫీల్డ్ నుంచి పది నెలల రికార్డు సమయంలో గ్యాస్ ఉత్పత్తిని ప్రారంభించామన్నారు. ఈ ఏడాది జనవరి ఏడున ఈ ఫస్ట్ ఆయిల్ ప్రారంభించడంతో ఫేజ్-2 ముగింపు దశకు చేరుకుందని తెలిపారు. మరోవైపు 'ఎం' ఫీల్డ్ నుంచి ఆయిల్ ఉత్పత్తి ప్రారంభమైందని, ఈ ఫీల్డ్ అభివృద్ధిలో ముడి చమురు మైనపు స్వభావం వల్ల ఒఎన్‌జిసి అనేక సాంకేతిక సవాళ్లను ఎదుర్కొందని చెప్పారు. వాటిని అధిగమించడానికి ఒఎన్‌జిసి దేశంలోనే మొదటిసారిగా పైప్ టెక్నాలజీలో వినూత్నమైన పైప్‌ను ఉపయోగించిందని తెలిపారు. ఈ డెవలప్‌మెంట్‌లో ఉపయోగించిన సబ్-సి హార్డ్‌వేర్‌లను అంతర్జాతీయంగా ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని చెప్పారు. కానీ, మెజారిటీ ఫ్యాబ్రికేషన్ పనులు కట్టుపల్లిలోని మాడ్యులర్ ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీ సెంటర్‌లో జరిగాయని తెలిపారు. ఇది మేక్ ఇన్ ఇండియాను ప్రోత్సహించడానికి ఒఎన్‌జిసి నిబద్ధతను తెలియజేస్తోందని చెప్పారు. మనదేశ స్వావలంబన శక్తికి దోహదం చేస్తుందని వివరించారు. ఈ ఫీల్డ్‌లో గరిష్టంగా రోజుకు 45 వేల బారెల్స్ ఆయిల్, పది ఎంఎంఎస్‌సిఎండిలకంటే ఎక్కువగా గ్యాస్ ఉత్పత్తి ఉంటుందని చెప్పారు.

ముదురుతున్న మాల్దీవుల వివాదం

- ప్రధాని మోడీపై వ్యాఖ్యలకు భారత్ అభ్యంతరం
- మాల్దీవుల దౌత్యవేత్తను పిలిపించుకున్న విదేశాంగశాఖ
- ఆ వ్యాఖ్యలతో సంబంధం లేదన్న మాల్దీవుల ప్రభుత్వం


లోపలి పేజీల్లో..

భారత్‌కు ఎర్ర సముద్రం సెగ

- ఎగుమతుల్లో 30 బిలియన్ డాలర్లు తగ్గొచ్చు

వేతనాలు పెంచం

- అంగన్‌వాడీలకు ప్రత్యామ్నాయం చూస్తాం
- సజ్జల రామకృష్ణారెడ్డి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వేతనాలు పెంచడానికి బదులుగా అంగన్‌వాడీలకు ప్రత్యామ్నాయం చూస్తామని చెప్పారు. సోమవారం తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ చర్చల్లో ఎన్నికల తరువాత వచ్చే ప్రభుత్వంలో వేతనాల పెంపు విషయం పరిశీలిస్తామని చెప్పామని, అయినా సమ్మెను కొనసాగిస్తున్నారని చెప్పారు. తెగేంతవరకు లాగడం మంచిది కాదన్నారు. మొదట్లో అధికారులు, తర్వాత మంత్రుల బృందం చర్చలు జరిపారని, వేతనాలు తప్ప అన్ని సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. అంగన్‌వాడీ కార్మికులు లక్ష మంది ఉన్నామని, తాము అనుకున్నది జరగకపోతే ప్రభుత్వాన్ని దించేస్తాం అనేలా మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ అంగన్వాడీల కింద లక్షలాది మంది మహిళలు, పిల్లలు, గర్భిణులు ఉన్నారన్నారు. ఎక్కడో ఒక పాయింట్ వద్ద ప్రభుత్వం ప్రత్యామ్నాయం చేయాల్సి వుంటుందని తెలిపారు. లక్షలాది మందికి సంబంధించిన అంశం అయిందునే వీరిపై ఎస్మా ప్రయోగిస్తూ జీఓ తెచ్చామని అన్నా రు. అంగన్‌వాడీల సమ్మె వెనుక జాతీయ పార్టీలు, లాయర్లు ఉన్నారని వీడియోలో తేలిందన్నారు. ఉద్యమం ఇలాగే కొనసాగితే ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూస్తుందన్నారు. అంగన్వాడీ, మున్సిపల్ వర్కర్లు ఎస్మా కిందికి వస్తారని అన్నారు. మున్సిపల్ వర్కర్లతో చర్చలు జరుగుతున్నాయన్నారు. సమస్యలు పరిష్కారమవుతామని భావిస్తున్నామన్నారు.

అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించిన ప్రభుత్వం తాజాగా అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులివ్వాలని నిర్ణయించింది. విధులకు ఎందుకు హాజరుకాలేదో చెప్పాలని నోటీసులివ్వాని, 10 రోజుల్లోగా సంతృప్తికర సమాధానం ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది.

కార్పొరేటర్ పదవికి కేశినేని శ్వేత రాజీనామా


కేశినేని శ్వేత (ఫైల్)

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ నగర పాలక సంస్థ 11వ డివిజన్ టిటిడి కార్పొరేటర్ కేశినేని శ్వేత సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మికి ఈ మేరకు లేఖ అందించారు. తన లేఖను కౌన్సిల్లో పెట్టి ఆమోదించాలని కోరారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాజీనామా ఆమోదం పొందిన తర్వాత టిడిపికి కూడా రాజీనామా చేస్తానని తెలిపారు. తాము ఎప్పుడూ టిడిపిని వీడాలని అనుకోలేదని, ఆ పార్టీయే తమను వద్దనుకున్నప్పుడు కొనసాగడం భావ్యం కాదన్నారు. విజయవాడ ఎంపి కేశినేని నాని కార్యకర్తలతో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తారని తెలిపారు. గౌరవం లేని చోట తాము పనిచేయలేమని, కేశినేని నాని, తాను ప్రజల తరుపున పోరాడతామని అన్నారు. ఏడాది కాలంగా టిడిపిలో కేశినేని నాని అవమానాలు ఎదుర్కొంటూనే ఉన్నారని, ఎన్‌టిఆర్ జిల్లాలో జరుగుతున్న పరిణామాలు ఇప్పటి వరకు పార్టీ అధిష్టానానికి తెలియదనే తాము భావిస్తున్నామని చెప్పారు. విఎంసి ఎన్నికల సమయంలో తమను ముగ్గురు నాయకులు ఇబ్బంది పెట్టారని వివరించారు. ఈ నేపథ్యంలో తాము పార్టీని వీడుతున్నామని, తమతో వచ్చే వారికి కచ్చితంగా అండగా ఉంటామని వివరించారు. తిరువూరులో చంద్రబాబు సభకూ, కేశినేని నానికీ ఏంటి సంబంధమని నారా లోకేష్ అడిగారన్నారు. కేశినేని నాని ప్రాతినిధ్యం వహిస్తున్న విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో జరిగే సభకు ఆయనకు కాకుండా ఇంకెవరికి సంబంధం ఉంటుందని ప్రశ్నించారు. మూడోసారి కూడా విజయవాడ పార్లమెంట్ నుంచే నాని పోటీ చేస్తారని చెప్పారు. అంతకుముందు కేశినేని శ్వేత టిడిపికి రాజీనామా చేయనున్నట్లు ఎంపి కేశినేని తన ట్విట్టర్ వేదికగా వెల్లడించారు.

సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 5న చలో విజయవాడ

- ఎపి మెప్మా ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెప్మా ఆర్‌పిలకు మూడేళ్ల కాలపరిమితి రద్దు చేయాలని, వేతనాలకు, పనికి ముడిపెట్టకుండా రూ.పదివేలు వేతనం చెల్లించాలని ఎపి మెప్మా ఆర్‌పి (పట్టణ రిసోర్స్ పర్సన్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి కోరారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఫిబ్రవరి 5న చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు. మెప్మా ఉద్యోగుల సంఘం సమావేశం సోమవారం విజయవాడలోని ఎంబివికెలో జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. 16 ఏళ్లుగా పనిచేస్తున్న ఆర్‌పిలకు కాలపరిమితి సర్క్యులర్ విడుదల చేసి 8,500 మందిని రోడ్డున పడేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక రూ.10 వేలు వేతనం జిఒ విడుదల చేసి ఇప్పటికీ నెలకు రూ.రెండువేల నుండి రూ.ఐదువేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని జనవరి 22న ప్రజా ప్రతినిధులకు సమూహిక రాయబారాలు నిర్వహించాలని, 23 నుంచి 30లోపు మెప్మా అధికారుల, పట్టణ అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు సమగ్రశిక్షా ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి లక్ష్మి, శాంతి, పి వెంకటరమణ, ఝాన్సీ, ఉష, నసీమా, సుమతి, సుభాషిణి పాల్గొన్నారు.

వైసిపి పాలనలో మద్యం మత్తులో విద్యార్థులు : లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో విద్యార్థులు మద్యం మత్తులో బడికొస్తున్నారని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. చిత్తూరు జిల్లాలో పాఠశాలకు వెళ్లిన అమ్మాయిని వైసిపి ముఠా గంజాయికి బానిస చేసిందని ఆరోపించారు. కంటిపాపని రక్షించుకోలేక పాప తల్లి అనుభవించిన నరకం తన కళ్ల ముందు ఇంకా కదలాడుతోందని అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గంజాయిని నియంత్రించాల్సిన సర్కారే ప్రోత్సహిస్తోందని విమర్శించారు. సిఎం జగన్ ఇంటి ఎదురుగా గంజాయికి బానిసైన పిల్లాడి తల్లి ఆవేదన వ్యక్తం చేస్తే ఆమెను పోలీసులు బెదిరించి నోరు మూయించారని తెలిపారు. గంజాయి, డ్రగ్స్, మద్యం విషాదాలు చూసి ఆవేదనతో కట్టడి చేయాలని ప్రధాన మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వానికి కోరానని గుర్తుచేశారు. అనంతపురం జిల్లాలో వైసిపి జెండాను కాల్చేశారనే ఆరోపణలపై టిడిపి కార్యకర్త చంద్రమోహన్‌ను పోలీసులు అరెస్టు చేసి నగ్నంగా కొడుతూ ఊరేగించిన ఘోరం చూశాక తన గుండె చెదిరిపోయిందని మరో ప్రకటనలో తెలిపారు.

ఎస్మాస్త్రం నియంతృత్వ పోకడలకు నిదర్శనం

శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మాస్త్రం ప్రయోగించడం జగన్ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని టిడిపి అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార సమితి అధ్యక్షులు ఆచంట సునీత విమర్శించారు. ఎస్మా ప్రయోగించాల్సినంత తప్పు వారు ఏం చేశారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది, 108, 104 అంబులెన్సుల ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల మొత్తం విలువ జగన్ తన విలాసాల కోసం తగలేసిన వేల కోట్ల ప్రజల సొమ్ము ముందు దిగదుడుపే అని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు.

962 మండలాల్లో జయహో బిసి : కొల్లు

బిసిల అభ్యున్నతి కోసం తమ పార్టీ చేపట్టిన జయహో బిసి కార్యక్రమం మండల స్థాయిలో 962 సమావేశాలు నిర్వహించబోతున్నామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర వెల్లడించారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చేపట్టిన రా.. కదలిరా సభలకు ప్రజలు పోటెత్తుతున్నారని, సూపర్ సిక్స్ పథకాలకు లభిస్తున్న ఆదరణ ఓర్వలేక జగన్, మంత్రులు పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యోగులను బెదిరించడం సరికాదు

- 20వ రోజుకు చేరుకున్న ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరవధిక సమ్మె


పాడేరు ఐటిడిఎ వద్ద షోకాజ్ నోటీసులను దగ్ధం చేసి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి-యంత్రాంగం, అమరావతి బ్యూరో

విజయవాడ ఎస్‌పిడి కార్యాలయం ముట్టడి సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మరో రెండ్రోజుల్లో విద్యాశాఖ మంత్రితో చర్చలు ఏర్పాటు చేస్తామని నమ్మ బలికి నేడు ఉద్యోగులందరికీ షోకాజ్ నోటీసులు అందజేయడం సరికాదని సమగ్ర శిక్ష కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి నాయకులు భగ్గుమన్నారు. అనుమతి లేకుండా సమ్మె చేస్తున్నారని, దీనిపై వివరణ ఇవ్వాలని అధికారులు ఇచ్చిన నోటీసులను దగ్ధం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేస్తున్న సమ్మె సోమవారానికి 20వ రోజుకు చేరుకుంది.

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో జోరు వానలోనూ నిరసన తెలిపారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద సమగ్ర ఉద్యోగుల సమ్మె శిబిరం వద్దకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి వెళ్లి.. మద్దతు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం ఆర్థిక పరమైన డిమాండ్లతోపాటు, ఆర్థికేతర అంశమైన హెచ్‌ఆర్ పాలసీ డిమాండ్‌నూ పట్టించుకోవడంలేదన్నారు. ఒక్క హామీనీ నాలుగున్నరేళ్ల పాలనలో అమలు చేయలేదని తెలిపారు. తక్షణమే ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చొని ఎస్ఎస్ఎ ఉద్యోగులు నిరసన తెలిపారు. పాడేరులోని డిఇఒ కార్యాలయం కెజిబివి సిబ్బంది నిరసన తెలియజేశారు. అరకులోయలో సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కార్మికులు, ఉద్యోగుల పట్ల మూర్ఖంగా వ్యవహరిస్తున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా చట్ట ప్రకారం కనీస వేతనం అడగడంలో తప్పేంటని ప్రశ్నించారు. ఏలూరు జిల్లాలో కలెక్టరేట్ వద్ద ఎస్ఎస్ఎ ఉద్యోగులు గుంజీలు తీసి నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఒంటి కాళ్లపై నిల్చొని దండం పెడుతూ తమ నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల, బాపట్ల, విజయవాడ, అన్నమయ్య జిల్లా, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం సమ్మె శిబిరాలలో నిరసనలు కొనసాగాయి.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
సిఐటియు, ఎఐటియుసి, పిడిఎఫ్ డిమాండ్
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతి అందజేత

సమగ్ర శిక్షా పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు, ఎఐటియుసి, పిడిఎఫ్ కోరాయి. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్, ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు... సిఎస్ కెఎస్ జవహర్ రెడ్డిని, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను సచివాలయంలో విడివిడిగా సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని నవంబరు 20న ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చారని, డిసెంబరు 20 నుంచి సమ్మె నిర్వహిస్తున్నారని తెలిపారు. నెల రోజుల సమయం ఉన్నా సమగ్రశిక్షా ఎస్‌పిడి సమస్యలపై ఉద్యోగ సంఘం ప్రతినిధులతో ఎటువంటి చర్చలూ జరపలేదని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంతో సమ్మె అనివార్యమైందని వివరించారు. సమ్మెలో ఉన్న ఉద్యోగులను ప్రత్యేకించి కెజిబివిలలోని మహిళా ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేయడం, తూలనాడటం, టెర్మినేట్ చేయడం వంటి చర్యలకు పాల్పడటం చట్ట వ్యతిరేకం, అప్రజాస్వామికమని తెలిపారు. ఇటువంటి చర్యలను జెఎసి తీవ్రంగా ఖండిస్తుందని వెల్లడించారు. సమస్యలను పరిష్కరించాలని, ఇచ్చిన తొలగింపు ఉత్తర్వులను రద్దు చేయాలని సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని, హెచ్‌ఆర్‌ఎ పాలసీ అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల గ్రీవెన్స్ కోసం రాష్ట్రస్థాయిలో నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, హెచ్‌ఆర్ సెల్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. అందరికీ ఎంటిఎస్, హెచ్‌ఆర్‌ఎ, డిఎ అమలు చేసి వేతనాలు పెంచాలని కోరారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, జాబ్‌చార్ట్‌లివ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్ట్‌టైం విధానాన్ని రద్దు చేసి ఫుల్‌టైం ఒకేషనల్ టీచర్‌గా మార్చి వేతనాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నేడు పార్టీలతో సిఇసి భేటీ

- 10న సిఎస్, డిజిపి, ఎన్నికల అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రం వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఓగస్ ఓటర్లు అత్యధికంగా నమోదయ్యారని, ఫారం-7 తో ఏక పక్షపక్షంగా అర్హుల తొలగించారంటూ ప్రధాన రాజకీయపార్టీలు కేంద్ర ఎన్నికల సంఘానికి పెద్ద ఎత్తున పిర్యాదులు చేశాయి. ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర ఎన్నికల సంఘం సభ్యులు మరో సారి మూడు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం రాత్రి విజయవాడకు చేరుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 9న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ హాజరవుతున్నారు. మధ్యాహ్నం జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్‌పి, సిపిలతో సమావేశం కానున్నారు. 10వ తేదిసిఎస్, డిజిపిలతో పాటు పలువురు అధికారులతో కమిషన్ సభ్యులు సమావేశం అవుతారు. కేంద్ర ఎన్నికల కమిషన్ బృందంలో సిఇఒ ఎస్‌హెచ్ రాజీవ్‌కుమార్‌తో పాటు ఎలక్షన్ కమిషనర్లు అనుప్ చంద్ర పాండే, అరుణ్‌గోయల్, నితీష్ వ్యాస్,తో పాటు డైరెక్టర్ పంకజ్ శ్రీవాత్సవ, ప్రిన్సిపల్ సెక్రటరీ హెచ్ఎస్ అవినాష్‌కుమార్, జాయింట్ డైరెక్టర్ అంజు చందక్, ఎఎస్ఒ సరిత ఉన్నారు.

5.64లక్షల అనర్హుల ఓట్లు : ముఖేష్‌కుమార్ మీనా

2024 ఓటర్ల తుది జాబితాకు సంబంధించి 2023 డిసెంబరు 9 వరకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించామని సిఇఒ ముకేష్‌కుమార్‌మీనా తెలిపారు. ఈ మేరకు టిడిపిరాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుకు రాసిన లేఖలో పేర్కొన్నారు. రాజకీయపార్టీలు చేసిన ఫిర్యాదుల్లో 14.28 లక్షల ఓటర్ల పేర్లను గుర్తించి అందులో 5.64లక్షల ఓటర్లు పేర్లు అనర్హులుగా గుర్తించామని సిఇఒ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా అవకతవకలకు సంబంధించి ఇద్దరు ఆర్‌ఓలను సస్పెండ్ చేయడంతోపాటు 50మంది బిఎల్‌ఓలపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


టిడిపి నాయకుల సమీక్షా సమావేశంలో పాల్గొన్న బాలకృష్ణ

'పురం'లో వేడెక్కిన రాజకీయం

- ఎమ్మెల్యే బాలయ్య... మంత్రి పెద్దిరెడ్డి పోటాపోటీ సమావేశాలు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో రాజకీయాలు వేడెక్కాయి. అప్పుడే ఎన్నికలు అనే రీతిలో అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నాలుగు రోజుల పాటు టిడిపి కార్యకర్తలు, నాయకులతో నేరుగా మాట్లాడే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇదే సమయంలో సోమవారం నుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరు రోజుల పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలను ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో బాలకృష్ణను ఓడించడమే లక్ష్యంగా పెట్టుకుని పెద్దిరెడ్డి ఆరు రోజులు పాటు హిందూపురంలో మకాం వేసినట్లు తెలుస్తోంది. ప్రతి గ్రామ నాయకులతోనూ ఆయన ముఖాముఖి సమావేశాలను నిర్వహించనున్నారు. మొదటి రోజు హిందూపురం మండలంలోని చౌళూరు, తూమకుంట, సంతేబిదనూరు, కిరికెర, కొటిపి, బేవినహళ్లి పంచాయతీల నాయకులు, ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో అబద్దాల బాబును మరోసారి ఓడించాలని కోరారు. ఇక బాలకృష్ణ సైతం నాలుగు రోజుల పాటు హిందూపురంలోనే ఉండి రాష్ట్రంలో గెలుపునకు సలహాలు ఇవ్వాలంటూ గ్రామ స్థాయి నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నాడు పట్టణం లోని జెవిఎస్ ఫంక్షన్ హాల్‌లో హిందూపురం మండల టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని టిడిపి క్యాడర్‌ను కోరారు. పార్టీ కోసం పని చేసే వారికి అధికారంలోకి రాగానే గుర్తింపును ఇస్తామన్నారు. ఇలా ఇద్దరు నాయకులు సమావేశాలు నిర్వహిస్తుండడంతో హిందూపురంలో ఎన్నికలు ముందుగానే వచ్చిన వాతావరణం కన్పిస్తోంది.

సిపిఎం నాయకులు కోటిరెడ్డి కుమార్తె సింధు మృతి

- నేడు తాడేపల్లిలో అంత్యక్రియలు


నివాళులర్పిస్తున్న ఎంవిఎస్.శర్మ, బి.తులసీదాస్, వై.అచ్యుతరావు తదితరులు


సింధు (ఫైల్)

ప్రజాశక్తి- తాడేపల్లి (గుంటూరు జిల్లా)

సిపిఎం నాయకులు, మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక బాధ్యులు అన్నపరెడ్డి కోటిరెడ్డి కుమార్తె అన్నపరెడ్డి సింధు (36) సోమవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. తెలంగాణ రాష్ట్రం విద్యుత్ సౌధా కార్యాలయంలో ఏడిగా సింధు పనిచేస్తున్నారు. ఆమెకు ఒక పాప, ఒక బాబు ఉన్నారు. ఆమె భర్త బుర్రముక్కు శ్రీకాంత్‌రెడ్డిది తాడేపల్లి. సింధు అంత్యక్రియలు తాడేపల్లిలో మంగళవారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

పలువురు నివాళి, సంతాపం

సింధు భౌతికకాయానికి సోమవారం రాత్రి తాడేపల్లిలోని ఆమె స్వగృహంలో పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు, జనరల్ మేనేజర్ కె.హరికిషోర్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి తదితరులు నివాళులర్పించారు. సింధు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, నాయకులు డి.వెంకటరెడ్డి, శ్రీనివాసకుమారి, శేషారత్నం, పి.గిరిజ, బి.శ్రీనివాసరావు, లక్ష్మణరావు తదితరులు సంతాపం తెలిపారు.

మున్సిపల్ కార్మికులపై పోలీసుల ప్రతాపం

(మొదటిపేజీ తరువాయి)

300 మందిని పోలీసులు అరెస్టు చేసి పోలీసు బ్యారెక్స్ ప్రాంతంలోని కల్యాణ మండపానికి తరలించారు. సాయంత్రం వారిని విడిచిపెట్టారు. దీనికి ముందు మున్సిపల్ కార్మికులు సరస్వతీ పార్కు వద్ద సభ నిర్వహించారు. తగరపువలస మార్కెట్ వద్ద చెత్తను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పర్యవేక్షణలో వాహనంతో తరలిస్తుండగా అడ్డుకున్నారు.

విజయనగరం కలెక్టరేట్‌ను మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు ముట్టడించారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్‌మోహన్‌రావుతో సహా 16 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం, సాలూరు, పాలకొండల్లో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద బైఠాయించారు.

రాజమహేంద్రవరం, నంద్యాల, ఏలూరు, కడపా, రాయచోటి కలెక్టరేట్లు, కర్నూలులో మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ధర్నా చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సందర్శించి సంఘీభావం తెలిపారు. మున్సిపల్ కార్మికులు శ్రీకాకుళంలో ధర్నా, భిక్షాటన చేశారు. ఆమదాలవలసలో మున్సిపల్ కార్మికుల సమ్మెకు ఐలూ రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డేపల్లి మోహనరావు సంఘీభావం తెలిపారు. గుంటూరు, నరసరావుపేట కలెక్టరేట్ల వద్ద మున్సిపల్ కార్మికులు బైఠాయించారు. తిరుపతిలో కలెక్టరేట్ వద్ద జోరు వానలోనూ ధర్నా చేశారు. చిత్తూరు జిల్లా కుప్పంలో పంగనామాలు పెట్టుకుని నిరసన తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నాలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి పాల్గొని మద్దతుగా మాట్లాడారు. ఏళ్ల తరబడి మున్సిపాల్టీలను నమ్ముకొని దళిత, గిరిజనులు, బలహీన వర్గాల వారు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారని, అలాంటి పేదల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం వివక్ష ప్రదర్శించడం దుర్మార్గమని అన్నారు. అనంతపురంలో కలెక్టరేట్లోకి చొచ్చుకెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తోపులాట చోటుచేసుకుంది. పుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట కార్మికులు మూడు గంటల పాటు నిరసన తెలిపారు. వీరికి సిపిఎం, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. నెల్లూరులో గాంధీ బొమ్మ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ బైఠాయించి ధర్నా చేశారు.


కార్మికులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

శ్రీనివాసరావు, మధు పరామర్శ

పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన కార్మికులను, నాయకులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపి మధు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీలు పోరాడుతున్నారని తెలిపారు. అరెస్టుల ద్వారా వారి ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే రానున్న రోజుల్లో జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వారి సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు.


తోపులాటలో స్పృహ కోల్పోయిన మున్సిపల్ కార్మికురాలు


నెల్లూరులో విద్యుత్ భవన్ ఎదుట నిరసన చేపట్టిన కార్మికులు

ఉద్యోగ భద్రత కల్పించండి

- విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - యంత్రాంగం

విద్యుత్ సవరణ చట్టం 2020ని రద్దు చేయాలని, సంస్థలో విలీనం చేయాలని, మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేపట్టారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఎపిఇపిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయాల ఎదుట సోమవారం ధర్నా చేశారు. 23,500 మంది కాంట్రాక్ట్ విద్యుత్తు కార్మికులను రెగ్యులర్ చేస్తామని పాదయాత్రలోనూ, అసెంబ్లీలోనూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం వద్ద, తిరుపతిలో జోరువానలోనూ ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నెల్లూరులోని విద్యుత్తు భవన్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. యుఇఇయు రాష్ట్ర అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు, సిఐటియు నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. గడిచిన 20 సంవత్సరాలుగా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. స్కిల్డ్ కార్మికులకు హైస్కిల్డ్ కార్మికులుగా అవకాశం కల్పించాలని, 2022వ సంవత్సరం పిఆర్‌సిని అమలు చేయాలని, అరియర్స్‌ను వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కడప విద్యుత్ ఎస్ఇ భవనం వద్ద ధర్నా నిర్వహించారు. కొత్త ఆపరేటర్లకు పాత ఆపరేటర్స్‌తో సమానంగా జీతాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించాలని ఒంగోలులో ఎస్ఇకి వినతిపత్రం అందజేశారు.


సిఎస్ జవహర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్మిక సంఘాలు నాయకులు

ఎస్మాను విరమించాలి

- సిఎస్‌కు కార్మిక సంఘాల వినతి
- నేడు రాష్ట్ర వ్యాప్త జైల్‌భరో

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెంబరు ఒకటి ద్వారా అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించిందని, దీన్ని విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని కార్మిక సంఘాలు కోరాయి. ఈ మేరకు ఆయనకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు, ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రనాథ్ సోమవారం వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ, మున్సిపల్, సమగ్రశిక్షా అభియాన్ సిబ్బంది సమస్యలపై చర్చించి పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. 2023 నుండి అంగన్‌వాడీలు వారి సమస్యలపై అధికారులను కలుస్తూనే ఉన్నాయని, విజ్ఞప్తులు చేశారని సిఎస్ దృష్టికి తీసుకొచ్చారు. గతేడాది మార్చి 23న పిడిఎఫ్ సభ్యులు వి బాలసుబ్రమణ్యం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వారి సమస్యలు తీసుకొచ్చారని తెలిపారు. దీనిపై స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి పరిశీలించి యూనియన్ నాయకులతో చర్చిస్తామని హామీనిచ్చారని పేర్కొన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకూ ఎటువంటి స్పందనా లేదని సిఎస్‌కు తెలిపారు. వీలైనంత త్వరలో వారి సమస్యలు పరిష్కరించాలని, ఎస్మాను రద్దు చేయాలని కోరారు. వినతిపత్రంపై ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు సంతకం చేశారు. అత్యవసర సమావేశం ఉండటంతో ఐఎఫ్‌టియు నాయకులు హాజరు కాలేకపోయినా మద్దతు తెలిపారు. కార్మిక సంఘాల నాయకులను కలిసిన వారిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కూడా ఉన్నారు.

మంత్రి, సిఎస్‌కు అంగన్‌వాడీ సంఘాల లేఖ

ఎస్మా ప్రయోగాన్ని రద్దు చేయాలని కోరుతూ.. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబీరాణి, కె సుబ్బరావమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి జె లలిత, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి జ్యోతి సోమవారం మంత్రి, సిఎస్‌తోపాటు, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, డైరెక్టర్‌కు ఉమ్మడిగా లేఖ రాశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగున్నరేళ్లలో వెయ్యి రూపాయలు మాత్రమే పెంచిందని తెలిపారు. ఏళ్ల తరబడి వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే అనివార్య పరిస్థితుల్లో సమ్మెకు దిగామని వారు పేర్కొన్నారు.


ఎపి రజక వృత్తిదారుల సంఘం వార్షిక కేలండరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, తదితరులు

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రజకులకు సామాజిక రక్షణ కల్పించేలా చట్టం చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో రజక వృత్తిదారుల సంఘం సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం వార్షిక కేలండరును ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆవిష్కరించి మాట్లాడారు. జనగణనను అన్ని కులాలకూ చేయాలన్నారు. కులగణన ద్వారా వెనుకబడిన కులాల సామాజిక స్థితి వెలుగులోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో కులగణన జరపాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో రజకుల సంక్షేమం కోసం రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రజక అభివృద్ధి సంక్షేమం కార్పొరేషన్ కేవలం అధికార పార్టీ నాయకులకు పదవులను కట్టబెట్టేందుకు ఉపయోగపడింది తప్ప ఎక్కడా రజకులకు రుణాలు ఇవ్వలేకపోయిందన్నారు. ఈ సందర్భంగా ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ.. రజకుల సమస్యలపై ఈ నెల 22న విశాఖపట్నంలో ప్రాంతీయ సదస్సును, 29న గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ ప్రాంతంలో రాష్ట్ర సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి గురుశేఖర్, కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మడక రాజు, లింగాల నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం ముందు ఆయుష్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తక్షణమే తమను విధుల్లోకి తీసుకోవాలని ఆయుష్ ఉద్యోగులు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాము అధికారంలోకి రాగానే ఆయుష్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారని నినాదాలు చేశారు. కేంద్ర కుటుంబ ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన రాష్ట్రంలో 451 ఆయుష్ వైద్యశాలలను మంజూరు చేసి, అందులో పనిచేసేందుకు 651 మందిని తీసుకున్నారని ఆయుష్ ఉద్యోగి కృష్ణ, సురేష్ తెలిపారు. 2009లో ప్రారంభించిన ఆయుష్ వైద్యశాలలను కేంద్రం నుంచి నిధులు రాలేదని 2017లో టిడిపి ప్రభుత్వం ఆయుష్ వైద్యశాలలను మూతవేయడంతో తామంతా రోడ్డున పడ్డామని తెలిపారు.

నడకమార్గాల్లో రక్షణ చర్యలు

- యాత్రికులు నిర్భయంగా శ్రీవారిని దర్శించవచ్చు : టిటిడి ఇఒ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమల నడకమార్గాల్లో అడవి జంతువుల నుంచి రక్షణ కోసం విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని, యాత్రికులు నిర్భయంగా నడకమార్గాల్లో శ్రీవారి దర్శనానికి రావొచ్చని టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో సోమవారం టిటిడి, ప్రభుత్వ అటవీ శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి డిఎఫ్ఒ, తిరుపతి సర్కిల్ సిసిఎఫ్, తిరుపతి డిఎఫ్ఒలు కలిసి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఇఒకు వివరించారు. ఇఒ మాట్లాడుతూ.. తిరుమల నడకదారిలో అడవి జంతువుల నుంచి యాత్రికుల రక్షణ కోసం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (వైల్డ్‌లైఫ్), ఎపి చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రెండుసార్లు సమావేశమై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందని తెలిపారు. నడక మార్గంలో యాత్రికుల రక్షణ కోసం తీసుకోవాల్సిన స్వల్ప, దీర్ఘకాలిక చర్యలను నివేదికలో పొందుపరిచారని తెలియజేశారు. స్వల్పకాలిక చర్యలను కొనసాగించాలని సూచించినట్టు చెప్పారు. దీర్ఘకాలిక చర్యలైన అడవి జంతువుల పర్యవేక్షణ, అందుకు కావలసిన భవన సదుపాయం, సిబ్బంది, వ్యూలైన్ల ఏర్పాటు, బయోఫెన్సింగ్ (పొదల కంచె), ఏరియల్ వాక్ వే, అండర్‌పాస్, ఓవర్ పాస్‌ల కోసం స్థల ఎంపిక ఇతర మౌలిక వసతులపై చర్చించారు. టిటిడి అందించిన రూ.3.75 కోట్లతో వన్యప్రాణుల పర్యవేక్షణకు కావాల్సిన కెమెరాట్రాప్‌లు, మానిటరింగ్ సెల్, వ్యూలైన్ల ఏర్పాటు, అవుట్ పోస్ట్‌ల నిర్వహణకు సత్వరం చర్యలు చేపట్టాలని తిరుపతి డిఎఫ్ఒను కోరారు. ఏడో మైలు నుండి లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం వరకు నడకదారికి ఇరువైపులా లైటింగ్ వసతి కల్పించాలని, మానిటరింగ్ సెల్ కోసం భవనాన్ని సమకూర్చాలని సిఇఒకు సూచించారు. తిరుమల నడకమార్గాల్లో ఏ రోజుకారోజు వ్యర్థాలను తొలగించాలని, తద్వారా అడవి జంతువులు రాకుండా చేయాలని ఆరోగ్యశాఖాధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జెఇఒ వీరబ్రహ్మం, సిసిఎఫ్ నాగేశ్వరరావు, తిరుపతి డిఎఫ్ఒ జి.సతీష్ పాల్గొన్నారు.



సత్యసాయి జిల్లా లేపాక్షిలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న రైతులు



చిత్తూరులో వర్షంలోనూ సమ్మెకు కొనసాగించిన అంగన్‌వాడీలు

ఎస్మాకు భయపడం

- కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
- పొర్లు దండాలతో నిరసన
- మంత్రి బొత్స కాన్వాయ్ అడ్డగింత

ప్రజాశక్తి - యంత్రాంగం

హామీల అమలు కోసం అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరింది. పలు జిల్లాల్లో జిఒ నంబర్ 2 జిఒ ప్రతులను దగ్ధం చేశారు. చెవులు, కళ్లు మూసుకుని, పొర్లు దండాలతో నిరసన తెలిపారు. జోరు వర్షంలోనూ చిత్తూరులో ఆందోళనను కొనసాగించారు. ఎస్మాతో తమను భయపెట్టలేరని, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లాల్లో మంత్రి బొత్స కాన్వాయ్‌ను అడ్డగించారు.

విజయవాడ ధర్నా చౌక్ వద్ద సమ్మెకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి, బెఫి రాష్ట్ర కార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్ర, కెవిపిఎస్ నాయకులు, ట్యాక్స్‌పేయర్స్ అసోసియేషన్ నాయకులు, ఆయా జిల్లాల నాయకులు మద్దతు పలికి మాట్లాడారు. ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని నినదించారు. నందిగామలో ఎస్మా ప్రయోగాన్ని నిరసిస్తూ గుంజీలు తీసి నిరసన తెలిపారు. కృష్ణాజిల్లా బంటుమిల్లిలో మెడకు ఉరితాడు బిగించుకొని నిరసన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కడియంలో ఎస్మా ప్రతులను దగ్ధం చేశారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఎస్మాను తీసుకురావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాకినాడలో అంగన్‌వాడీలు రిలే దీక్షలు నిర్వహించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు దీక్షలు కొనసాగించారు. వారి పోరాటానికి విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మద్దతు తెలిపారు. అనకాపల్లి కలెక్టరేట్ వద్ద దీక్షా శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సందర్శించి మద్దతుగా మాట్లాడారు. బుచ్చయ్యపేటలో చెవులు, కళ్లు మూసుకుని నిరసన చేపట్టారు. అల్లూరి జిల్లాలోని డుంబ్రిగుడలో చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన చేపట్టారు. రాజవొమ్మంగిలో సిపిఎం ఎఎస్ఆర్ జిల్లా కార్యదర్శి బి.కిరణ్, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు సంఘీభావం తెలిపారు. జోరు వర్షంలోనూ చిత్తూరు కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు దీక్ష చేపట్టారు. తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి, ఆమదాలవలసలో జిఒ నంబరు 2 ప్రతులను దగ్ధం చేశారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న దీక్షలకు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, టిఎన్‌టియు నాయకులు సంఘీభావం తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌కు దండం పెడుతూ బొబ్బిలి, గుమ్మలక్ష్మీపురంలో నిరసన తెలిపారు. సత్యసాయి జిల్లా సోమందపల్లి మండలంలో స్థానిక వాల్మీకి సర్కిల్ నుంచి వెంకటేశ్వర కల్యాణ మండపం వరకూ జ్యోతులు, కలశాలలు మోస్తూ నిరసన తెలిపారు. లేపాక్షిలో సమ్మెకు రైతులు మద్దతు తెలిపారు. కర్నూలు ధర్నా చౌక్ వద్ద, నంద్యాలలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట బైఠాయించారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు తదితరులు పాల్గొని మద్దతుగా మాట్లాడారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో సమ్మెకు కెవిపిఎస్ నాయకులు మద్దతు తెలిపారు. బాపట్లలో సమ్మె శిబిరం వద్ద నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద సమ్మెకు కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి సంఘీభావరం తెలిపారు. కంభంలోని కందులాపురం సెంటర్‌లో దీక్షలో పాల్గొన్న హజరత్ గూడెంకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త స్పృహ తప్పి పడిపోయారు. ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో ఎస్మా జిఒ కాపీలను దగ్ధం చేశారు. నూజివీడులో ర్యాలీ నిర్వహించి చిన్న గాంధీబొమ్మ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట, తణుకు, కాళ్ల, ఆచంట, నరసాపురంలో ఎస్మా జిఒ ప్రతులను దహనం చేశారు. వీరవాసరంలో సమ్మె శిబిరం వద్దకు మాజీ మంత్రి పీతల సుజాత వచ్చి సంఘీభావం తెలిపారు.నెల్లూరులో దీక్షలు కొనసాగాయి.



జీతాలు పెంచబోం

అడ్డుకున్న అంగన్‌వాడీలతో మంత్రి బొత్స

విజయనగరం జిల్లా మెంటాడ మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సావానికి వెళ్లి వస్తున్న మంత్రి బొత్స కాన్వాయ్‌ను గజపతినగరంలో అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. కారు దిగిన బొత్సకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, సిఐటియు నాయకులు వినతిపత్రం అందజేశారు. బొత్స మాట్లాడుతూ.. జీతం సమస్య తప్ప మిగతా డిమాండ్లన్నీ పరిష్కరించామని, తమతో చర్చించేందుకు వస్తే తాము సిద్ధమని తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. జీతం సమస్య ప్రధానంగా ఉందనీ, దాన్ని పక్కన పెట్టి మిగతా వాటిని పరిష్కరించామని చెప్పడం సరైనది కాదన్నారు. దీంతో ఆయన ఐదేళ్లకొకసారి జీతాలు పెంచుతాం గానీ ఇప్పుడు పెంచబోమని తేల్చి చెప్పారు. మళ్లీ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాతైనా ఫలానా జీతం ఇస్తామని ప్రకటించాలని, వైసిపి ఎన్నికల మేనిఫెస్టోలో తమ జీతం పెంపుపై ఏమైనా చేర్చారా? అని అంగన్‌వాడీలు ప్రశ్నించగా మంత్రి సమాధానం ఇవ్వలేదు.

వ్యర్థాల నిర్వహణకు పెద్దపీట

- పంచాయతీ రాజ్ శాఖ ప్రతిపాదన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

భవిష్యత్తులో వ్యర్థాల నిర్వహణకు పెద్దపీట వేయాలని పంచాయతీరాజ్ శాఖ భావిస్తోంది. దీనికోసం ప్రతి పంచాయతీకి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాలని ఆ శాఖ ప్రభుత్వాన్ని కోరుతోంది. బడ్జెట్ కసరత్తులో భాగంగా రానున్న ఆర్థిక సంవత్సరానికి

ఈ మేరకు రూపొందించిన ప్రతిపాదనలను ఆ శాఖ ఆర్థికశాఖకు అందచేసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం పిపిపి పద్దతిలో ఈ విధానాన్ని అమలు చేయాలని ఆ శాఖ ప్రతిపాదించింది. గ్రామ పంచాయతీ, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజా పరిషత్ స్థాయిలో సమగ్ర అభివృద్ధి ప్రణాళికను తయారుచేసి, వాటికి నిధులు కేటాయించాలని కోరింది. దీనిలో భాగంగా ప్రభుత్వ వంతు వాటాకు నిధులు కేటాయించాలని కోరింది. దాదాపుగా 21 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని ఆ శాఖ కోరినట్లు తెలిసింది. ఇంత భారీగా నిధులు కేటాయించడం ఎంతవరకు సాధ్యమన్న అంశంపై అధికారుల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో దాదాపు 21 వేలకుపైగా గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి సరైన నిధులు లేక సర్పంచుల వ్యవస్థ నిర్వీర్యమవుతోందన్న విమర్శలు తెలిసిందే.



రోడ్లు నిర్మించాలి

- ఐటిడిఎ డిఎ కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం కొండలపైన మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ భద్రగిరి ఐటిడిఎ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి నేటికి 77 ఏళ్లు గడిచినా మారుమూల కొండలపై గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడం విచారకరమన్నారు. ఎన్నో ప్రభుత్వాలు ఎంతోమంది పాలకులు మారినా గిరిజనుల అభివృద్ధి మాత్రం జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా గిరిజనుల పట్ల ప్రభుత్వాలు చూపుతున్న శ్రద్ధ అంటూ ప్రశ్నించారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేస్తున్న కోట్లాది రూపాయలు మంత్రులు, ఎమ్మెల్యేలు జేబుల్లోకి వెళ్తున్నాయి తప్ప గిరిజన ప్రాంతాభివృద్ధికి ఏ మాత్రమూ ఉపయోగించడంలేదని విమర్శించారు. నేటికీ చాలా గిరిజన గ్రామాల్లో డోలిలే శరణ్యమంటూ పలు పత్రికల్లో వార్తలు వస్తున్నా పాలకులు స్పందించకపోవడం దారుణమన్నారు. నేటికీ గిరిజనులు వెనుకబాటు జీవనం గడుపుతున్నారని పేర్కొన్నారు. సంఘం సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎ దిష్టిబొమ్మగానే మిగిలిందన్నారు. రోడ్డు మార్గాల్లేక, సకాలంలో వైద్యమందక ఎంతో మంది గిరిజనులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించాలని, తాగునీరందించాలని, వైద్య సౌకర్యం మెరుగుపర్చాలని గిరిజనులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, నాయకులు ఎం సన్యాసిరావు, బిడ్డిక ఆడిత్, బిడ్డిక శంకర్రావు పాల్గొన్నారు.

ఇసుక, మాంగనీస్ మైన్స్ రెన్యువల్ చేయాల్సిందే..

- విజయనగరం కలెక్టరేట్ ఎదుట విశాఖ ఉక్కు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి /కోట


విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ఇసుక, మాంగనీస్ ఓర్ తవ్వకాల అనుమతులను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో విజయనగరం కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా జరిగింది. సంఘం నాయకులతో పాటు ఉక్కు కార్మికులు వందలాది కార్లలో తరలివచ్చారు. వీరికి విజయనగరం జిల్లాకు చెందిన సిఐటియు, ఎఐటియుసి తదితర ట్రేడ్ యూనియన్ నాయకులు వై జంక్షన్‌లో స్వాగతం పలికారు. అక్కడి నుంచి సంతకాల వంతెన, ఆర్అండ్‌బి జంక్షన్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేపట్టారు. ప్లకార్డులు చేతబూని, ప్రభుత్వం, అధికారుల వైఖరికి నిరసనగా చేసిన నినాదాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఇన్‌గేట్‌ను పోలీసులు కొద్దిసేపు మూసివేశారు. ధర్నా అనంతరం డిఆర్ఒ అనితకు, మైన్స్ ఎడికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అనంతరం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ, కో-కన్వీనర్ అయోధ్యరామ్ మాట్లాడుతూ లక్షలాది మందికి ఉపాధి కల్పించే స్టీల్‌ప్లాంట్‌కు విజయనగరం జిల్లాలోని సారిపల్లి చంపావతి తీరంలోని ఇసుక, గరివిడి మండలం గర్భాంలోని మాంగనీస్ దశాబ్దాల తరబడి వస్తున్నాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ అంశాన్ని కార్మికులు అడ్డుకోవడంతో ఏడాదిన్నర క్రితం ముగిసిన గనుల అనుమతులను రెన్యువల్ చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలిపేశాయని విమర్శించారు. మునుపెన్నడూ ఇటువంటి పరిస్థితి ఏర్పడలేదని, లీజు కాలపరిమితి ముగిసిన వెంటనే అధికారులు రెన్యువల్ చేసేవారని తెలిపారు. దీనివల్ల స్టీల్‌ప్లాంట్ మనుగడ కష్టతరంగా మారుతోందని, ఫలితంగా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగుల ఉపాధికి భవిష్యత్తులో గండిపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ కుదేలైతే ఆ సంస్థ నుంచి రాష్ట్రానికి వచ్చే ఆర్థిక వనరులూ తగ్గిపోయే ప్రమాదం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ నాయకులు రామస్వామి, వైటి దాస్, ఎన్ రామచంద్రరావు, రామేశ్వరరావు, కోటేశ్వరరావు, మోహనరావు, సత్యనారాయణ, విజయనగరం సిఐటియు ప్రధాన కార్యదర్శి కె సురేష్, నాయకులు రెడ్డి శంకరరావు, యుఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఇన్‌గేట్ వద్ద ధర్నా చేస్తున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

భారత్‌కు ఎర్ర సముద్రం సెగ

- ఎగుమతుల్లో 30 బిలియన్ డాలర్లు తగ్గొచ్చు



న్యూఢిల్లీ : ఎర్ర సముద్రంలో నెలకొన్న అలజడి భారత్‌ను ఆందోళనకు గురి చేస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్న ఎగుమతుల్లో 30 బిలియన్ డాలర్ల వరకు క్షీణించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇటీవల ఎర్ర సముద్రంలో కార్గో ఓడలకు వచ్చే బెదిరింపులతో షిప్పింగ్ రేట్ల పెరుగుదలకు దారితీయడంతో పాటుగా ఎగుమతిదారులు ఎగుమతులను నిలిపివేసే అవకాశాలు మెండుగా ఉన్నాయని న్యూఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్ ప్రాథమికంగా అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తం 451 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. ఈ ఏడాది 6.7 శాతం తగ్గుదల చోటు చేసుకోవచ్చని అంచనా వేసింది.

"ఎర్ర సముద్రంలో సంక్షోభం భారత వాణిజ్యంపై ప్రభావం చూపుతుంది. ఇది మరింత పతనానికి దారితీయవచ్చు" అని రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్ డైరెక్టర్ జనరల్ సచిన్ చతుర్వేది పేర్కొన్నారు. కాగా.. ఎర్ర సముద్ర సంక్షోభం దేశ ఎగుమతులపై ఎలాంటి ప్రభావం చూపవచ్చునేది ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రపంచంలోని అతిపెద్ద షిప్ బ్రోకర్ అయిన క్లార్క్‌సన్ రీసెర్చ్ సర్వీసెస్ లిమిటెడ్ ప్రకారం.. సూయజ్ కెనాల్ గుండా ప్రయాణిస్తున్న నౌకల సంఖ్య డిసెంబర్ మొదటి సగం సగటుతో పోలిస్తే జనవరి 3వ తేది నాటి వారంలో 44 శాతం తగ్గింది.

యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుగల హౌతీ మిలిటెంట్లు ఇటీవలి ఎర్ర సముద్రం గుండా ప్రయాణిస్తున్న నౌకలను క్షిపణులతో లక్ష్యంగా చేసుకుంటున్నారని వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఎర్ర సముద్రం ద్వారా ఐరోపా, ఈస్ట్ కోస్ట్, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికన్ దేశాలకు భారత్ సరుకు రవాణ చేస్తోంది. ఎర్ర సముద్రం గుండా రవాణా చేసే దేశ ఎగుమతుల్లో నిలుపుదల అయ్యాయని భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోకి వచ్చే ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ పేర్కొన్నారు. ఆసియా నుండి ఉత్తర ఐరోపాకు 40 అడుగుల కంటైనర్‌లో వస్తువులను రవాణా చేసే వ్యయాలు 173 శాతం పెరిగాయన్నారు. ఆసియా నుండి ఉత్తర అమెరికా తూర్పు తీరం వరకు ధరలు 40 అడుగుల కంటైనర్‌కు 55 శాతం పెరిగి 3,900 డాలర్లకు చేరుకున్నాయన్నారు. భారత్ సాధారణంగా ఎర్ర సముద్ర మార్గాన్ని ఉపయోగించి పెట్రోలియం ఉత్పత్తులు, తృణధాన్యాలు, రసాయనాలతో సహా అనేక రకాల వస్తువులను ఎగుమతి చేస్తుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ సమయంలో ఎగుమతులు 6.5 శాతం పతనమయ్యాయి. అధిక గ్లోబల్ రవాణ ఛార్జీలు, బీమా రేట్లు ద్రవ్యోల్బణాన్ని పెంచే అవకాశాలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రంలో గిరిజనులకు భరోసా

- ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు
- సంక్షేమ పథకాలు, హక్కులపై చైతన్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గిరిజనులందరికీ భరోసా కల్పించడమే ఎస్‌టి కమిషన్ ప్రధాన ఉద్దేశమని, దీనిలో భాగంగా వారికి అమలవుతున్న సంక్షేమ పథకాలు, పొందాల్సిన హక్కులపై వారిని చైతన్యం చేస్తున్నామని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు అన్నారు. సోమవారం కమిషన్ కార్యాలయంలో గిరిజనుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. అనంతరం ఆయన్ను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్‌టి కమిషన్ గిరిజనులందరికీ అండగా ఉంటుందనే అవగాహన ఇప్పటికీ లేదని, దీన్ని కల్పించే పని చేస్తున్నామని తెలిపారు. కొన్ని చట్టపరమైన అంశాలపై కలెక్టర్లకు సూచనలు చేసే అధికారం కమిషన్‌కు ఉందని అన్నారు. రాష్ట్రంలో ఏడు ఐటిడిఎల పరిధిలో ఉంటున్న గిరిజనులు ఇప్పటికీ అనేక విషయాల్లో అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారికి సంబంధించి ఆర్ఒఎఫ్ఆర్ పట్టాల విషయంలో ఇప్పటికీ ఫారెస్ట్, రెవెన్యూ విభాగాల మధ్య సమస్యలున్నాయని, చాలాచోట్ల పట్టాలున్నా భూములు ఎక్కడున్నాయో తెలియదని, వాటికి విద్యుత్ సరఫరా సదుపాయం లేకపోవడంతో మోటార్లు వేసుకునే అవకాశం లేక సాగుకు పనికి రావడం లేదని తెలిపారు. పట్టాలు ఇచ్చిన భూముల్లో వేరేవారు సాగులో ఉంటున్నారని కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారంపై ఎస్‌టి కమిషన్ దృష్టి సారించిందన్నారు. ఇప్పటికీ చాలా మంది గిరిజనులకు ఎస్‌టి కమిషన్‌ను ఎలా వినియోగించుకోవాలో తెలియడం లేదని పేర్కొన్నారు.

న్యాయం చేయాలని పాతనాతల గ్రామస్తుల వినతి

సుదీర్ఘకాలంగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని, అధికారులు సర్వే చేసినా పట్టించుకోవడం లేదని తిరుపతి జిల్లా డక్కిలి మండలం పాతనాతల గ్రామానికి చెందిని ఎస్‌టిలు కమిషన్ ఛైర్మన్ శంకరరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. 1984లో సర్వే చేసి భూములు కేటాయించినా ఇంతవరకు పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పుడు ఆ భూములు వేరేవారివని చెబుతున్నారని అన్నారు. 70 ఏళ్ల వృద్ధురాలు కన్నీటి పర్యంతమయ్యారు. దీనికి స్పందించిన ఛైర్మన్ వారికి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయులపై నిర్బంధం

- ధర్నాకు విజయవాడ వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విజయవాడలో తలపెట్టిన 36 గంటల ధర్నాకు వెళ్లకుండా యుటిఎఫ్ నాయకులను, ఉపాధ్యాయులను అనకాపల్లి జిల్లాలో ఎక్కడికక్కడ ప్రభుత్వం నిర్బంధించింది. ప్రతి నెలా ఒకటిన వేతనాలు చెల్లించాలని, ఆర్థిక బకాయిలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళ, బుధ వారాల్లో విజయవాడలో ధర్నాకు యుటిఎఫ్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీనికి ఉపాధ్యాయులు తరలివెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి పోలీసులు టీచర్ల ఇళ్లకు, స్కూళ్లకు వెళ్లి ముందస్తు అరెస్టులు చేశారు. యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్‌ను చోడవరం పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి నిర్బంధించారు. బుచ్చెయ్యపేట మండలం సంఘం అధ్యక్షులు కామరాజుకు 151 నోటీసు అందజేశారు. గొలుగొండలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గాయత్రిని, కోటవురట్లలో మండల అధ్యక్షులు నరసింగరావును, పరవాడలో మండల అధ్యక్షులు బాలరాజును, సంఘం మండల అధ్యక్షులు భాస్కరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2023 సెప్టెంబర్‌లో బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి అమలుచేయకపోడం, పదో తేదీ దాటినా ఒక్కో నెల జీతాలు ప్రభుత్వం చెల్లించడం, పిఆర్‌సి బకాయి, డిఎ, పిఎఫ్, రిటైర్మెంట్ సదుపాయాలు ఇవ్వకపోవడంతో ఈ ధర్నాకు యుటిఎఫ్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.



చోడవరం పోలీస్ స్టేషన్‌లో యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయ్

ఫ్లిప్‌కార్ట్‌లో 7% ఉద్యోగులపై వేటు..!

న్యూఢిల్లీ : ప్రముఖ ఇ-కామర్స్ వేదిక ఫ్లిప్‌కార్ట్ భారీగా ఉద్యోగులను తొలగించనుంది. పొదుపు చర్యల్లో భాగంగా వందలాది మందిని ఇంటికి పంపించడానికి కసరత్తు చేస్తుందని రిపోర్టులు వస్తున్నాయి. సిబ్బంది పనితీరు ఆధారంగా ఐదు శాతం నుంచి ఏడు శాతం ఉద్యోగులను తొలగించే యోచనలో ఉంది. ఏడాది కాలంగా కొత్త నియామకాలను నిలిపివేసింది. గత రెండేళ్లుగా వార్షిక పనితీరు ఆధారంగా ఉద్యోగులను తొలగిస్తూ వస్తుంది. వచ్చే మార్చి-ఏప్రిల్ నాటికి తొలగింపుల ప్రక్రియను పూర్తి చేసే పనిలో ఉంది. మింత్రా మినహా ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్‌లో 22 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో నుంచి 1100-1500 మందిని ఇంటికి పంపించే ప్రక్రియను ప్రారంభించిందని సమాచారం.



ఇప్పటికే స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ ద్వారా నిధులు సమకూర్చుకోవాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే పొదుపు చర్యలకు దిగుతోందని నిపుణులు భావిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం


- గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దొరబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేందుకు గృహ నిర్మాణశాఖ డైరెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దావులూరి దొరబాబు అన్నారు. లబ్ధిదారులతో సమన్వయం చేసుకుంటూ లక్ష్యాలు పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు. గృహ నిర్మాణ సంస్థ బోర్డు 14 మంది డైరెక్టర్ల పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఈ నేపథ్యంలో విజయవాడలోని గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఛైర్మన్ దొరబాబు అధ్యక్షతన 35వ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డి లక్ష్మీశా, బోర్డు డైరెక్టర్లు కె భాస్కరనాయుడు, కె విజయ్‌కుమార్, రమాదేవి, పెద్దిరాజు, ఉప్పడ శివారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు బి చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీరు జివి ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర డిప్యూటీ సిఎంపై తెలంగాణలో కేసు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో



రాష్ట్ర డిప్యూటీ సిఎం కళత్తూరు నారాయణస్వామిపై తెలంగాణలో కేసు నమోదు అయ్యింది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం వెనుక సోనియా గాంధీ ఉన్నారని వ్యాఖ్యానించడంతో ఆయనపై తెలంగాణా కాంగ్రెస్ నేతలు బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపి మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే నగేశ్ పోలీసులను కోరారు.

సెన్సెక్స్ 670 పాయింట్లు ఫట్

ముంబయి : అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల ప్రభావంతో భారత మార్కెట్లు భారీ నష్టాలు చవి చూశాయి. సోమవారం బిఎస్ఇ సెన్సెక్స్ 670 పాయింట్లు పతనమై 71,355కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 198 పాయింట్ల నష్టంతో 21,513 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలకు తోడు ఈ వారంలో వెలుపడనున్న టెక్ కంపెనీల త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహారించారు. దీంతో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. సెన్సెక్స్-30లో అదాని పోర్ట్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఒఎన్‌జిసి, హీరో మోటార్స్, పవర్ గ్రిడ్ సూచీలుగా అధికంగా లాభపడగా.. యుపిఎల్, ఎస్‌బిఐ, ఎస్‌బిఐ లైఫ్ ఇన్స్యూరెన్స్, దివిస్ ల్యాబ్స్ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

హ్యుందాయ్ రూ.6వేల కోట్ల పెట్టుబడులు

చెన్నయ్ : ప్రముఖ వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా భారీ పెట్టుబడులను ప్రకటించింది. తమిళనాడులో కొత్త ప్రాజెక్టల కోసం మరో రూ.6,180 కోట్ల పెట్టుబడుల ప్ర ణాళికలను వెల్లడించింది. ఇందుకోసం తమిళనాడు 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ 2024' కార్యక్రమంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించింది. ఈ మొత్తం గతంలో ప్రకటించిన పెట్టుబడులకు అదనమని వెల్లడించింది. వచ్చే పదేళ్లలో తమిళనాడులో రూ.20 వేల కోట్లతో విద్యుత్తు వాహనాల తయారీ, ఇవి ఛార్జింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయడంతోపాటు నైపుణ్య శిక్షణ కోసం పెట్టుబడులు పెట్టనున్నట్లు గతంలో ప్రకటించింది.

సంపాదకీయం


బాధితులకు భరోసా

గుజరాత్‌లో 2002 నాటి అల్లర్లలో బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, ఏడుగురు కుటుంబ సభ్యులను హత్య చేసిన దోషులకు జైలు శిక్ష తగ్గించి క్షమాభిక్ష పెట్టి ముందస్తుగా విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు పరుస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం సోమవారం వెలువరించిన తీర్పు స్వాగతించదగినది. రెండు వారాల్లోగా దోషులందరూ జైలుకు వెళ్లాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. కేంద్ర బిజెపి ప్రభుత్వ అండతో 'పరివార్' శక్తులు మత ప్రాతిపదికన సమాజాన్ని నిట్ట నిలువునా చీల్చి రాజకీయ పబ్బం గడుపుకుంటున్న తరుణంలో సుప్రీం ఇచ్చిన తీర్పు లౌకిక, ప్రజాస్వామిక వాదులకు ఆశాకిరణం. నాటి గుజరాత్, నేటి మణిపూర్ సహా దేశ వ్యాప్తంగా అత్యాచారాలు, దాడులకు గురవుతున్న అబలలకు సుప్రీం తీర్పు కాస్తంత ఉపశమనం కలిగిస్తోంది. బిల్కిస్ కేసులో సుప్రీం లేవనెత్తిన అంశాలు రాజ్యాంగం, చట్టాలు, ప్రజాస్వామ్యం ఉనికిని ప్రశ్నార్థకం చేశాయి. రేప్ కేసుల్లో శిక్ష పడ్డ దోషులకు క్షమాభిక్ష కూడదన్న కనీస విచక్షణను గుజరాత్ ప్రభుత్వం పాటించలేదు సరికదా తన నిర్ణయాన్ని సమర్ధించుకునేందుకు కోర్టును మోసం చేసింది. కేసు విచారణ మహారాష్ట్రలో జరిగినందున ముద్దాయిల క్షమాభిక్షకు మహారాష్ట్ర ప్రభుత్వానికే అధికారం ఉంది. మహారాష్ట్ర సర్కారు, కింది కోర్టులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా గుజరాత్ ప్రభుత్వం పట్టించుకోలేదు. గుజరాత్ ప్రభుత్వ ఉద్దేశపూర్వక తప్పిదాలను, చట్ట, నిబంధనల ఉల్లంఘనలను సుప్రీం ఎత్తిచూపింది. దీన్నిబట్టి గుజరాత్ ప్రభుత్వం దోషులను ఎంతగా వెనకేసుకొచ్చిందో అర్థమవుతుంది.

దేశంలో బిల్కిస్ బానో ఉదంతం తెలియని వారు లేరు. గుజరాత్‌లో నరేంద్ర మోడీ సర్కారు అధికారంలో ఉండగా 2002లో పెచ్చరిల్లిన 'గోధ్రా' మత మారణహోమాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. ఆ సమయంలో దహోద్ జిల్లాలో 21 ఏళ్ల బిల్కిస్ బానో గ్యాంగ్ రేప్‌నకు గురైంది. అప్పుడు ఆమె ఐదు నెలల గర్భవతి. మూడేళ్ల కుమార్తెతో సహా ఆమె ఏడుగురు కుటుంబ సభ్యులూ క్రూరంగా హత్యకు గురయ్యారు. సిబిఐ విచారణ అనంతరం 2008లో 11 మందిని దోషులుగా నిర్ధారించిన కోర్టులు యావజ్జీవ కారాగార శిక్ష విధించాయి. పధ్నాలుగేళ్ల జైలు అనంతరం గుజరాత్ ప్రభుత్వం దోషులకు క్షమాభిక్ష అమలు చేసి 2022 ఆగస్టు 15న విడుదల చేసింది. దేశం 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న తరుణాన, ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పేరిట మోడీ ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహిస్తున్న వేళలోనే, గ్యాంగ్ రేప్, ఊచకోత దోషులకు గుజరాత్ బిజెపి సర్కారు స్వేచ్ఛ ప్రసాదించింది! ఇదీ మోడీ వల్లిస్తున్న 'బేటీ బచావో'.

బిల్కిస్ బానో కేసు దోషుల విడుదలలో తప్పు కేవలం గుజరాత్ ప్రభుత్వానిదే కాదు. కేంద్రం అనుమతితోనే దోషులను విడుదల చేశామని గుజరాత్ ప్రభుత్వం వెల్లడించడాన్ని మర్చిపోకూడదు. కనుక దోషుల విడుదలలో కేంద్రం పాత్ర పుష్కలంగా ఉందని స్పష్టమవుతోంది. గోధ్రా జైలు నుంచి విడుదలైన దోషులను ఏదో సాధించిన పోరాట యోధులకు మల్లే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పి కార్యకర్తలు స్వాగతాలతో భారీ ఊరేగింపులు నిర్వహించడం గమనార్హం. భీమాకోరేగావ్ కేసులో పలువురిపై రాజద్రోహం కేసు బనాయించి ఏళ్లతరబడి జైలులో నిర్బంధించింది బిజెపి సర్కారు. నిందితుడైన 80 ఏళ్ల వృద్ధుడు ఫాదర్ స్టాన్ స్వామి కనీసం తాగడానికి మంచినీళ్లు ఇవ్వని కారణంగా జైలులోనే తనువు చాలించాడు. రేప్, మర్డర్ కేసులో దోషులకు మాత్రం క్షమాభిక్షలు, లెక్కలేనన్ని తడవలు పెరోల్స్ బిజెపి నీతి. ప్రజలు, ముఖ్యంగా మహిళలు బిజెపి నైజాన్ని అర్థం చేసుకొని తగిన గుణపాఠం చెప్పాలి. బెదిరింపులను తట్టుకొని రాజ్యాన్ని ఎదిరించి న్యాయం కోసం దశాబ్దాలపాటు పోరాడిన బిల్కిస్ బానో మహిళలకు పోరాట దివిటీ. బాధితులకు స్ఫూర్తి.

మహనీయుల మాట



తెలివైన వారెప్పుడూ
కాలాన్ని క్షణం కూడా
వృథా చేయకుండా
సద్వినియోగం చేసుకుంటారు.

- జాన్ రస్కిన్,
ఆంగ్ల రచయిత, తత్వవేత్త.



డాలర్‌నే దేశ కరెన్సీగా మారిస్తే...?

అర్జెంటీనా కొత్త దేశాధ్యక్షుడు జేవియర్ మిలై ఒక కొత్త ప్రతిపాదన చేశాడు. తమ దేశ రిజర్వు బ్యాంకును ఏకంగా రద్దు చేసేసి అమెరికన్ డాలర్లనే తమ దేశ కరెన్సీగా ప్రకటించాలన్నదే అతగాడి ప్రతిపాదన. ఒక దేశపు కరెన్సీని డాలర్‌తో మారకం చేసే రేటును స్థిరంగా కొనసాగించడం వేరు. ఏకంగా దేశీయ కరెన్సీనే రద్దు చేసి డాలర్‌నే తమ కరెన్సీగా స్వీకరించడం వేరు. డాలర్‌తో స్థిరమైన మారకపు రేటు కలిగి వుండి, దేశానికి గనక స్వంత కరెన్సీ, స్వంత రిజర్వు బ్యాంక్ ఉంటే అప్పుడు ఆ దేశంలో దేశీయ కరెన్సీకి అదనంగా డిమాండ్ పెరిగినప్పుడల్లా ఆ మేరకు ఆ రిజర్వు బ్యాంక్ ముద్రించుకోవచ్చు. ఈ లోపు దేశీయ కరెన్సీ వాడకం నుండి డాలర్ల వైపు మారిపోకుండా కొన్ని నియంత్రణ చర్యలను కూడా తీసుకోవచ్చు. అలా చేస్తే కరెన్సీ మారకం రేటు స్థిరంగా కొనసాగుతుంది. కాని దేశీయ కరెన్సీని, రిజర్వు బ్యాంకును రద్దు చేసేసి ఏకంగా అమెరికన్ డాలర్లనే దేశీయ కరెన్సీగా వాడడం అంటే అది పూర్తి మార్పు.

ఈ తేడా ఏమిటో అర్థం కావడానికి ఒక ఉదాహరణ : ఒకానొక స్థాయిలో దేశ జిడిపి, ధరలు వడ్డీ రేట్లు నిలకడగా ఉన్నప్పుడు దేశంలో మొత్తం కరెన్సీకి డిమాండు 100 యూనిట్లు ఉందనుకుందాం. కాని అందుబాటులో ఉన్న కరెన్సీ 90 యూనిట్లే ఉందనుకుందాం. అప్పుడు రిజర్వు బ్యాంకు ఆ కొరవ 10 యూనిట్ల కరెన్సీని ముద్రించి విడుదల చేయవచ్చు. అలా చేసినందువలన డాలర్‌తో ఉన్న స్థిర మారకపు రేటు మారిపోదు. అదే డాలర్‌నే దేశీయ కరెన్సీగా స్వీకరిస్తే ఏమౌతుంది? అప్పుడు ఒకానొక స్థాయిలో జిడిపి ఉండి, ధరలు, వడ్డీ రేట్లు స్థిరంగా ఉన్నప్పుడు దేశంలో 100 డాలర్ల కరెన్సీకి డిమాండ్ ఉందనుకుందాం. కాని అందుబాటులో 90 డాలర్ల కరెన్సీ మాత్రమే ఉందనుకుందాం. అప్పుడు అదనంగా కావలసిన 10 డాలర్లనూ మన దేశం ముద్రించలేదు కదా (దేశీయ రిజర్వు బ్యాంకు రద్దయిపోయింది కనుక). అది అమెరికన్ ఫెడరల్ రిజర్వు చేయవలసిన పని. అప్పుడు దేశం ముందు ఉన్న పరిష్కారాలు-(అ) ఏదో ఒక విధంగా డాలర్లను సంపాదించడం, (ఆ) విదేశాల నుండి డాలర్లను అప్పు తెచ్చుకోవడం, అవసరమైతే దేశ పబ్లిక్ సంస్థలను అమ్మేయడం. ఈ రెండింటిలో ఏదో ఒకటి చేస్తేనే దేశ జిడిపి ఇప్పుడున్న స్థాయిలో కొనసాగుతుంది. ఈ రెండు పరిష్కారాలూ కూడదు అనుకుంటే అప్పుడు మన దేశ జిడిపిని మన దగ్గర లభిస్తున్న డాలర్ల మేరకు పరిమితం చేసుకోవాలి. రిజర్వు బ్యాంకును ఉపయోగించుకుని అవసరమైన అదనపు కరెన్సీని ముద్రించడం అనే పరిష్కారం ఇప్పుడు లేదు.



ప్రభాత్ పట్నాయక్

మరో విధంగా చెప్పాలంటే డాలర్‌నే దేశీయ కరెన్సీగా స్వీకరిస్తే మన విదేశీ రుణభారం పెరిగిపోతుంది. లేదా మన దేశ సంపదను విదేశాలకు అమ్ముకోవలసి వస్తుంది. అప్పుడు మన దేశ సంపద తరిగిపోతుంది. ఇలా జరగడానికి కారణం మనం ఆదాయం కన్నా ఎక్కువ ఖర్చు చేయడం కాదు (మన ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువ చేస్తే అప్పుడు విదేశీ చెల్లింపుల ఖాతాలో లోటు పెరుగుతుంది). మనకు చెలామణీ కోసం అవసరమైన కరెన్సీ కన్నా తక్కువ పరిమాణంలో కరెన్సీ అందుబాటులో ఉండడం వలన ఇలా జరుగుతుంది.

డాలర్‌నే దేశీయ కరెన్సీగా స్వీకరిస్తే మన విదేశీ రుణభారం పెరిగిపోతుంది. లేదా మన దేశ సంపదను విదేశాలకు అమ్ముకోవలసి వస్తుంది. అప్పుడు మన దేశ సంపద తరిగిపోతుంది. ఇలా జరగడానికి కారణం మనం ఆదాయం కన్నా ఎక్కువ ఖర్చు చేయడం కాదు (మన ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువ చేస్తే అప్పుడు విదేశీ చెల్లింపుల ఖాతాలో లోటు పెరుగుతుంది). మనకు చెలామణీ కోసం అవసరమైన కరెన్సీ కన్నా తక్కువ పరిమాణంలో కరెన్సీ అందుబాటులో ఉండడం వలన ఇలా జరుగుతుంది.



ఒకవేళ విదేశీ రుణ భారం పెరగకుండా ఉండాలంటే మన దేశ ఆర్థిక వ్యవస్థను కుదించుకోవలసి వుంటుంది. ఇదెందుకు జరుగుతుందో చూద్దాం. ఉదాహరణకు: దేశ ఆర్థిక వ్యవస్థ సమతూకంగా ఉందనుకుందాం (లోటూ లేకుండా, మిగులూ లేకుండా ఉండడం, విదేశీ రుణాలూ లేకుండా, విదేశీ కరెన్సీ నిల్వలూ లేకుండా ఉండడం). అప్పుడు దేశం నుండి సాగే ఎగుమతుల్లో 10 డాలర్ల మేరకు పెరుగుదల వచ్చిందనుకుందాం. దేశం దిగుమతుల విలువ జిడిపిలో 10 శాతంగా ఉందనుకుందాం. అప్పుడు దేశ జిడిపిలో 100 డాలర్లకు మించి పెరుగుదల ఉండడానికి వీలులేదు (100 డాలర్ల మేరకు జిడిపి పెరిగితే దిగుమతులు 10 డాలర్లమేరకు పెంచుకోవచ్చు. ఎగుమతుల వలన 10 డాలర్లు అదనంగా వచ్చాయి కనుక డాలర్‌కు డిమాండ్ స్థిరంగా ఉంటుంది. ఒకవేళ దేశ ఆర్థిక వ్యవస్థలో 100 డాలర్ల కన్నా అదనంగా పెరుగుదల సాధించే అవకాశాలు ఉన్నా జిడిపి పెరుగుదలను 100 డాలర్లకే పరిమితం చేయాలి. ఒకవేళ జిడిపి 200 డాలర్లు పెరిగితే అప్పుడు దిగుమతులు 20 డాలర్లు పెరుగుతాయి. కాని అదనంగా ఎగుమతులద్వారా వచ్చినవి 10 డాలర్లే. అప్పుడు డాలర్లకు కొరత ఏర్పడుతుంది. ఆ కొరత పూడ్చడానికి అప్పు చేయాల్సివస్తుంది). ఐతే దీనికీ ఒక సమస్య ఉంది. 100 డాలర్ల మేరకు దేశ జిడిపిని పెంచుకోవాలంటే ఆ అదనపు పెరుగుదలకు తగినట్టు రిజర్వు కరెన్సీ ఏర్పాటు చేసుకోవాలి. జిడిపిలో రిజర్వు కరెన్సీ 10 శాతం ఉండాలి అనుకుంటే అప్పుడు అదనపు 100 డాలర్ల జిడిపి పెరుగుదలను ఇముడ్చుకోడానికి అదనంగా 10 డాలర్ల రిజర్వు కరెన్సీ కావాలి. ఎగుమతుల ద్వారా సంపాదించిన 10 డాలర్లు పెరిగే దిగుమతులకు చెల్లించడానికి సరిపోతాయి. మరి 100 డాలర్ల అదనపు జిడిపి పెరుగుదలకు అవసరమయ్యే డాలర్లు ఎక్కడినుంచి తేవాలి? అంటే విదేశీ రుణం తేవాలి. విదేశీ రుణం పెరగకూడదు అనుకుంటే 100 డాలర్ల జిడిపి పెరుగుదల గురించి మరిచిపోవాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ముడుచుకుని ఉండాల్సి వస్తుంది.

> **సంక్షోభం ముదురుతున్న కొద్దీ అర్జెంటీనా వంటి దేశాల నుండి జరిగే ఎగుమతులు మరింతగా ముడుచుకు పోతాయి. దేశంలో నిరుద్యోగం మరింత పెరుగుతుంది. వేతనాలు మరింత తగ్గుతాయి. దేశీయ కరెన్సీగా డాలర్లనే స్వీకరిస్తే అప్పుడు ఆర్థిక వ్యవస్థ రెట్టింపు వేగంతో ముడుచుకు పోయి సంక్షోభం మరింత వ్రతరమౌతుంది. ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడం ఒక్కటే ప్రస్తుత సమస్యకు పరిష్కారం. అది జరగాలంటే నయా ఉదారవాద ఆర్థిక విధానాల చట్రాన్ని అధిగమించాల్సిందే. ప్రత్యామ్నాయ విధానాలను చేపట్టవలసిందే.**

ఏదోవిధంగా జిడిపిలో వృద్ధి కావాలంటే అదనంగా సంపాదించిన 10 డాలర్లలో 5 డాలర్లను మాత్రమే దిగుమతులకోసం ఖర్చు చేసి తక్కిన 5 డాలర్లనూ జిడిపి వృద్ధికి కావలసిన రిజర్వు కరెన్సీగా ఉపయోగించాలి. అంటే అప్పుడు జిడిపి 50 డాలర్ల మేరకు మాత్రమే పెరిగే అవకాశం ఉంటుంది. కాని దేశానికి కావలసిన దిగుమతులు కుదించుకుపోతాయి.

దేశీయ కరెన్సీనే ఉపయోగిస్తే అప్పుడు మన దేశంలో సంపద వృద్ధి ఎంత జరుగుతుందో అంతమేరకూ మన కరెన్సీని రిజర్వుబ్యాంకు ద్వారా ముద్రించుకోవచ్చు. ఆ వెసులుబాటు ఉంటుంది. అదే బలమైన కరెన్సీ కాబట్టి అమెరికన్ డాలర్లనే మన దేశీయ కరెన్సీగా ఉపయోగిద్దాం అనుకుంటే మనకు అదనంగా కావలసిన డాలర్లను అమెరికా ఎందుకు ముద్రిస్తుంది? అప్పుడు సంపద వృద్ధిని బట్టి కరెన్సీ ముద్రణ అనే విధానం కాకుండా డాలర్ల లభ్యతను బట్టి మన దేశ సంపద వృద్ధి అన్న విధానం అమలు చేయలవలసి వస్తుంది. లేదా మనకు అదనంగా కావలసిన డాలర్లను విదేశీ రుణాల ద్వారా తెచ్చుకుని దేశ సంపదను పెంచుకుందాం అనుకుంటే ఈ పెంచిన సంపద కాస్తా ఆ విదేశీ రుణాల చెల్లింపుకే సరిపోతుంది.

డాలర్‌ను దేశీయ కరెన్సీగా ఉపయోగించడం వలన జిడిపి వృద్ధి జరగకుండా ఆర్థిక వ్యవస్థ ముడుచుకు పోతుందని పైన వివరించడం జరిగింది. అలా ఆర్థిక వ్యవస్థ ముడుచుకుపోతే అప్పుడు పొదుపు చర్యలకు పూనుకోవలసి వుంటుంది. అంటే జీతాల కోత, పెన్షన్ల కోత, ఉపాధిలో కోత వంటివి అమలు చేయాల్సి వుంటుంది. ఇవేవీ చేయకూడదు అంటే జిడిపిలో వృద్ధి ఉండాలి. అంటే విదేశీ రుణం తీసుకోవాలి. అప్పుడు తాత్కాలికంగా ఈ కోతలను ఆపవచ్చు. కాని ఆ రుణాన్ని తిరిగి చెల్లించవలసి వచ్చినప్పుడు ఇప్పుడు ఆపే కోతలకు రెట్టింపు మోతాదులో సంక్షేమంలో కోతలు విధించాల్సి వస్తుంది.

మరి ఇంత సమస్యాత్మకంగా ఉన్నప్పుడు దేశీయ కరెన్సీని కాదని, డాలర్లనే దేశీయ కరెన్సీగా స్వీకరించడం ఎందుకు? అర్జెంటీనా విషయమే చూస్తే అక్కడ ద్రవ్యోల్బణం చాలా ఎక్కువగా, ఏడాదికి 150 శాతం చొప్పున ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ద్రవ్యోల్బణానికి ఒకే ఒక మందు. మార్కెట్‌లో డిమాండ్ తగ్గించడం. అంటే ఉద్యోగాలలో కోత లేదా జీతాలలో కోత విధించడం. ఈ రెండూ నేరుగా చేయకుండా జేవియర్ మైలీ దేశ కరెన్సీని రద్దు చేసి డాలర్‌నే దేశ కరెన్సీగా ప్రతిపాదిస్తున్నాడు. అలా మార్చినందువలన కూడా మళ్ళీ పొదుపు చర్యలకే దిగాల్సి వుంటుంది. అంటే ఉద్యోగాలలో, జీతాలలో కోత. నేరుగా ఆ పని చేయకుండా డాలర్ ఆర్థిక వ్యవస్థను తెస్తానని చెప్పడం జేవియర్ మైలీ మోసకారితనానికి నిదర్శనం.

ఇంత భారీ ద్రవ్యోల్బణానికి కారణం ఏమిటి? గత అధ్యక్షుడు మాక్రి (ఇతగాడూ మితవాద నాయకుడే) దేశం నుండి ప్రైవేటు పెట్టుబడి విదేశాలకు తరలిపోతున్నందువలన దానికి పర్యవసానంగా ఏర్పడిన విదేశీ చెల్లింపుల లోటును భర్తీ చేయడానికి పెద్ద ఎత్తున విదేశీ రుణాలను తీసుకున్నాడు. అంతే తప్ప దేశంలోని సంపద విదేశాలకు తరలిపోకుండా నియంత్రించే చర్యలు తీసుకోలేదు. అలా తీసుకున్న విదేశీ రుణాలను తిరిగి చెల్లించవలసిన సమయం వచ్చేసరికి మళ్ళీ విదేశీ చెల్లింపులలో లోటు పెరిగిపోయింది. దీని కారణంగా దేశీయ కరెన్సీ విలువ బాగా తగ్గించుకోవలసి వచ్చింది. దాని వలన దిగుమతులకు ఎక్కువ ఖరీదు చెల్లించవలసి వచ్చింది. ఆ అదనపు ఖర్చు అంతిమంగా ప్రజలు వినియోగించే సరుకుల మీద పడింది. దాంతో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.

అసంఘటిత కార్మికులు పెద్ద సంఖ్యలో ఉంటే వారి వేతనాలు పెరిగే ధరలతో ముడిపడి వుండవు గనుక ధరలు పెరిగినా వారి వేతనాలు పెరగవు. కాని అర్జెంటినాలో కార్మికులందరి వేతనాలూ ధరల సూచికతో లింకు అయివున్నాయి. అందుచేత వారి వేతనాలు కూడా ధరల పెరుగుదలతోబాటు పెంచవలసి వస్తుంది. అంటే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయలేని స్థితి వచ్చింది.

ఇప్పుడు పరిస్థితిని అదుపులోకి తేవాలంటే పెట్టుబడుల వలసలను నియంత్రించాలి. డాలర్‌కు అర్జెంటినా కరెన్సీకి మధ్య మారకపు రేటును స్థిరీకరించాలి. ఇది జరగాలంటే ఆ దేశ కార్పొరేట్లను నియంత్రించాలి. కాని అలా చేయకుండా కార్పొరేట్లు దేశం నుండి పెట్టుబడులను బైటకు తరలించుకుపోతూ వుంటే దానికి శిక్ష అక్కడి కార్మిక వర్గానికి వేసేందుకు సిద్ధపడుతోంది అర్జెంటీనా ప్రభుత్వం.

జేవియర్ మైలీ ప్రపంచంలో వివిధ దేశాల్లో గద్దెలను ఎక్కుతున్న నయా ఫాసిస్టు అధినేతల జాబితాలో తాజాగా చేరిన వ్యక్తి. నయా ఫాసిజం ప్రపంచంలో విజృంభించడానికి కారణం నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థలో ముదురుతున్న సంక్షోభం. ఈ సంక్షోభ కాలంలో బడా కార్పొరేట్లు నయా ఫాసిస్టులతో మిలాఖత్ అయి తద్వారా తమ పెత్తనాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నారు. కార్మికవర్గం మీద మరిన్ని దాడులకు పూనుకుంటున్నారు. ఐతే ఈ నయా ఫాసిస్టు పాలకులు ప్రస్తుత సంక్షోభం రూపాన్ని మార్చగలరేమో తప్ప సంక్షోభాన్ని నివారించలేరు. అంటే తీవ్రమయ్యే ద్రవ్యోల్బణం స్థానే నిరుద్యోగాన్ని తీవ్రతరం చేయగలుగుతారు. కార్మికుల ఆదాయాలను మరింత కుదించగలుగుతారు. అలా చేసినా ఆ తర్వాత కూడా ఈ సంక్షోభం మరింత ముదిరిపోతుంది.

సంక్షోభం ముదురుతున్న కొద్దీ అర్జెంటీనా వంటి దేశాల నుండి జరిగే ఎగుమతులు మరింతగా ముడుచుకు పోతాయి. దేశంలో నిరుద్యోగం మరింత పెరుగుతుంది. వేతనాలు మరింత తగ్గుతాయి. దేశీయ కరెన్సీగా డాలర్లనే స్వీకరిస్తే అప్పుడు ఆర్థిక వ్యవస్థ రెట్టింపు వేగంతో ముడుచుకుపోయి సంక్షోభం మరింత తీవ్రతరమౌతుంది. ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడం ఒక్కటే ప్రస్తుత సమస్యకు పరిష్కారం. అది జరగాలంటే నయా ఉదారవాద ఆర్థిక విధానాల చట్రాన్ని అధిగమించాల్సిందే. ప్రత్యామ్నాయ విధానాలను చేపట్టవలసిందే. **(స్వేచ్ఛానుసరణ)**

నివాళి

విద్యా దీప్తి ఫాతిమా



సాధారణంగా సామాజిక సేవకులు, రాజకీయ నాయకులను వారు అందించిన సేవల ద్వారా గుర్తు పెట్టుకుంటాం. కొందరు మహిళలు కూడా విశేష సేవలు అందించారు. వారిలో కొందరిని మాత్రమే మనం గుర్తుపెట్టు కుంటున్నాం. దేశానికి, సమాజానికి జీవితాన్ని అంకితం చేసిన ఎందరో మహిళలు తెర వెనుకనే ఉండిపోయారు. వారి పేర్లను మనం వేళ్లపై లెక్కపెట్టొచ్చు. ఒకవేళ పేర్లు తెలిసినా వారి జీవిత విశేషాల గురించి తెలిసింది అంతంత మాత్రమే. ఎంతో సేవ చేసినప్పటికీ...గుర్తింపుకు నోచుకోని మహిళల్లో ఫాతిమా షేక్ ఒకరు. 2014లో మహారాష్ట్ర ప్రభుత్వం సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, జాకీర్ హుస్సేన్, అబ్దుల్ కలాం, ఆజాద్ లాంటి వారితో పాటు ఫాతిమా షేక్ సంక్షిప్త పరిచయాన్ని బాలభారతిలో పాఠ్యాంశంగా చేర్చింది. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 2022లో ఫాతిమా షేక్ పాఠాన్ని 8వ తరగతి పాఠ్యపుస్తకాలలో ప్రవేశపెట్టింది. అయినప్పటికీ ఫాతిమా షేక్‌కు తగినంత ప్రాచుర్యం నేటికీ లభించలేదు.

ఈమె 1831 జనవరి 9వ తేదీన జన్మించారు. ప్రామాణికంగా విద్యను బోధించడానికి అవసరమైన శిక్షణ పొంది అర్హత సాధించిన ఉపాధ్యాయురాలు. అట్టడుగు, నిమ్న కులాల బాలికల కోసం జ్యోతిరావు పూలే స్థాపించిన పాఠశాలల్లో బోధించడానికి తానే స్వయంగా సావిత్రి బాయితో పాటు ఫాతిమా షేక్‌కు కూడా శిక్షణ ఇచ్చారు. అది సరిపోదని గ్రహించి అహ్మదాబాద్ లోని ఆంగ్ల మిషనరీ ఉపాధ్యాయ శిక్షణాశాలలో ఇద్దరినీ చేర్పించి శిక్షణ ఇప్పించారు. అనంతరం పూణే లోని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణశాలలో శిక్షణ తీసుకుని వారు పూర్తి స్థాయి సర్టిఫికెట్ పొందారు.

ఇదంతా... ఇప్పట్లా ముస్లిం ఆడపిల్లలు కొంతవరకు స్వేచ్ఛగా చదువు కుంటున్న కాలం కాదు. సుమారు 190 ఏళ్ల కిందట అత్యంత దుర్భర ఆంక్షల కాలంలో, అసలు ఆడపిల్లల్ని బయటకు ఒంటరిగా పంపడమే గగనమైనటువంటి కాలంలో ఒక మహిళ, అందునా ముస్లిం చదువుకోవడమే సాహసం అయితే, మరికొందరికి చదువు చెప్పేందుకు పూర్తి స్థాయిలో అర్హత శిక్షణ పొందడం అంటే దానిని మాటల్లో కొలవలేం. అలా ఫాతిమా షేక్ భారతీయ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలుగా చరిత్రలో నిలిచారు.

ప్రతి సంవత్సరం జనవరి 3వ తేదీన సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకల కార్యక్రమాల జోరు కొనసాగుతోంది. అయితే ఇదే సందర్భంలో బాలికా విద్యావ్యాప్తిలో...పూలే దంపతులకు ఆలంబనగా, కొండంత అండగా నిలిచిన ఫాతిమా షేక్‌ను కూడా స్మరించుకోగలిగితేనే వారి స్మృతికి అసలైన గౌరవం లభిస్తుంది.

- ఎస్.పి.మనోహర్ కుమార్,
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, సెల్ : 9490762412

జనవాక్యం

రణం విస్త్'రణం'


ఇజ్రాయిల్, హమాస్ నడుమ మొదలైన రణం విస్తరణ చెంది ఆ ప్రమాదం ప్రపంచ వ్యాప్తం కావడం శోచనీయం. ఇందుకు ఇరువురి వైపు నుండీ బాధ్యత ఉన్నా, ఇజ్రాయిల్ వైపు నుండి ముప్పాతిక వంతు బాధ్యత ఉంది. ఏమైనా పరిస్థితులు దిగజారడానికి ప్రపంచ దేశాల వాయిస్ ఐక్యరాజ్యసమితి వైఫల్యంతో పాటు, అగ్ర రాజ్యాల స్వార్థ బుద్ధిదే ప్రధాన పాత్ర. ఫలితం మాత్రం అందరిదీ. ఇజ్రాయిల్ పాలస్తీనాపై యుద్ధం ప్రకటించి ఇప్పటికి ఇరవై వేల మందికి పైగా పౌరులని పొట్టన పెట్టుకుంది. గాజాలో సగభాగాన్ని ధ్వంసం చేసి, యుద్ధాన్ని ఇంకా కొనసాగిస్తోంది. మానవతా దృక్పథంతో వచ్చే సాయాన్ని కూడా ఆ దేశ పౌరులకు అందనివ్వడం లేదు. భారత్ సహా ఐక్య రాజ్య సమితి దేశాలు యుద్ధాన్ని విరమించమని కోరినా పెడ చెవిన పెడుతోంది. పైగా ఇతర దేశాల్ని ఇందులోకి లాగుతోంది. లెబనాన్‌లో దాక్కున్న హమాస్ పెద్ద తలకాయని నేరుగా మట్టుబెట్టడంతో ఆ దేశం ఇజ్రాయిల్‌పై గుర్రుగా ఉంది. తాజాగా ఇరాన్‌లో రెండు బాంబు పేలుళ్లతో వందమంది పౌరులు మరణించారు. వాటి వెనుక ఐఎస్ టెర్రరిస్ట్ సంస్థ హస్తమున్నట్టు ప్రకటించినా, ఇరాన్ అనుమానాలు మాత్రం ఇజ్రాయిల్, అమెరికా వైపుకే పోతున్నాయి. ఈ యుద్ధం పర్యవసానాలు అంతర్జాతీయ వాణిజ్యంపై నేరుగా పడుతోంది. ఎమెన్ వేదికగా పనిచేస్తున్న తీవ్రవాదులు సూయజ్ కాలువ ద్వారా సాగుతోన్న వాణిజ్య నౌకలపై దాడి చెయ్యడం మొదలెట్టాయి. ఫలితంగా ఆ రవాణా మార్గంలో భద్రతపై వెచ్చించే ఖర్చు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోంది. భారత్ దిగుమతి చేసుకొనే చమురుపై ఆ ప్రభావం పడుతోంది. వాణిజ్య నౌకలు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవడం వల్ల కూడా రవాణా ఇబ్బందులతో బాటు, ఆర్థిక నష్టాలు పెరిగాయి. ఇప్పటికీ ఇజ్రాయిల్ వెనక్కి తగ్గకపోవడం, మరింత ముందుకు దూసుకుపోవాలని తహతహలాడడం ప్రపంచ ఆర్థికాన్ని, శాంతినీ నష్టపరిచే ప్రక్రియ. భారత్ సహా ప్రభావిత దేశాలు చొరవ తీసుకుని పరిస్థితిని చక్కదిద్దడం ఆవశ్యం.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

పోరాటం

నిర్బంధంతో ప్రజా ఉద్యమాలను అణచలేరు

రాష్ట్రవ్యాప్తంగా లక్షా ఐదు వేల మంది అంగన్‌వాడీలు 28 రోజుల నుంచి నిరవధిక సమ్మె సాగిస్తున్నారు. ఈ సమ్మెను ఉక్కుపాదంతో అణచాలని రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను కూడా ప్రయోగించింది. అంగన్‌వాడీ సెంటర్లు తెరుస్తాం. తాళాలు పగలగొడతాం. ఉద్యోగాల నుంచి తొలగిస్తాం. ఎస్మాను ఉపయోగించి వారెంట్ లేకుండా అరెస్టులు చేసి మూడు నెలలు జైల్లో ఉంచుతామని రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపుల పర్వానికి దిగింది. మరో వైపున జీతాలు రూపాయి కూడా పెంచం. గ్రాట్యూటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా వినం అని రాష్ట్ర ప్రభుత్వం మొండి వాదనలను చేస్తున్నది. కొవ్వెక్కి సమ్మె చేస్తున్నారని పాలకపక్ష ఎమ్మెల్యేలు కొందరు నోరు పారేసుకుంటున్నారు. జనవరి 3న కలెక్టర్ ఆఫీసుల వద్ద బైఠాయింపు సందర్భంగా విజయవాడలో 1200 మంది అంగన్‌వాడీలను అక్రమంగా అరెస్టులు చేసి మహిళా నాయకులపై తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. అత్యధిక మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఒంటరి మహిళలైన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వ క్రూరత్వం నగ్నంగా కన్పిస్తున్నది.



సిహెచ్. నర్సింగరావు

రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించి అంగన్‌వాడీ సమ్మెను నిషేధించడమంటే ప్రజాతంత్ర హక్కులపై దాడి చేయడమే. రాష్ట్ర ప్రభుత్వం యావత్తు కార్మికవర్గాన్ని రెచ్చగొట్టే చర్య ఇది. విద్యుత్, ఆర్టీసీ లాంటి అత్యవసర రంగాలపై విధించే ఎస్మాను అన్ని రంగాలకు విస్తరించేందుకు మార్గమే అంగన్‌వాడీలపై ప్రయోగం. ఎస్మా అమలు ఉండగానే విద్యుత్తు, ఆర్టీసీలలో అనేక సార్లు సమ్మెలు సాగాయి. ఎస్మా ప్రయోగిస్తే సమ్మెలు జరగవని ప్రభుత్వం భ్రమపడవచ్చు. ఇప్పుడు అంగన్‌వాడీలు గానీ, గతంలో అనేక రంగాల్లో గాని సమ్మెలు కొనసాగాయి. అసలు సమస్యలు పరిష్కరించకుంటే ఎస్మా లాంటి నిర్బంధ బ్రహ్మాస్త్రాలు ప్రయోగించినా కార్మికవర్గం అదరదు, బెదరదు అని పాలకులు గుర్తించాలి.

అంగన్‌వాడీ కార్మికుల కడుపులు మాడ్చితే కాళ్ల దగ్గరకు వస్తారని జగన్ ప్రభుత్వం భ్రమించవచ్చు. కాని అంగన్‌వాడీలు ఎన్ని రోజులైనా పోరాడి విజయం సాధించి సగర్వంగా తలెత్తుకుని మాత్రమే పనిలోకి వెళతారు. దీనికి సంఘీభావంగా రాష్ట్రంలో ఉన్న కార్మికులంతా జనవరి 9న జైల్ భరోను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలన్నీ పిలుపునిచ్చాయి. జైల్ భరోను జయప్రదం చేయాలని యావత్ కార్మికవర్గాన్ని కోరుతున్నాం.

సంఘీభావంగా 'జైల్ భరో' నేడే

సమ్మె కార్మికుల ప్రాథమిక హక్కు. సమ్మెలు జరగడమంటేనే పాలకుల వైఫల్యాలకు తార్కాణం. కార్మికవర్గం ఊరికే సమ్మెలకు సిద్ధం కాదు. సమ్మెల్లో ఉండే కష్టాలు కార్మికులకు తెలుసు. పట్టుదలగా జరుగుతున్న అంగన్‌వాడీ సమ్మెను విఫలం చేసేందుకు పాలకులు పోటీ కార్మికులను ఉపయోగించడం చట్ట వ్యతిరేకం. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చేయడం కంటే సమ్మెను విఫలం చేయాలని పాలకులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. పిల్లలను అంగన్‌వాడీలకు తేవాలనే ప్రభుత్వ ప్రయత్నాలు ఘోరంగా విఫలమయ్యాయి. 'మా టీచరు, ఆయా లేకుండా మేం అంగన్‌వాడీ స్కూలుకు రాం' అని పిల్లలు, వారి తల్లిదండ్రులు తెగేసి చెప్పారు. అంగన్‌వాడీ పిల్లలను స్కూలుకు తెచ్చి, వారికి అన్నం వండించి పెట్టాలని ప్రభుత్వ టీచర్లపై ఒత్తిడి చేశారు. అంగన్‌వాడీలు లేకుండా పాలకులు ఎక్కడా ఒక్క పిల్లవాడిని కూడా సెంటరుకు తేలేకపోయారు. ఫ్యాప్టో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాలు ప్రత్యేకంగా యు.టి.ఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించింది. మధ్యాహ్న భోజన కార్మికులు, వి.ఆర్.ఏ, ఐ.కె.పి సంఘాలన్నీ అంగన్‌వాడీల వెనుక నిలబడ్డాయి. కార్మిక ఐక్యత అంటే ఇదే. సమ్మె చేస్తే కార్మికులను తొలగిస్తామని చరిత్రలో కార్మికులను బెదిరించిన వారంతా కాల గర్భంలో కలిసిపోయారు. ఇది చట్ట వ్యతిరేకం. అంగన్‌వాడీలు జీతాలు పెంచమంటే కార్మికులపై పాలకులు కక్ష కడతారా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు, రవాణా చార్జీలు, బియ్యం, పప్పులు, నూనెలు ఒక్కటేమిటి అన్ని ధరలు ఎందుకు పెంచారు? పెరిగిన ధరలు కరువు భత్యం కూడా చెల్లించరా? పక్క రాష్ట్రం కంటే వెయ్యి రూపాయలు నెలకు అదనంగా చెల్లిస్తానన్న సి.యం



వాగ్దానం ఎందుకు అమలు చేయరు? ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ఎన్నికల తర్వాత "...ఓడ దాటిన తర్వాత బోడి మల్లన్న" చందంగా మారింది.

పాలకులు కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో వారికి ఊడిగం చేస్తున్నారు. ఆ భారాలు కార్మికులు, ప్రజలపై వేస్తున్నారు. మన రాష్ట్రంలో ఫార్మా, ఆక్వా, సిమెంట్ కంపెనీల లాభాల్లో 5 శాతం పన్ను వేస్తే రాష్ట్రంలో కార్మికులందరికీ వేల రూపాయల జీతాలు పెంచవచ్చు. రాష్ట్ర ప్రభుత్వానికి కార్మికులపై ఏమాత్రం అభిమానం ఉన్నా ఆ చర్యలు చేపట్టాలి. పాలకులు కార్పొరేట్ల భజన చేస్తున్నంత కాలం కార్మికవర్గం పాలకులపై పోరాడక తప్పదు. అంగన్‌వాడీ కార్మికుల కడుపులు మాడ్చితే కాళ్ల దగ్గరకు వస్తారని జగన్ ప్రభుత్వం భ్రమించవచ్చు. కాని అంగన్‌వాడీలు ఎన్ని రోజులైనా పోరాడి విజయం సాధించి సగర్వంగా తలెత్తుకుని మాత్రమే పనిలోకి వెళతారు. దీనికి సంఘీభావంగా రాష్ట్రంలో ఉన్న కార్మికులందరూ జనవరి 9న జైల్ భరోను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలన్నీ పిలుపునిచ్చాయి. జైల్ భరోను జయప్రదం చేయాలని యావత్ కార్మికవర్గాన్ని కోరుతున్నాం.

(వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

మూడు పూలు... ఆరు కాయలు

- భారత్‌లో దినదినాభివృద్ధి చెందిన ట్రంప్ వ్యాపారాలు
- ఆయన హయాంలో 2.82 లక్షల డాలర్లు ఖర్చు చేసిన కేంద్రం
- మోడీతో సన్నిహిత సంబంధాలే కారణం
- డెమొక్రటిక్ సభ్యుల కమిటీ వెల్లడి

వాషింగ్టన్ : డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మన దేశంలో ఆయన వ్యాపారాలు మూడు పూలు...ఆరు కాయలుగా దినదినాభివృద్ధి చెందుతూ వర్థిల్లాయి. ప్రధాని మోడీతో ఆయనకున్న సన్నిహిత సంబంధాలే దీనికి కారణం. వ్యాపారాల ద్వారా ఆయన భారత్ సహా ఇరవై దేశాల నుండి కనీసం 7.8 మిలియన్ డాలర్లు ఆర్జించారని చెబుతూ అమెరికా హౌస్ ఓవర్‌సైట్ కమిటీలోని డెమొక్రటిక్ సభ్యులు ఓ నివేదికను విడుదల చేశారు. అమెరికా ప్రతినిధుల సభకు చెందిన ఈ కమిటీ అత్యంత శక్తివంతమైనది. ప్రభుత్వ విభాగాలలో జవాబు దారీతనాన్ని ఈ కమిటీ పరిశీలిస్తుంది.

న్యూయార్క్‌లోని ట్రంప్ వరల్డ్ టవర్‌లో, అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని ట్రంప్ ఇంటర్నేషనల్ హోటల్‌లో 2017-2020 మధ్యకాలంలో భారత్ 2,82,764 డాలర్లు ఖర్చు చేసిందని ఆ నివేదిక తెలిపింది. ట్రంప్ వ్యాపారాలలో చైనా, సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్, మలేసియా, కువైట్, ఫిలిప్పీన్స్ దేశాలు కూడా ఖర్చు చేశాయని నివేదిక వెల్లడించింది. ట్రంప్‌కు గతంలో అకౌంటింగ్ సంస్థగా వ్యవహరించిన మజార్స్, అమెరికా సెక్యూరిటీలు-ఎక్స్ఛేంజ్ కమిషన్ నుండి సేకరించిన పత్రాల ఆధారంగా ఈ వివరాలు బయటపడ్డాయి. 'అమ్మకానికి శ్వేతసౌధం : అధ్యక్షుడు ట్రంప్‌కు రాకుమారులు, ప్రధానులు, దేశాధినేతలు ఎలా ప్రయోజనం చేకూర్చారు' అనే శీర్షికతో ఈ నివేదికను రూపొందించారు.

అమెరికా వెలుపల ట్రంప్ యాజమాన్యంలో నడిచిన వ్యాపార ప్రాజెక్టులలో అత్యధికం మన దేశంలోనే ఉన్నాయి. భారత్‌లో ట్రంప్‌కు ఉన్న వ్యాపార సంస్థలను, ఆయన అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అమెరికా విదేశాంగ విధానానికి ఆయన ఇచ్చిన సూచనలను గమనిస్తే వాటికి పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉన్నాయని అర్థమవుతుంది. ట్రంప్ తన వ్యాపార కార్యకలాపాల ద్వారా ప్రధాని నరేంద్ర మోడీతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నారు. దేశాధ్యక్షుడు కావడానికి ముందే తన వ్యాపార ప్రయోజనాల కోసం ట్రంప్ మన దేశానికి వచ్చారు.



పూణేలోని ట్రంప్ టవర్స్

ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించినప్పుడు కూడా శ్వేతసౌధంలో ట్రంప్‌పై ప్రశంసలు కురిపించారు.

ఈ రెండింటిలోనే భారీగా ఖర్చు

ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా ఉన్న సమయంలో న్యూయార్క్ నగరంలోనూ, వాషింగ్టన్ డీసీలోనూ ఆయన ఆస్తులలో భారత ప్రభుత్వం కనీసం 2,82,764 డాలర్లు ఖర్చు చేసింది. వరల్డ్ టవర్‌లో రెండు యూనిట్ల ఏర్పాటుకు అయిన ఖర్చును మన ప్రభుత్వమే భరించింది. ట్రంప్ అధ్యక్షుడుగా ఉన్నంతకాలం ఈ టవర్లు మన ప్రభుత్వ అధీనంలోనే ఉండేవి. వాషింగ్టన్ డీసీలో ట్రంప్‌కు చెందిన ఇంటర్నేషనల్ హోటల్‌లో అమెరికాలోని భారత రాయబారులు అనేకసార్లు బస చేశారు. ఆ ఖర్చంతా మన ప్రభుత్వమే భరించింది.

కమిటీకి మజార్స్ ఇచ్చిన పత్రాల ప్రకారం...ఐరాసలో భారత శాశ్వత కార్యకలపాల కోసం న్యూయార్క్‌లోని ట్రంప్ టవర్స్‌లో రెండు యూనిట్లను తీసుకున్నారు. 2018లో వీటి కోసం 66,046 డాలర్లు చెల్లించారు. ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో ఈ యూనిట్ల కోసం భారత ప్రభుత్వం 2,64,184 డాలర్లు ఖర్చు చేసి ఉంటుందని అంచనా. అదనపు ఛార్జీలను ఇందులో కలపలేదు. ఒక్క 2018లోనే 66,046 డాలర్ల కామన్ ఛార్జీలతో పాటు అదనపు ఛార్జీలు, ఫీజుల రూపంలో 13,983 డాలర్లు చెల్లించారు. వాషింగ్టన్‌లోని ట్రంప్ ఇంటర్నేషనల్ హోటల్‌లో 2017 ఫిబ్రవరి, మార్చిలో ఎనిమిది మంది భారత దౌత్యవేత్తలు బస చేసి 18,580 డాలర్లు చెల్లించారు.

కుటుంబ ప్రాజెక్టులు సైతం...

ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా ఉన్న కాలంలో ఆయన సంతానం డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్‌ల నేతృత్వంలోని ట్రంప్ ఆర్గనైజేషన్ మన దేశంలో అనేక ప్రాజెక్టులు చేపట్టింది. ట్రంప్ వ్యాపారాలలో భారతీయ మార్కెట్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని 'ఓపెన్‌సీక్రెట్స్' అనే పరిశోధనా సంస్థ తెలిపింది. భారత్ కంటే మరే దేశానికీ ట్రంప్ ఆర్గనైజేషన్ ప్రాధాన్యత ఇవ్వలేదని ఈ సంస్థ వ్యాఖ్యానించింది. అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ట్రంప్ ఆస్తులలో, ఆయన వ్యాపారాలలో భారత్ పెట్టిన ఖర్చు ఆయనకు అనేక మిలియన్ డాలర్ల ఆదాయాన్ని అందించింది. దేశాధ్యక్షుడు కావడానికి ముందే ఆయన మన దేశంలో దశాబ్ద కాలానికి పైగా వ్యాపారాలు నిర్వహించారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించే సమయానికి ఐదు ప్రాజెక్టులు వివిధ దశలలో ఉన్నాయి. ట్రంప్ అనేక మంది ప్రముఖ వ్యాపారవేత్తలతో కలిసి భాగస్వామ్యాలు నెరిపారు. వీరికి రాజకీయాలతో కూడా సంబంధం ఉండడం గమనార్హం. ట్రంప్ వ్యాపార భాగస్వాములలో అనేక మందిపై మోసం, దుష్ప్రవర్తన వంటి ఆరోపణలు ఉన్నాయి. ఆయా కంపెనీలపై విచారణలు కూడా జరిగాయి.

అటకెక్కిన విచారణలు

అమెరికా అధ్యక్షుడుగా ఎన్నిక కావడానికి ముందే ప్రధాని మోడీని ప్రసన్నం చేసుకునేందుకు ట్రంప్ అనేక ప్రయత్నాలు చేశారు. మోడీ ప్రధాని అయిన కొద్ది కాలానికి ఆయన ముంబయి వచ్చి మోడీపై ప్రశంసలు కురిపించారు. ట్రంప్ వ్యాపార భాగస్వామి మంగళ్ ప్రభాత్ లోథా బీజేపీ ఎమ్మెల్యేగా సుదీర్ఘ కాలం పనిచేశారు. లోథా కంపెనీలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో 2013లో వాటిపై విచారణ జరిగింది. అయితే మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత లోథా, ట్రంప్ భాగస్వాములుగా ఉన్న ముంబయి టవర్ ప్రాజెక్టుకు అవరోధాలు తొలగిపోయాయి. విచారణలన్నీ అటకెక్కాయి. మోడీ హయాంలో భారత్‌లో వ్యాపారాలు నిర్వహించాలని భావిస్తున్నట్లు 2014లో జరిపిన పర్యటనలో ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయన ఆ పర్యటనలో స్థానిక మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తూ మోడీని పొగడ్తలతో ముంచెత్తారు.

భారత వ్యాపారులతో భాగస్వామ్యాలు

మన దేశంలో ట్రంప్ చేపట్టిన అనేక రియల్ ఎస్టేట్ వెంచర్లు బీజేపీతో కుటుంబ సంబంధాలున్న కంపెనీల ద్వారానే నడిచాయి. ట్రంప్ ప్రాజెక్టులకు మన అధికారులు పలు విధాలుగా అండదండలు అందించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులలో రుణాలు సైతం ఇప్పించారు. అమెరికా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టే సమయంలో కూడా ట్రంప్ అనేక మంది భారతీయ వ్యాపార భాగస్వాములను కలిశారు. ఎన్నికైన వారం రోజుల తర్వాత న్యూయార్క్‌లోని ట్రంప్ టవర్స్‌లో ముగ్గురు భారత వ్యాపారులతో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా వ్యాపార, రాజకీయ అంశాలు చర్చకు వచ్చాయి. ట్రంప్ తరచూ తనపై కురిపించిన ప్రశంసల జల్లులను మోడీ ఎప్పుడూ మరచిపోలేదు. ఆయన కూడా సందర్భం వచ్చినప్పుడల్లా ట్రంప్‌ను కొనియాడేవారు.

ఇబ్బడి ముబ్బడి ఆదాయం

మోడీ శ్వేతసౌధాన్ని సందర్శించిన తర్వాత వైట్‌హౌస్ ప్రతినిధిగా ఇవాంకా ట్రంప్, ట్రంప్ ఆర్గనైజేషన్ అధిపతిగా డొనాల్డ్ ట్రంప్ జూనియర్ మన దేశానికి తరచూ వచ్చేవారు. మోడీ ఆహ్వానం మేరకు ట్రంప్ సతీమణి కూడా హైదరాబాద్ వచ్చి అంతర్జాతీయ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో పాల్గొన్నారు. ట్రంప్ సతీమణి భారత పర్యటన తర్వాత కొద్ది కాలానికే రాజధాని న్యూఢిల్లీ శివారులోని గురుగావ్‌లో ట్రంప్ టవర్ల నిర్మాణానికి ఆఘమేఘాల మీద అనుమతులు మంజూరయ్యాయి. ట్రంప్ జూనియర్ మన దేశానికి వచ్చినప్పుడు మోడీతో ఏకాంత సమావేశం జరిపారు. తన తండ్రి అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ట్రంప్ జూనియర్ మన దేశంలో వ్యాపార విస్తరణకు కృషి చేశారు. 2019లో ఆయన న్యూఢిల్లీలోని ట్రంప్ టవర్స్‌లో ఫ్లాట్ల కొనుగోలుదారులతో సమావేశమయ్యారు. కొనుగోలుదారులు ఫ్లాట్లలోకి ప్రవేశించక ముందే పది నుండి యాభై లక్షల డాలర్ల వరకూ లైసెన్స్ ఫీజు చెల్లించారు. తన పదవీకాలంలో ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి ఏటా లక్ష డాలర్ల నుండి పది లక్షల డాలర్ల వరకూ సంపాదించానని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. కొల్‌కతాలోని డీటీ టవర్స్ ద్వారా ఏడాదికి లక్ష నుండి పది లక్షల డాలర్ల వరకూ ఆర్జించానని కూడా తెలిపారు. అధ్యక్షుడుగా ఉన్న చివరి సంవత్సరంలో కూడా ఈ వెంచర్ ద్వారా ట్రంప్‌కు యాభై వేల నుండి లక్ష డాలర్ల ఆదాయం లభించింది.

పరస్పర మద్దతుతో...

అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు భారత్‌లోని ట్రంప్ వ్యాపారాలు దినదిన ప్రవర్థమానమై విలసిల్లాయి. ట్రంప్, మోడీ...వీరిద్దరూ ఒకరికొకరు మద్దతు ఇచ్చుకుంటూ బలమైన వ్యక్తిగత సంబంధాలు కొనసాగించారు. ద్వైపాక్షిక పర్యటనలు నిర్విరామంగా జరిగాయి. మత స్వేచ్ఛకు మోడీ రక్షకుడంటూ భారత్‌లో పర్యటించిన ప్రతిసారీ ట్రంప్ పొగిడే వారు. అధ్యక్ష బాధ్యతల నుండి వైదొలిగే సమయంలో కూడా భారత్‌తో నెలకొల్పిన ప్రత్యేక సంబంధాల ప్రాధాన్యతను ప్రస్తావించారు. గత సంవత్సరం ఆయన ఓ ఇంటర్వ్యూ ఇస్తూ 'భారత్‌కు నా కంటే మంచి స్నేహితుడు ఉన్నాడని నేను అనుకోను. అది నేను ఏర్పరచుకున్న సంబంధాలలో ఒకటని మీకు తెలుసు' అని వ్యాఖ్యానించారు.

జర్నలిస్టులకు అనువైన ఇళ్ల స్థలాలు

- ఐఅండ్‌పిఆర్ కమిషనరు తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయనున్నామని, ఇందుకోసం రెండు, మూడు రోజుల్లో బడ్జెట్ విడుదల చేయనున్నట్లు సిసిఎల్‌ఎ అధికారులు వెల్లడించారని ఐఅండ్‌పిఆర్ కమిషనరు తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్లతో జరిగిన కాన్ఫరెన్స్‌లో ఇళ్ల స్థలాలకు సంబంధించిన భూసేకరణ చేసేటప్పుడు జర్నలిస్టుల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అనువైన ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపడుతోందన్నారు. భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి కార్యదర్శి రేవు ముత్యాలరాజు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. జర్నలిస్టుల నుంచి 10,017 దరఖాస్తులు అందాయన్నారు. జిఓలోని నిబంధనల మేరకు 7,651 మంది అర్హులైన జర్నలిస్టుల జాబితాను పరిశీలన కోసం జిల్లాల కలెక్టర్లకు పంపామన్నారు. అసంపూర్తిగా ఉన్న 766 మంది దరఖాస్తులను సరిదిద్దుకునేందుకు జర్నలిస్టులకు మరో అవకాశం కల్పించామని, ఈ విషయం ఇప్పటికే సంబంధిత జర్నలిస్టులకు సందేశాలు పంపామని తెలిపారు. వివరాలు సరిచేసుకున్న అనంతరం వాటిని కూడా పరిశీలించి కలెక్టర్లకు పంపుతామన్నారు.

అర్హులమైనా ఆర్‌ఆర్ ప్యాకేజీ ఆపేశారు

- 'స్పందన'లో 'ఆఫ్‌షోర్' నిర్వాసితుల ఫిర్యాదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

తాము అర్హులమైనా రకరకాల సాంకేతిక కారణాలతో తమకు రావాల్సిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ డబ్బులను ఆపేశారని ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలు స్పందనలో ఫిర్యాదు చేశాయి. జడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. చీపురుపల్లి నిర్వాసిత గ్రామంలో సుమారు 350 కుటుంబాలు ఉండగా అందులో వంద మందికి ప్యాకేజీ అందలేదని తెలిపారు. వారిలో 50 మంది పేర్లను పరిశీలించి అర్హులుగా తేల్చి జాబితా తయారు చేసినా, నేటికీ వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకపోవడంతో పునరావాస కాలనీలో ఇళ్లు నిర్మించుకునేందుకు డబ్బుల్లేక నిర్వాసిత గ్రామంలోనే ఉంటున్నామని వివరించారు. పునరావాస కాలనీలో కనీసం రోడ్లు, విద్యుద్దీపాలు, కాలవలు కూడా నిర్మించలేదని జెసి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తులు సొంత నిధులతో నిర్మించుకున్న ఆలయాలకు పరిహారం ఇవ్వడం లేదన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.మోహనరావు ఆధ్వర్యాన ఎన్.చిరంజీవులు, ఐ.కృష్ణారావు, పి.త్రినాథ్, ఎస్.మల్లేశ్వరి, ఎస్.సరోజని ఈ మేరకు వినతిపత్రం అందించారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
బకింగ్‌హామ్‌పేట బ్రాంచ్ (13341) విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా-520002. 0866-2574718, 9440905153

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1. M/s సందీప్ కనస్ట్రక్షన్స్ అండ్ ఫ్యాబ్రికేషన్, ప్రొప్రయిటర్: బి. శ్రావణ్ కుమార్, డి.నెం 5/48, ఫ్లాట్ నెం. 307, 2వ అంతస్తు, షిర్డి సాయి టవర్స్, దేవినేని వారి వీధి, గొల్లపూడి, విజయవాడ-521225. **2. శ్రీమతి బి. రమాదేవి, భర్త: సత్యనారాయణ,** డి.నెం 5/48, ఫ్లాట్ నెం. 307, 2వ అంతస్తు, షిర్డి సాయి టవర్స్, దేవినేని వారి వీధి, గొల్లపూడి, విజయవాడ-521225.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, బకింగ్‌హామ్‌పేట బ్రాంచ్ నుండి M/s సందీప్ కనస్ట్రక్షన్స్ అండ్ ఫ్యాబ్రికేషన్, ప్రొప్రయిటర్: బి. శ్రావణ్ కుమార్ మరియు బి. రమాదేవి **పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:**

లోన్ స్వభావం & అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	బకాయి మొత్తం	వడ్డీ రేటు
WC లోన్ అకౌంట్ నెం. 33411400001668	రూ. 20,00,000/- తేది: 20-07-2023	రూ. 20,55,557.83	11.05%
GECL లోన్ అకౌంట్ నెం. 33419160000117	రూ. 2,50,000/- తేది: 16-06-2020	రూ. 41,928.29	9.10%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 25.12.2023 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.2097486.12 (అక్షరాల ఇరవై లక్షల తొంభై ఏడు వేల నాలుగు వందల ఎనభై ఆరు రూపాయలు మరియు పన్నెండు పైసలు)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. ...

తేది: 26.12.2023, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
విజయవాడ - గాంధీ నగర్ బ్రాంచ్, చిరునామా: 26-2-36, అంధ్ర రత్న రోడ్డు, గాంధీ నగర్, విజయవాడ - 520003. ఫోన్: 0866-2571234 & Email Id: iob1807@iob.in

స్వాధీనత ప్రకటన (APPENDIX-IV) (Rule 8 (1) (స్థిరాస్తి కొరకు))

తేది : 05-01-2024, ప్రదేశం: విజయవాడ — అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** భారత ప్రభుత్వ రంగ సంస్థ
జుజ్జూరు బ్రాంచి జుజ్జూరు గ్రామం, వీరుల్లపాడు మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా, ఎపి - 521181

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6 (2) RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహ అబ్లిగెంట్ (లు) : 1) శ్రీమతి పులా లక్ష్మీ కుమారి, భర్త : పులా వెంకటేశ్వరరావు, హెచ్.నెం. 7-15, బిసి కాలనీ, జుజ్జూరు గ్రామం, వీరుల్లపాడు మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా - 521181. **2) శ్రీ పులా వెంకటేశ్వరరావు,** తండ్రి : నాగేశ్వరరావు, హెచ్.నెం. 7-15, బిసి కాలనీ, జుజ్జూరు గ్రామం, వీరుల్లపాడు మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా - 521181.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, (యాక్టు 54 యొక్క 2002) ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

...

షెడ్యూల్ ఆస్తి

రిజర్వు ధర : రూ. 16,18,000/- — ధరావత్తు : రూ. 1,61,800/-
తేది : 04-01-2024, ప్రదేశం : జుజ్జూరు — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కెనరా బ్యాంక్ Canara Bank సిండికేట్ Syndicate
అజిత్‌సింగ్ నగర్ బ్రాంచ్ (13757) అజిత్‌సింగ్ నగర్, విజయవాడ-520015, కృష్ణా జిల్లా. ఫోన్: 8333047107

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

...

తేది: 27.12.2023, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు

నెం.25/ఎ.టి.ఓ/ఇ-ప్రొక్యూర్మెంట్/2023-2024, **తేది : 01.01.2024**

కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స. మరియు పారిశుధ్య డివిజన్, బాపట్ల వారి కార్యాలయ పరిధిలోని 5 పనులకు అంచనా విలువ : రూ. 73.01 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లను www.apeprocurement.gov.in నందు ది.08.01.2024 నుండి అందుబాటులో ఉంచబడును.

సం/- కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స మరియు పారిశుధ్య డివిజన్, బాపట్ల.
DIPRNo.12343/CL/ADVT/1/1/2021-22

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr & 1st Floor, Door No. 31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

O.A. No. 358 / 2020

BETWEEN:
Union Bank of India, Main Branch, Guntur ... **Applicant Bank**
AND :
M/s. Farm to Home Innovative Solutions
Rep. by its Managing Partner, Mundru Hari Krishna ... Defendants

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To
Defendant 1 : M/s. Farm to Home Innovative Solutions, Rep by its Managing Partner, Mundru Hari Krishna, R/o. House No. 4-21-53/12, Sai Baba Road, Vishnu Nagar, Vidyanagar Extension, Guntur - 7
Defendant 2 : Sri Mundru Hari Krishna, S/o. Kotaiah, R/o. F.No. 106, Sri Kanyaka Parameswari Enclave, Etukuru Road, Sangadigunta, Guntur-3
Defendant 5 : Chirumamilla Hari Krishna, S/o. Kantha Rao, Presently staying at R/o. Door No. 4-21-53/12, Sai Baba Road, Vishnunagar, Vidyanagar Extension, Guntur-7
Defendant 6 : Koka Rama Krishna, S/o. Rama Lakshmaiah, R/o. Yarrapalem Village, Voppicherla Mandal, Guntur.

1. Whereas, the applicant bank instituted an application under section 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you (Defendant 1,2,5 and 6) for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 a.m, or at such time immediately thereafter according to the convenience of Tribunal **on 22-05-2024**.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader / Advocate duly instructed.
5. Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this the 03rd day of January, 2024 at Visakhapatnam.

Signature of the Officer Authorised
Debts Recovery Tribunal
Visakhapatnam

IN THE COURT OF DISTRICT JUDGE-1 AND CHAIRMAN MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT BHOKAR, DISTRICT NANDDED (MAHARASHTRA)
M.A.C.P. No.26/2022

Kevalbai V/s Maremalla
...Petitioner
Kevalbai W/o. Sambhaji Dhasade @ Waghmare
V/s.
...Respondents
Maremalla Venkata Trinesh

Claim :Compensation amount of Rs.41,20,000/- U/s. 166 of the M.V.Act. 1988.
To,
Maremalla Venkata Trinesh
Age Major Occu Business
R/o. M.v.Poorna Chandra Rao, 9-5/B, Model colony, Kanchika Cherla, Krishna, Andhra Pradesh-521180

WHEREAS, the above named petitoners have filed the instant claim petition for compensation against you alongwith other respondent, which is now pending for your appearance.

In the above matter, summons and notices were issued to you so many times through court and through registered post A.D also but they are returned unserved upon you.

It is the contention of the above named petitioners that you are not receiving the summons and notices intentionally and avoiding to accept the same therefore, the petitioner/ requested the Honourable Court to issue paper proclamation against you and the same is granted by this court.

You are hereby warned to appear before this court i.e. District Court-1 Bhokar, District Nanded. (Maharashtra State) in person or by a p;eader duly instructe on 08.02.2024 at 11.00.

You are hereby also warned that if you fail to appear before this court on the date and time mentioned above, the matter will be proceeded exparte against you.

Given under my hand and seal of the court. This the 02 January 2024
"By order"
Superintendent,
District Court-1 Bhokar, Dist, Nanded (M.S)
Clark
Civil Appeal Section,
District court-1 Bhokar,
Dist. Nanded (Maharashtra State)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ) ఆంధ్ర Andhra కార్పొరేషన్ Corporation
రింగ్ రోడ్ శాఖ, శ్రీ హరి కాంప్లెక్స్, నిస్సాన్ కార్ షోరూమ్ పక్కన, బి.సి రోడ్, విజయవాడ. ఫోన్:0866-2473187, 2477326.

డిమాండ్ నోటీసు

13(2) ఆఫ్ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 54 ఆఫ్ 2002

...

తేది : 02-01-2024, ప్రదేశం : విజయవాడ — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రేషన్ బియ్యం అందించాలని గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలోని గోయిపాక పంచాయతీలో నవంబరు, డిసెంబర్ నెలల్లో గిరిజన సహకార సంస్థ ద్వారా రేషన్ బియ్యం, పంచదార, పప్పు తదితర సరుకులు అందడం లేదని గిరిజనులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ రేషన్ బియ్యం, పంచదార, పప్పు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కితలాంబ, టంకు, రసాబడి, ఎస్‌టి గోయిపాక గ్రామాలకు రేషన్ అందడం లేదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కార్యాలయం స్పందనలో ఫిర్యాదు చేయగా స్థానిక తహశీల్దార్ ఆధ్వర్యంలో కమిటీ వేసి విచారణ చేపట్టగా నవంబర్, డిసెంబర్‌లో ప్రభుత్వం డిసిసి ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అందడం లేదని విచారణలో తేలిందని తహశీల్దార్ చెప్పారు. ఈ విషయంపై రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్‌పైన, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ నివేదిక కలెక్టర్‌కు పంపించామని తహశీల్దార్ తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలకు జిసిసి కోటా బియ్యం పూర్తిస్థాయిలో ఇప్పిస్తామని తహశీల్దార్ రాములమ్మ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.అవినాష్, సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, కోశాధికారి మండంగి రమణ, నాయకులు సన్యాసిరావు, శంకర్రావు ఉన్నారు.

కరెంటు ఆపే'సారూ'!

- అమాత్యుని సేవలో విద్యుత్ అధికారులు
- 'పురం' పారిశ్రామిక వాడకు కరెంట్ కట్..!
- జనరేటర్‌పై ఆధారపడ్డ పరిశ్రమ నిర్వాహకులు
- రూ. కోటి అదనపు భారం



మంత్రి సభలో కూర్చొన్న విద్యుత్‌శాఖ డీఈ భూపతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గంలో వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా వైసిపి జెండా ఎగరవేయాలని సంకల్పించి ఆ పార్టీ రాయలసీమ కో ఆర్డినేటర్, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం నుంచి ఆరు రోజుల పాటు నియోజకవర్గ వ్యాప్తంగా సమావేశాలను మొదలు పెట్టారు. అన్ని పంచాయతీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సోమవారం నాడు చౌళూరు, తూముకుంట, గోళ్ళాపురం, కొటిపి, కిరికెర, బేవినహళ్లి పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. పారిశ్రామిక వాడలో ఉన్న పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమల్లో ఉపాధి కోసం జనం వెళ్తారని నాయకులు భావించారు. సమావేశాలకు జన సమీకరణ చేయాలంటే పరిశ్రమలకు సెలవు ఇవ్వాలని అనుకున్నారు. ఇది సాధ్యం కాకపోవడంతో విద్యుత్ అధికారుల నుంచి సెలవు ప్రకటించాలని ఒత్తిడి తెచ్చారు. అప్పటికీ పరిశ్రమల యజమానులు వినకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేయించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులను అడిగితే మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేశామని చెప్పుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. విద్యుత్ లేకపోవడంతో ఆ ప్రాంతంలో ఉన్న అన్ని పరిశ్రమల నిర్వాహకులు జనరేటర్‌పై ఆధారపడ్డారు. ఒక్క రోజుకు దాదాపు కోటి రూపాయల అదనపు భారం పరిశ్రమల యజమానులపై పడినట్లు తెలుస్తోంది. చిన్న పరిశ్రమల నిర్వాహకులు అదనపు భారాన్ని భరించలేక విద్యుత్ కోసం ఎదురుచూశారు. నిత్యం పరిశ్రమలతో కళకళలాడే పారిశ్రామిక వాడ సోమవారం నాడు నిర్మానుష్యంగా మారిపోయింది.

సభకు గార్మెంట్స్ పరిశ్రమ మహిళా కార్మికుల తరలింపు

హిందూపురం రూరల్ మండలం చౌళూరు, తూముకుంట, గోళ్ళాపురం, కొటిపి, కిరికెర, బేవినహళ్లి పంచాయతీల్లో వైసిపి సమావేశాలను ఏర్పాటు చేసింది. జన సమీకరణ కోసం స్థానిక నేతలు పారిశ్రామిక వాడలో ఉన్న టెక్స్‌పోర్టు పరిశ్రమకు చెందిన బస్సుల్లోనే మహిళా కార్మికులను తరలించారు.

రూ. కోటి అదనపు భారం

హిందూపురం రూరల్ మండలం తూముకుంట, గోళ్ళాపురం పారిశ్రామిక వాడలో దాదాపు 120 వరకు వివిధ పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమల నిర్వహణకు విద్యుత్ సౌకర్యం చాల అవసరం. సోమవారం విద్యుత్ శాఖ వారు మరమ్మతుల పేరుతో పారిశ్రామికవాడకు కరెంట్ కట్ చేయడంతో పరిశ్రమ నిర్వాహకులకు కోటి రూపాయల వరకు అదనపు భారం పడింది. గత 30 సంవత్సరాలుగా ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు విద్యుత్ సరఫరా ఆగిపోయిందని పరిశ్రమల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.

టిటిడి ఉద్యోగులందరికీ ఇళ్లపట్టాలు

రెండో విడత పంపిణీలో భూమన కరుణాకరరెడ్డి ● మిగిలినవారికి ఏర్పేడు వద్ద 450 ఎకరాలు సేకరణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

టిటిడి ఉద్యోగులందరికీ అతి తక్కువ ధరకు ఇళ్లపట్టాలు ఇస్తున్నామని చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. రెండో విడత ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం సోమవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో సోమవారం జరిగింది. మొత్తం 1703 మందికి ఇంటిస్థలాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ...ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు ఇచ్చే విషయం గురించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తాను సంప్రదించినప్పుడు ఉద్యోగులందరికీ ఉచితంగా ఇంటి స్థలాలు ఇద్దామని చెప్పారన్నారు. అయితే చట్ట ప్రకారం ఇందులో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే నామమాత్రపు ధరతో ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. మూడో విడతగా రిటైర్డ్ ఉద్యోగులకు, మిగిలిన ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడం కోసం ఏర్పేడు మండలం పాగాలి వద్ద 350 ఎకరాల భూమిని టిటిడికి ఇవ్వడంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేసిన కృషి అభినందనీయమన్నారు. ఇందుకోసం ధర్మకర్తల మండలిలో రూ. 87.50 కోట్లు మంజూరు చేయించడంలో ఇఒ ప్రత్యేక శ్రద్ధ చూపారని చెప్పారు. ఏర్పేడు వద్ద ఈ నెలాఖరులోపు 450 ఎకరాలను స్వాధీనం చేసుకుని మూడో విడతలో నాలుగు వేల మందికి పైగా ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇంటిస్థలాలు అందజేస్తామని తెలిపారు.

సాగు పెరిగే... ధర తగ్గే..!

- ఆయిల్‌పామ్ రైతుల గగ్గోలు
- ఈ ఏడాది 20 వేల ఎకరాల్లో పెరిగిన సాగు
- క్వింటాల్‌కు రూ.23 వేల నుంచి రూ.12,400కు ధర పతనం
- కనీసం రూ.18 వేలు ధర ఉండాలని డిమాండ్



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఆయిల్‌పామ్ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంటకు ధర బాగుందని, రైతులు కొత్తగా తోటలు వేస్తుండగా, ఈ ఏడాది ధరమాత్రం భారీగా పడిపోయింది. దీంతో ఆయిల్‌పామ్ రైతులకు ఏం చేయాలో తెలీని పరిస్థితి నెలకొంది. ఎన్నో ఆశలతో ఆయిల్‌పామ్ తోటలు వేస్తున్న రైతులు లోలోన తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు లక్షా పదివేల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నారు. పామాయిల్ సాగులో రాష్ట్రంలో ఏలూరు జిల్లా ప్రథమస్థానంలో ఉంది. రెండేళ్ల క్రితం ఆయిల్‌పామ్ పంటకు సరైన ధర లేకపోవడంతో రైతులు తోటలను తొలగిస్తూ మొక్కజొన్న సాగువైపు మళ్లారు. కామవరపుకోట, ద్వారకాతిరుమల వంటి అనేక మండలాల్లో రైతులు తోటలు తొలగించారు. గతేడాది ఆకస్మికంగా టన్ను పామాయిల్ ధర రూ.23 వేలు పలికింది. దీంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. పామాయిల్ సాగుపై రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. పంటకు మంచి ధర పలకడంతో అంతకు ముందు ఎకరాకు రూ.50 వేలు, రూ.60వేలు ఉండే కౌలుకాస్తా రూ.లక్ష దాటేసింది. అంతేకాకుండా కొత్తగా తోటలు వేయడం సైతం రైతులు ప్రారంభించారు. దీంతో 2023లో కొత్తగా 20,215 ఎకరాల్లో పామాయిల్ సాగు పెరిగింది. పామాయిల్ రైతులు ఎన్నో ఆశలతో ముందుకు వెళుతుండగా ఈ ఏడాది అనూహ్యంగా పామాయిల్ ధర భారీగా పడిపోయింది. టన్ను ధర రూ.12,300 వరకూ మాత్రమే పలికింది. ఒక్కసారిగా టన్నుకు రూ.పదివేలకుపైగా ధర పడిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పామాయిల్ ధర పతనంతో ఈ ఏడాది రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పెట్టుబడులు కూడా రాని పరిస్థితి

ఆయిల్‌పామ్ సాగులో ఎకరాకు ఎరువులు, కోత ఖర్చులు అన్నీ కలిపి రూ.80వేల వరకూ పెట్టుబడి అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎకరాకు పది టన్నులకుపైగా దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది తెల్లదోమసోకి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. ఎకరాకు ఏడేనిమిది టన్నుల దిగుబడి రావడమే గగనంగా మారింది. ఎకరం పామాయిల్ తోటకు పెట్టుబడి, కౌలు కలిపితే రూ.1.60 లక్షలు వరకూ అవుతోంది. టన్నుకు రూ.12,300 ధర చొప్పున లెక్కిస్తే ఏడు టన్నులకు రూ.86 వేలు మాత్రమే ఆదాయం వస్తోంది. దీంతో కౌలురైతులు ఎకరాకు రూ.70 వేల వరకూ నష్టపోయారు. పామాయిల్ సాగుచేసే రైతులు తక్కువగా లెక్కించినా ఐదెకరాల వరకూ సాగుచేస్తారు. దీంతో ఒక్కో రైతు తక్కువగా లెక్కించినా రూ.3.50 లక్షల వరకూ నష్టపోయిన పరిస్థితి నెలకొంది. దీంతో కౌలురైతులు అప్పులుపాలై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పామాయిల్ రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రనిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. టన్నుకు కనీసం రూ.18 వేలు ధర ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పామాయిల్ రైతులు కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా కొత్త పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తామంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీని సైతం నెరవేర్చలేదు. పామాయిల్ సాగు పెంపుచేసినట్లు ప్రభుత్వం గొప్పగా చెబుతోంది. అదేసమయంలో ధర పతనంపై కూడా మాట్లాడితే బాగుంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోడి పందేల బరులు సిద్ధం



జీలుగుమిల్లి : ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలోని పలుచోట్ల కోడి పందేలకు ఇప్పటి నుంచే బరుల ఏర్పాటుకు పందెం నిర్వాహకులు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి వచ్చిందంటే కోడి పందేలకు బరులు సిద్ధం అయిపోతుంటాయి. కాని మండలంలోని పలుచోట్ల పండగ వారం రోజుల ముందే కొంతమంది నేతల అండదండలతో కోడి పందేల బరులు సిద్ధం చేసేస్తున్నారు. పందెం నిర్వాహకులు ఏటా సంక్రాంతి పండుగ మొదటి రోజున ఉదయం నుంచి పోలీసుల ఆంక్షలతో పందేలకు పండుగ మూడు రోజులు మాత్రమే అనుమతులు వచ్చేవి కాని ఈ సంవత్సరం పండుగకి వారం రోజుల ముందు నుంచి బరులను సిద్ధం చేస్తుండటంతో పందెం రాయుళ్ళకు ఇక ఎదురు లేనట్లు తెలుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ స్థానిక అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో పందెం రాయుళ్లు మాత్రం హడావిడిగా బరుల ఏర్పాటులో నిమగ్నమయ్యారు.

హత్యకేసులో నలుగురికి జీవిత ఖైదు

అనంతపురం: హత్యకేసులో నలుగురికి జవిత ఖైదు విధిస్తూ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సోమవారం తీర్పునిచ్చారు. శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన పాలాకుల చిన్న చౌడయ్య అలియాస్ చౌడప్ప హత్యకేసులో పాలాకుల సూర్యనారాయణ, పాలాకుల పెద్దన్న, పాలాకుల రామాంజినేయులు, పాలాకుల రామాంజినమ్మలకు జీవితాకాలపు కఠినగార శిక్షను విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. ఈ కేసులో ముద్దాల తల్లి అయిన పాలాకుల సాలమ్మపై సాక్షం రుజువు కానందున శిక్షపడలేదు.. ఈ కేసులో సిఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఛార్జీ షీట్ దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ తరుపున రాచమల్లు హరినాథరెడ్డి వాదించారు కానిస్టేబుల్ సుంకన్న ఈ కేసులో సాక్షులను తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషించారు. కేసు పూర్వాపరాల్లోకెళితే ఎస్సి కాలనీలో పక్కపక్కన ఇళ్లు ఉండే శ్యామల, రామాంజినమ్మల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతూ ఉండేవి. ఓరోజు సాయంత్రం ఏడు గంటల సమయంలో ఇంటి ముందు శ్యామల, ఆమె భర్త ఆదినారాయణ నిలుచుకుని ఉండగా వేటకొడవలి, రోకలిబండతో దాడి చేశారు. వీరిపై దాడి జరుగుతున్న సమయంలో ఆదినారాయణ తమ్ముడి చౌడప్ప అడ్డుకోవడంతో అతడిపైనా దాడి చేసి హతమార్చారు. ఈ హత్య 2018 ఫిబ్రవరి 11వ తేదిన చోటు చేసుకుంది. ఈ కేసు విచారణ చేపట్టిన జిల్లాకోర్టు సోమవారం నాడు నలుగురు ముద్దాలకు యావజీవ కారాగార శిక్షను విధిస్తూ తీర్పునిచ్చింది.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

- నేరస్తులతో గుజరాత్ ప్రభుత్వం కుమ్మక్కు
- సిపిఎం పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషుల శిక్షా కాలాన్ని తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న చట్టవిరుద్ధమైన నిర్ణయాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సిపిఎం పొలిట్‌బ్యూరో స్వాగతించింది. 2002 గుజరాత్ మారణహోమం సమయంలో అయిదు నెలల గర్భవతి అయిన బిల్కిస్ బానోపైన, ఆమె కుటుంబ సభ్యులపైన సామూహిక అత్యాచారానికి పాల్పడడం, 14మందిని మూకుమ్మడిగా చంపేసిన కేసులో యావజ్జీవ శిక్ష పడిన 11మంది దోషులకు గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదిస్తూ, శిక్షా కాలాన్ని తగ్గించి 2022 ఆగస్ట్ 15న ముందస్తుగానే విడుదలజేసింది. వారిని రెండు వారాల్లోగా జైలుకు వెళ్లి లొంగిపోవాలని సుప్రీం కోర్టు తన తాజా తీర్పులో ఆదేశించింది.

శిక్ష తగ్గింపు ఆదేశాలను జారీ చేసే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదని సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేయడమే కాకుండా, దోషులతో ప్రభుత్వం కుమ్మక్కైన విషయాన్ని ఎత్తి చూపింది. శిక్ష తగ్గింపు ఆదేశాలను సమర్ధించుకోవడానికి వాస్తవాలను అందజేయడంలో గుజరాత్ ప్రభుత్వం మోసానికి పాల్పడిందని ధర్మాసనం పేర్కొంది. నేరస్థులు మోసం చేసి శిక్షను తప్పించుకున్నట్టయితే, సమాజంలో శాంతి, భద్రతలు మిధ్యగా మారిపోతాయని సుప్రీం కోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదం ప్రాతిపదికనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గుజరాత్ ప్రభుత్వం చెప్పిన విషయాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లైతే ఈ పాపంలో కేంద్ర ప్రభుత్వానికి కూడా సమ వాటా వున్నట్లేనని సుప్రీం కోర్టు పేర్కొంది. నేరాల క్రూరత్వాన్ని, సమాజంపై వాటి విస్తృత పర్యవసానాలను, చట్టబద్ధ పాలనను వేటినీ పరిగణనలోకి తీసుకోకుండా శిక్షను మార్చారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ప్రభుత్వాలనేవి రాజ్యాంగబద్ధమైన సంస్థలు. ప్రభుత్వాలు తమ అధికార పరిధులను, చట్టాన్ని, న్యాయ వ్యవస్థను ఉల్లంఘించేలా వ్యవహరించినట్లైతే, అది మన ప్రజాస్వామ్య ఉనికినే ప్రమాదంలో పడేస్తుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

ఐద్వా హర్షం

దోషులను ముందుగానే విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తూ సుప్రీం వెలువరించిన తీర్పు పట్ల ఐద్వా హర్షం వ్యక్తం చేసింది. జైలు శిక్ష పూర్తి కాకుండానే 14 ఏళ్లకే దోషులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడాన్ని ఐద్వా ఆనాడే వ్యతిరేకించిందని పేర్కొంది. ఈ కేసులో విచారణ, శిక్ష అన్నీ మహారాష్ట్రలో జరిగాయి కాబట్టి శిక్ష తగ్గించే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదని కోర్టు పేర్కొందని ఐద్వా గుర్తు చేసింది. దోషి రాధేశ్యామ్ భౌతిక ఆధారాలను తొక్కిపట్టి సుప్రీం కోర్టును మోసగించారని, తద్వారా 2022 మేలో సానుకూలమైన ఆదేశాలు పొందారని, అవి, 11మంది దోషులను విడుదల చేయడానికి దారి తీశాయని కోర్టు పేర్కొంది. గుజరాత్ ప్రభుత్వం 2022 మేలో ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయలేదని, అందుకు బదులుగా దోషులతో కుమ్మక్కైందని ఐద్వా పేర్కొంది.

ఐద్వా రాష్ట్ర కమిటీ హర్షం

బిల్కిస్‌బానో కేసులో దోషులు తిరిగి జైలుకు వెళ్లాలని ఆదేశించిన సుప్రీంకోర్టు తీర్పును ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి స్వాగతించారు. సుప్రీం తీర్పు బిజెపికి చెంపపెట్టని, వెంటనే దోషులను జైలుకు పంపాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సంగమం హర్షం

బిల్కిస్ బానో కేసుపై సుప్రీంకోర్టు తీర్పును సంగమం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంగమం కన్వీనర్ వి ఉమామహేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈ తీర్పు న్యాయ వ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించింది : బృందా కరత్

బిల్కిస్ బానో కేసులో గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రద్దు చేయడాన్ని ప్రతిపక్షాలు స్వాగతించాయి. ఈ తీర్పు న్యాయ వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని నిలిపాయని సిపిఎం నేత బృందాకరత్ పేర్కొన్నారు.

న్యాయానికి దక్కిన విజయం : రాహుల్ గాంధీ

బిజెపి ప్రభుత్వ దురహంకారానికి వ్యతిరేకంగా బిల్కిస్ బానో అవిశ్రాంతంగా జరిపిన పోరాటానికి దక్కిన విజయమిది ఎన్నికల ప్రయోజనాల కోసం న్యాయాన్ని చంపేసే ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకరం. ఈ రోజు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో నేరస్తులను పెంచి పోషిస్తోంది ఎవరనే విషయం దేశానికి చాటి చెప్పినట్లైంది.

బిజెపికి చెంప పెట్టు : మమత బెనర్జీ

బిజెపికి చెంప పెట్టులాంటి తీర్పు ఇది. ఈ సాహసోపేతమైన తీర్పును స్వాగతిస్తున్నాం.

బిజెపి మహిళా సాధికారత డొల్లతనం బయటపడింది : అసదుద్దీన్ ఓవైసీ

మహిళా సాధికారిత గురించి బిజెపి చెప్పే మాటల్లోని డొల్లతనాన్ని ఈ తీర్పు బయటపెట్టింది. బిల్కిస్ బిల్కిస్ బానోకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షమాపణ చెప్పాలి.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం : ఫరూక్ అబ్దుల్లా

గుజరాత్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి ఇది నిలువెత్తు నిదర్శనం

ఈనాడు న్యాయం అందింది : సాక్షి అబ్దుల్ రజాక్ మన్సూరి ప్రశంసలు

దహోద్ : బిల్కిస్ బానోకు ఈనాటికి న్యాయం అందిందని ఈ కేసులో సాక్షి అయిన అబ్దుల్ రజాక్ మన్సూరి వ్యాఖ్యానించారు. సుప్రీం తీర్పును ఆయన స్వాగతించారు. ఈ కేసులో మహారాష్ట్ర కోర్టులో శిక్ష విధించగా, గుజరాత్ ప్రభుత్వం వారిని విడుదల చేయడం తప్పని, అందుకే తాము కోర్టులో సవాలు చేశామని అన్నారు. ఈనాటి పరిణామాలతో తాను సంతోషంగా వున్నానన్నారు. బానో బంధువులు కొంతమంది దేవగడ్ బారియా పట్టణంలో నివాసముంటున్నారు. వారు ఈ వార్త తెలిసిన వెంటనే బాణాసంచా కాల్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

మద్దతుగా నిలిచినవారందరికీ కృతజ్ఞతలు



పదకొండు మంది దోషులను తిరిగి జైలుకు పంపుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఒకింత ఊరట కలిగించింది. ఇంతకుముందూ చెప్పాను, ఇప్పుడు మరోసారి చెబుతున్నాను. నేను ఈ పోరాటంలో ఒంటరిని కాను, నా పక్కన భర్త , మా పిల్లలు ఉన్నారు. ప్రతి కష్టమైన మలుపులో నా చేయి పట్టుకుని నాకు అండగా స్నేహితులు ఉన్నారు. నాకు మద్దతుగా నిలిచినవారందరికీ కృతజ్ఞతలు

– బిల్కిస్ బానో, గుజరాత్ నరమేధంలో బాధితురాలు

రాజ్యసభ ఎన్నికలకు సంజయ్ సింగ్ నామినేషన్

- నరైన్ దాస్ గుప్తా, స్వాతి మాలివాల్ కూడా..



న్యూఢిల్లీ : త్వరలో జరిగే రాజ్యసభ ఎన్నికల కోసం ఆప్ ఎంపి సంజయ్ సింగ్ సోమవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం జైలుల్లో ఉన్న సంజయ్ సింగ్ నామినేషన్ వేయడానికి కోర్టు అనుమతించడంతో సివిల్ లైన్స్‌లో ఉన్న ఎన్నికల కార్యాలయం వద్దకు పోలీస్ వ్యాన్‌లో వచ్చిన సంజయ్ సింగ్ తన నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో గత ఏడాది అక్టోబర్ 4న సంజయ్ సింగ్‌ను ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సోమవారం ఆప్ ఎంపి నరైన్ దాస్ గుప్తా, ఢిల్లీ మహిళా కమిషన్ మాజీ చీఫ్ స్వాతి మాలివాల్ కూడా సోమవారం రాజ్యసభ ఎన్నికల కోసం తమ నామినేషన్లను దాఖలు చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో స్వాతి మాలివాల్‌ను ఆప్ తమ అభ్యర్థిగా ప్రకటించడంతో ఈ నెల 5న ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ పదవికి స్వాతి మాలివాల్ రాజీనామా చేశారు. ఖాళీఅయిన రాజ్యసభ స్థానాలకు ఈ నెల 19న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎన్నికల జరగనున్నాయి. సాయంత్రం 5 గంటలకు ఫలితాలను ప్రకటించనున్నారు.

సంజయ్ సింగ్ బెయిల్ పిటీషన్‌పై స్పందించండి ఇడికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం

సంజయ్ సింగ్ బెయిల్ పిటీషన్‌పై స్పందించాలని ఇడిని ఢిల్లీ హైకోర్టు సోమవారం ఆదేశించింది. ఢిల్లీ మద్యం పాలసీకి చెందిన మనీలాండరింగ్ కేసులో గత ఏడాది అక్టోబర్ 4న సంజయ్ సింగ్‌ను ఇడి అరెస్టు చేసింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సిబిఐ ఈ కేసు నమోదు చేసింది. సిబిఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి కేసు విచారణ చేస్తోంది. తన బెయిల్ పిటీషన్‌ను ట్రయల్ కోర్టు డిసెంబరు 22న తిరస్కరించడంతో ఢిల్లీ హైకోర్టును సంజయ్‌సింగ్ ఆశ్రయించారు. నేరంలో ఎటువంటి పాత్ర లేకపోయినా సంజయ్ సింగ్ మూడు నెలలుగా కస్టడీలోనే ఉన్నారని ఆయన తరపున సీనియర్ న్యాయవాది మోహిత్ మధూర్ కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న జస్టిస్ స్వరన కాంత శర్మ ఈ పిటిషన్‌పై స్పందించాలని ఇడికి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు.

ఈ ఏడాది చివరికి కొత్త చట్టాల అమలు

- డిజిపిల సమావేశంలో మోడీ

న్యూఢిల్లీ : కొత్తగా తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను ఈ ఏడాది చివరి నాటికే అమల్లోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయాన్ని జైపూర్‌లో జరిగిన డిజిపిల వార్షిక సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెల్లడించినట్లు ఒక అధికారి తెలిపారు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో డిజిపిల వార్షిక సమావేశం జరిగింది. 2023 డిసెంబరులో నోటిఫై చేసిన మూడు క్రిమినల్ చట్టాలను తొలుత చండీగఢ్‌లో ప్రారంభించి దశలవారీగా అన్ని కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలు చేస్తామని, ఆ తరువాత రాష్ట్రాల్లో అమలు చేస్తామని ప్రధాని మోడీ ఆ సమావేశంలో తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలకోసం జాయింట్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని అధికారులను ప్రధాని మోడీ కోరారు. మయన్మార్‌తో సరిహద్దును పంచుకునే రాష్ట్రాల్లో జాయింట్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతాల్లో తిరుగుబాటును అరికట్టడంలో సహాయపడుతుందని మోడీ తెలిపారు.

కంది పప్పుతో ఓట్లకు గాలం?

- ఎన్నికల వరకు రేషన్‌కార్డు దారులకు సరఫరా
- పౌరసరఫరాల శాఖ కసరత్తు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రేషన్‌కార్డుల ద్వారా ఇప్పటివరకు అరకొర సరఫరాకే పరిమితమైన కందిపప్పును ఎన్నికలు అయ్యేంతవరకు ఎటువంటి కొరత లేకుండా లబ్ధిదారులకు అందివ్వడానికి ప్రభుత్వం కసరత్తుచేస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను దాటుతున్న ప్రస్తుత సమయంలో ఈచర్య ద్వారా ఎంతో కొంత మేరకు ఓటర్లకు గాలం వేయవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో కందిపప్పును భారీగా సేకరించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది 1,69,960 మెట్రిక్ టన్నుల కందిపప్పు అందుబాటులోకి వస్తుందని అంచనా. దీనిలో పౌరసరఫరాలశాఖ 58,655 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు నాఫెడ్ ద్వారా సేకరించిన కందులను పౌరసరఫరాలశాఖ కొనుగోలు చేసేది. ఈ దఫా అలా కాకుండా పౌరసరఫరాలశాఖ రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బికె) ద్వారా నేరుగా కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతోంది. నాఫెడ్ మాత్రం ఏ రోజుకారోజు ఎంఎస్‌పి ధర ప్రకారం నంద్యాల, కర్నూలు జిల్లాల్లో కొనుగోలు ప్రక్రియను ప్రారంభించగా, పౌర సరఫరాలశాఖ ఎంఎస్‌పి ధరను పక్కన బెట్టి మార్కెట్ ధరను ప్రామాణికంగా తీసుకుంటూ రైతుల వద్ద నుంచి కొనుగోలుచేయాలని భావిస్తోంది. సంక్రాంతి తరువాత ఈ ప్రక్రియ ప్రారంభం కానుందని సమాచారం. దీనికి సంబంధించి పౌరసరఫరాలశాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండియన్ కందులు పండిన జిల్లాల కలెక్టర్లతో సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇటీవల సమీక్ష నిర్వహించారు. క్వింటాలు కందులు ఎంఎస్‌పి ధర రూ.7వేలుగా ప్రభుత్వం నిర్ణయించగా, మార్కెట్లో కందులు రూ.9,500ల నుంచి 11వేల వరకు ధర పలుకుతోంది.పౌరసరఫరాలశాఖ మార్కెట్ రేటును పరిగణలోకి తీసుకుంటూ ఎంఎస్‌పి ధర కంటే ఎక్కువ ధరకైనా కందులు కొనుగోలు చేయాలని నిర్ణయించినప్పటికీ ఎంత ధరకు కందులు కొంటారనే విషయంపై స్పష్టత లేదు. ఆయా జిల్లాల కలెక్టర్లు స్థానికంగా ఉన్న మార్కెట్ ధరను అంచనా వేయాలని ప్రభుత్వం ఆదేశించింది.


యుపిలో నేటి నుంచి ట్రక్ డ్రైవర్ల నిరవధిక సమ్మె

లక్నో : కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత (బిఎన్ఎస్)లో హిట్ అండ్ రన్ కేసులపై కఠినమైన చట్టాలకు వ్యతిరేకంగా మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు ఉత్తరప్రదేశ్ ట్రక్ ఆపరేటర్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ట్రక్, బస్, ట్యాంకర్ల డ్రైవర్లు ఈ సమ్మెలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి ధీరేంద్ర తివారీ మాట్లాడూతూ పై చట్టంలో ఎటువంటి మార్పులు చేయమని కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసిందని, అందువల్లే నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ రోడ్డుపై ఏదైనా సంఘటన జరిగే దానిని ప్రమాదంగా గుర్తిస్తున్నారని, నూతన చట్టంలో ప్రమాదాన్ని హత్యగా పరిగణిస్తూ చర్యలు తీసుకునేలా నిబంధన పెట్టారని తెలిపారు. దీంతో ప్రైవేట్ వాహన డ్రైవర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త చట్టాన్ని కేంద్రం రద్దు చేయకపోతే ఇంధనం, పాలుతో సహా అన్ని రకాల నిత్యావసర సరుకుల రవాణాను నిలిపివేస్తామని హెచ్చరించారు.

నిజమైన ఆందోళనలపై స్పందించడం లేదు

- సిఇసికి జైరాం రమేష్ లేఖ

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఇవిఎం)లపై తాము లేవనెత్తుతున్న నిజమైన ఆందోళనలపై ఎన్నికల కమిషన్ స్పందించడం లేదని కాంగ్రెస్ నాయకులు జైరాం రమేష్ ఆరోపించారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్‌కు ఆయన లేఖ రాశారు. 'తాము లేవనెత్తుతున్న అన్ని ప్రశ్నలకూ 'ఇవన్ని తరచూ అడిగే ప్రశ్నలే' అని ఇసి సమాధానం ఇస్తుంది. రాజకీయ పార్టీలతో సమావేశానికి ఇసి తిరస్కరిస్తుంది. ఇది చాలా ఆందోళన కలిగిస్తుంది' అని లేఖలో జైరాం రమేష్ పేర్కొన్నారు. సిఇసితో అపాయింట్‌మెంట్ కోసం ఇండియా వేదిక నేతలు చేసిన అభ్యర్థనను ఇసి తిరస్కరించడాన్ని జైరాం రమేష్ ఖండించారు. 'ఇవిఎంలు లేదా వివిప్యాట్లపై ఆందోళనలకు సంబంధించి ఇండియా కూటమి నాయకులను కలవడానికి ఇసికి ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేవు. దేశానికి ప్రధాన మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను అందించిన ఇండియా కూటమి నుంచి మేం అభ్యర్థన చేస్తున్నాం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా వేదిక పార్టీలకు 60 శాతానికి పైగా ఓట్లు వచ్చాయి. అయినాసరే ఈ పార్టీలతో సమావేశానికి ఇసి నిరాకరిస్తూనే ఉంది. ఇది చాలా దురదృష్టకరం. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు' అని జైరాం రమేష్ తన లేఖలో పేర్కొన్నారు.



తిరుపతి ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టిన నాని, కార్యకర్తలు

బంగ్లాదేశ్ ఆర్థిక ప్రగతే లక్ష్యం !

- ఈ విజయం ప్రజలదేనన్న హసీనా
- అవామీ లీగ్‌కు 222 స్థానాలు



ఢాకా : బంగ్లాదేశ్‌లో ఆదివారం జరిగిన 12వ సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 300 స్థానాలకు గాను అవామీ లీగ్‌కు 222 సీట్లను గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. అవామీలీగ్‌కు మిత్రపక్షమైన జతియా పార్టీకి 11, ఇండిపెండెంట్లు 62, ఇతరులు మూడు సీట్లు గెలుచుకున్నారు. వరుసగా నాల్గవ సారి అధికారాన్ని కైవసం చేసుకుని ప్రధాని పదవిని చేపట్టనున్న అవామీ లీగ్ అధ్యక్షురాలు, ప్రధాని షేక్ హసీనా స్పందిస్తూ ఈ విజయం ప్రజలదేనన్నారు. ప్రజలు చైతన్యవంతులై ఓటు వేశారని వ్యాఖ్యానించారు. ప్రజలకు ఓటు వేసే హక్కును స్వేచ్ఛగా అమలు చేయాలన్నదే తమ లక్ష్యమని అది నెరవేరిందని అన్నారు. బంగ్లాదేశ్‌లో 80శాతం మంది ప్రజలు నిరుపేదలేనని, అందువల్ల వారికి మరింత మెరుగైన జీవితాన్ని అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ పునర్నిర్మాణంలో తాము పునరంకితం అవుతామన్నారు. దేశం ఆర్థిక ప్రగతిని సాధించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. విదేశీ జర్నలిస్టులు, పరిశీలకులనుద్దేశించి మాట్లాడుతూ, వారు రావడం వల్లనే ప్రజాస్వామ్యం, మానవ హక్కులకు మరింత రక్షణ కల్పించబడిందన్నారు. వారి రాకతో దేశ ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థ మరింత బలోపేతమైందని భావిస్తున్నట్లు చెప్పారు.

మోడీ అభినందనలు

బంగ్లాదేశ్ ఎన్నికల్లో విజయం సాధించిన అవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనాను భారత ప్రధాని నరేంద్ర మోడీ అభినందించారు. వరుసగా నాల్గవసారి విజయం సాధించిన హసీనాతో ఫోన్‌లో మాట్లాడిన మోడీ, ఈ విజయానికి కారకులైన బంగ్లా ప్రజలను కూడా అభినందించారు. భారత్, బంగ్లాదేశ్ ప్రజల మధ్య మరింత బలమైన సంబంధాలు కొనసాగేలా చూసేందుకు మనం కట్టుబడి వుండాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వానికి నోటీసులు

ప్రజాశక్తి–అమరావతి

రాష్ట్రంలోని బిఇడి కళాశాలల్లో తనిఖీల నిర్వహణ అధికారాన్ని ఎపి ఉన్నత విద్యాశాఖ మండలికి అప్పగించేందుకు కారణాలను వివరించాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన ఉన్నత విద్యశాఖ ముఖ్యకార్యదర్శి/కార్యదర్శి/ఛైర్మన్, ఉన్నత విద్య నియంత్రణ పర్యవేక్షణ కమిషన్, యోగి వేమన, ఆచార్య నాగార్జున యునివర్సిటీల రిజిస్ట్రార్లను ఆదేశిస్తూ జస్టిస్ వి సుజాత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బిఇడి కళాశాలల్లో తనిఖీల నిర్వహణ అధికారాన్ని ఎపి ఉన్నత విద్యాశాఖ మండలికి అప్పగించేందుకు వీలుగా జనవరి 1న ప్రభుత్వం జారీ చేసిన జిఓ ఒకటిని కొట్టేయాలని కోరుతూ ప్రైవేటు బిఇడి కాలేజ్ మేనేజ్‌మెంటు అసోసియేషన్ అధ్యక్షులు గుండారెడ్డి, బిఇడి కళాశాల యాజమాన్యాలు పిటిషన్లు దాఖలు చేశాయి. తదుపరి విచారణను ఈ నెల పదికి హైకోర్టు వాయిదా వేసింది.

కుల ధ్రువీకరణ పత్రాలపై సిఎం ఫొటోనా?

- హైకోర్టులో పిల్

ప్రజాశక్తి–అమరావతి

ఎస్‌సి, ఎస్‌టిలకు జారీచేసే జనన, కుల, స్థానికత ధ్రువీకరణ పత్రాలపై సిఎం వైఎస్ జగన్ ఫొటోలను ముద్రించడాన్ని సవాల్ చేస్తూ అమరావతి బహుజన సొసైటీ అధ్యక్షులు పోతుల బాలకోటయ్య హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దేశంలో ఈ తరహాలో ఏ రాష్ట్రమూ చేయడం లేదన్నారు. సిఎం ఫొటో లేకుండా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇందులో ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ముఖ్యకార్యదర్శి, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శులను చేశారు. సిఎం ఫొటోతోపాటు నవరత్నాల పథకం లోగోను ముద్రిస్తున్నారన్నారు. కేంద్ర హోంశాఖ జారీ చేసిన మార్గదర్శకాలు, ఎపి సర్కారు 1997లో జారీచేసిన జిఓ 58కి అనుగుణంగా ఎస్‌సి, ఎస్‌టిలకు ధ్రువపత్రాలు జారీ చేయాలన్నారు. రూల్స్ మార్పు చేయకుండా ప్రభుత్వం తన అభీష్టానికి అనుగుణంగా జారీ చేయడం చెల్లదన్నారు.

పాకిస్థాన్‌లో భారీ పేలుడు

- పోలియో రక్షణ బృందంలో ఆరుగురు పోలీసులు మృతి

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లో భారీ పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు పోలీసులు మరణించినట్లు అధికారులు తెలిపారు. మరో 22 మందికి గాయాలయ్యాయని చెప్పారు. ఈ ఘటన ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు ప్రావిన్స్‌లోని బజౌర్ జిల్లాలోని మామముంద్ తహసిల్‌లో చోటు చేసుకుంది. ఖైబర్ ఫక్తుంఖ్వా ప్రావిన్స్‌లో సోమవారం ఉదయం పోలియో వ్యాక్సిన్ వేసేవారికి భద్రత కల్పించేందుకు వెళ్లిన పోలీసులే లక్ష్యంగా ఈ బాంబు పేలుడు జరిగింది. పోలీసులు పోలియో టీకా బృందాలతో భద్రతా విధులు నిర్వర్తించేందుకు వ్యానులో ఎక్కినప్పుడు పేలుడు జరిగినట్లు తెలిపారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆ ప్రాంతంలో అత్యవసర పరిస్థితి విధించారు. ఈ పేలుడులో గాయపడిన వారందరూ పోలీసులేనని పోలీసు అధికార ప్రతినిధి వెల్లడించారు. తాత్కాలిక ముఖ్యమంత్రి కెపికె అర్షద్ హుస్సేన్ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. చివరి తీవ్రవాదిని అంతం చేసే వరకు తీవ్రవాదంపై యుద్ధం కొనసాగుతుందని అన్నారు. వ్యాక్సిన్‌పై వ్యతిరేకత కారణంగా పాకిస్థాన్‌లో తీవ్రవాదులు తరుచూ పోలియో బృందాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని అన్నారు. ఈ దాడికి బాధ్యులు ఎవరనేది ఇప్పటి వరకు ఎవరూ ప్రకటించలేదు.. పాకిస్తాన్ తాలిబాన్‌తో సహా ఇస్లామిక్ తీవ్రవాదులు గతంలో అనేక మంది పోలియో టీకా కార్మికులతో పాటు వారిని రక్షించే పోలీసులపై బాంబు దాడి చేసిన సంగతి తెలిసిందే.

ముదురుతున్న మాల్దీవుల వివాదం

- ప్రధాని మోడీపై వ్యాఖ్యలకు భారత్ అభ్యంతరం
- మాల్దీవుల దౌత్యవేత్తను పిలిపించుకున్న విదేశాంగ శాఖ
- ఆ వ్యాఖ్యలతో సంబంధం లేదన్న మాల్దీవుల ప్రభుత్వం



న్యూఢిల్లీ : భారత ప్రధాని నరేంద్ర మోడీపై మాల్దీవుల వివాదాస్పద వ్యాఖ్యలతో తలెత్తిన వివాదం అంతకంతకూ ముదురుతోంది. ఆ వ్యాఖ్యలతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధమూ లేదని మాల్దీవుల ప్రభుత్వం భారత్‌కు స్పష్టం చేసిన కొద్ది సేపటికే భారత్‌లోని మాల్దీవుల దౌత్యవేత్త ఇబ్రహీం షాహీబ్‌ను విదేశాంగ శాఖ పిలిపించుకుని తన అభ్యంతరాన్ని తెలియజేసింది. ఇటీవల ప్రధాని మోడీ లక్షద్వీప్‌లో పర్యటించిన ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంపై మాల్దీవుల మంత్రులు స్పందిస్తూ మాల్దీవులకు ప్రత్యామ్నాయంగా లక్షద్వీప్‌ను ప్రముఖ పర్యాటక ప్రాంతంగా రూపొందించేందుకు భారత్ యత్నిస్తోందని వ్యాఖ్యానించారు. దీంతో మాల్దీవుల ప్రభుత్వం ముగ్గురు మంత్రులు మరియం షివునా, మల్షా షరీఫ్, అబ్దుల్లా మజూంలను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

అనుచిత వ్యాఖ్యలు చేసి, సస్పెండైన తమ మంత్రులు చేసిన వ్యాఖ్యలు తమ ప్రభుత్వ అభిప్రాయాలను ప్రతిబింబించవని మాల్దీవుల ప్రభుత్వం భారత హై కమిషనర్ మును ముహవర్‌కు తెలియచేసింది. ఆ వ్యాఖ్యలు తమకు ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. భాగస్వాములందరితో ముఖ్యంగా పొరుగు దేశాలతో సానుకూల, నిర్మాణాత్మక చర్చలు, సంబంధాలు కొనసాగించేందుకు మాల్దీవులు కట్టుబడి వుందని మాల్దీవుల విదేశాంగ మంత్రి మూసా జమీర్ స్పష్టం చేశారు. ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపేందుకు హై కమిషనర్ మును మహవర్ మాల్దీవుల రాయబారి అలీ నజీర్ మహమ్మద్‌తో భేటీ అయ్యారని భారత హై కమిషన్ కార్యాలయం ఎక్స్‌లో తెలిపింది.

భారత్‌తో దౌత్య వివాదం కొనసాగుతుండగానే మరోపక్క మాల్దీవుల అధ్యక్షుడు ముయిజు ఐదు రోజుల అధికార పర్యటన నిమిత్తం చైనాకు బయలుదేరి వెళ్లారు. ఇరు దేశాల అధ్యక్షులు చర్చలు జరిపి, వాణిజ్యం, వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధి, సామాజిక, ఆర్థిక సహకారాన్ని పెంపొందించేందుకు కీలక ఒప్పందాలపై సంతకాలు చేస్తారని భావిస్తున్నారు.

ఫిర్యాదు చేసినా దొంగ ఓట్లు తొలగించరా..?

- తిరుపతి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద పులివర్తి నాని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి – తిరుపతి టౌన్

చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన కుమారుడిని గెలిపించుకోవడానికి భారీగా దొంగ ఓట్లు నమోదు చేయించారని, వాటిని తొలగించాలని పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని తిరుపతి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద టిడిపి చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని నిరసన దీక్ష చేపట్టారు. పోలీసులు ఈ నిరసన దీక్ష శిబిరాన్ని భగ్నం చేయడానికి ప్రయత్నించగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసులు దీనిని అడ్డుకున్నారు. అంతకు ముందు పులివర్తి నాని మాట్లాడుతూ... చంద్రగిరి నియోజకవర్గంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఓడిపోతారనే భయంతోనే దొంగ ఓట్లు నమోదు చేశారని ఆరోపించారు. ఇటు జిల్లా ఎన్నికల అధికారులకు అటు రాష్ట్ర ఎన్నికల అధికారి ఫిర్యాదు చేసినా బోగస్ ఓట్లు తొలగించకపోవడం దారుణమన్నారు. నిరసన కార్యక్రమానికి తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ, రవి నాయుడు, ఊక విజయ్ కుమార్, కార్పొరేటర్ మునికృష్ణ పాల్గొన్నారు.

నానికి అస్వస్థత

తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిని సమయంలో పెద్దఎత్తున కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. నాని కళ్లలో పెట్రోల్ పడడంతో ఆయన అస్వస్థతకు గురయ్యారు. దీంతో టిటిపి నాయకులు ఆయనను ఆస్పత్రికి తరలించారు.

బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదల చెల్లదు

(మొదటి పేజీ తరువాయి)

తనకు న్యాయం చేయాలని బిల్కిస్ బానో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో ఆమెకు మద్దతుగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ, టిఎంసి నేత మహువా మొయిత్రా, జర్నలిస్ట్ రేవతి లాల్, లక్నో యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ రూప్ రేఖా వర్మ దాఖలు చేసిన పిటిషన్లు వేశారు. వీటిని 11 రోజుల పాటు విచారించిన జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్‌లో తీర్పును రిజర్వ్ చేసింది. ఈ లోగా దోషుల విడుదలకు సంబంధించిన పత్రాలన్నిటిని కోర్టుకు సమర్పించాలని గుజరాత్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు కోరింది. వాటిని పరిశీలించిన తరువాత వీరి విడుదల చెల్లనేరదని సుప్రీం ధర్మాసనం తీర్పు చెప్పింది. దోషులు రెండు వారాల్లోగా జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది.

దోషుల ముందస్తు విడుదలపై ఉత్తర్వులు జారీచేసే అధికారం గుజరాత్ ప్రభుత్వానికి లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది. అయితే, గియితే మహారాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే అటువంటి అధికారం ఉంటుందని పేర్కొంది. ఈ కేసు విచారణను గుజరాత్ నుంచి మహారాష్ట్రకు బదిలీ చేశాక, విచారణ, శిక్ష విధింపు అన్నీ మహారాష్ట్రలోనే జరిగాయి అలాంటప్పుడు గుజరాత్ ప్రభుత్వం వీరి శిక్షాకాలాన్ని ఎలా తగ్గిస్తుందని సుప్రీం ప్రశ్నించింది.

ఈ కేసులో రెమిషన్ కోరుతూ దోషి చేసిన విజ్ఞప్తిని పరిశీలించాలంటూ 2022 మార్చిలో సుప్రీంకోర్టు మరో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాల (11 మంది దోషుల్లో ఒకరైన రాధేశ్యామ్ భగవాన్‌దాస్ షా దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ 2022 మే 13న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు)పైనా ధర్మాసనం స్పందించింది. వాస్తవాలను దాచి, మోసపూరిత మార్గాల ద్వారా దోషి ఆ ఆదేశాలను పొందాడని పేర్కొంది."2022 మే 13 నాటి ఆదేశాలు మోసం వల్ల ఇచ్చినవి. ఇది చట్టబద్ధం కాదు. ఈ ఉత్తర్వు ఫలితంగా ప్రారంభించిన అన్ని ప్రక్రియలను పక్కన పెట్టడం జరిగింది" అని తీర్పును రాసిన జస్టిస్ నాగరత్న స్పష్టం చేశారు. గుజరాత్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగానే దోషుల శిక్షాకాలం తగ్గించినట్టు పేర్కొన్నందున ఈ పాపంలో కేంద్ర ప్రభుత్వానికి కూడా వాటా వుందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.

బడ్జెట్ సమావేశాల్లో విద్యుత్ చట్ట సవరణ బిల్లు

- ఆలిండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ దూబే

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి వెళ్లిన విద్యుత్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం మరోసారి తీసుకొచ్చే అవకాశం ఉందని ఆలిండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ శైలేంద్ర దూబే అన్నారు. తొమ్మిదేళ్ల నుంచి ఈ బిల్లును ఆమోదించుకునేందుకు కేంద్రం చూస్తోందని చెప్పారు. విద్యుత్ ఉద్యోగులు దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆందోళనల నేపథ్యంలో ఆమోదించుకోలేకపోయిందన్నారు. ఈ బిల్లును రానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో మరోసారి ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. దీనికి వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగులందరూ మరోసారి పోరాడాలని పిలుపునిచ్చారు. ఎపిఎస్ఇబి ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం విజయవాడలో సోమవారం జరిగింది. ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జిబి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి దూబే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బిల్లు అమల్లోకి రాకపోయినా అందులోని అంశాలను మాత్రం సవరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకొస్తోందన్నారు. కృష్ణపట్నం ప్లాంట్‌ను అదానీకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించిందని, ఉద్యోగుల ఆందోళనతో వెనక్కి తగ్గిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త సర్వీస్ రూల్స్ పేరుతో ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి రత్నాకరరావు మాట్లాడుతూ.. సమస్యలకు పరిష్కారం కావాలంటే పోరాడాల్సిందేనని అన్నారు. ఎపిఎస్ఇబి ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పిఆర్‌సి విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలు అప్పులపాలు కావడానికి ప్రభుత్వం, యాజమాన్యాలు తీసుకుంటున్న నిర్ణయాలే కారణమని తెలిపారు. డిస్కం, జెన్‌కోలలో రూ.వేలకోట్ల ప్రాజెక్టులను కాంట్రాక్టర్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయని విమర్శించారు. ఉద్యోగులకు వేతనాలు పెంచే అంశంపై మాత్రం సానుకూల నిర్ణయం తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మీ కోసం

రెండు లేదా మూడు వెల్లుల్లి రెమ్మలు చిదిమి ఒక స్పూన్ తేనెతో కలిపి తీసుకుంటే నులి పురుగుల సమస్య తగ్గుతుంది.

జీవన సారథం

చేసే ప్రతి యుద్ధంలోనూ గెలవలేము. కానీ ప్రతి యుద్ధంలోనూ పాఠాలూ, ఫలితాలూ ఉంటాయి.

అమ్మతో నేను



అప్పుడే పుట్టిన పచ్చని చిలక
అమ్మని చూసి ఏమంది.
అమ్మా అమ్మా పక్క నుండవే
భయం భయంగా వుందంది.

పాలు తాగిన బుల్లి తువ్వాయి
అమ్మని చూసి ఏమంది
తాగిన పాలు అరిగేదాకా
గెంతులేస్తాను లెమంది.

చెరువున వున్న చేప పిల్లా
అమ్మని చూసి ఏమంది
నా ఈత చూడు ఎంచక్కా
అంటూ చక చక ఈదింది.

ఇంటను వున్న కుక్క పిల్ల
అమ్మను చూసి ఏమంది
ఒక్కసారి పరుగిడతాను
నన్ను వదిలేసి చూడంది.


కొమ్మను వున్న కోయిల పిల్ల
అమ్మని చూసి ఏమంది
నాలా నువ్వు పాడలేవని
కుహు ..కుహు అని కూసింది.

ఉయ్యాలలోని చంటి పాపాయి
అమ్మని చూసి ఏమంది
కమ్మని కథలు చెప్పమ్మా
చక్కగ నిదరో తానంది.


కూచిమంచి నాగేంద్ర.
91821 27880.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేయండి. చివరి వరుస బాక్సుల్లో ఆ సమాధానాలు రాసి, సరిచూసుకోండి.



నేను గీసిన బొమ్మ





పి.శీర్షిక,
9వ తరగతి,
ఘనపురం,
తొగుట సిద్ధిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చెమట చుక్కే ఆయుధంగా...

పేదరికంలో పుట్టి పెద్ద కల కన్నాడు అతను. ఆ కలలో అతని కోసమే కాదు.. తన చుట్టూ ఉన్నవారి బాగోగులు కూడా చూశాడు. అందుకే ఎన్ని కష్టాలు పడ్డా లక్ష్యం చేరుకునేవరకు విశ్రమించలేదు. ఆ దారిలోనే మధుమేహ బాధితుల కోసం నూతన ఆవిష్కరణ చేశాడు. చెమట ద్వారా షుగర్ వ్యాధి నిర్ధారణ చేయొచ్చన్న పరిశోధనా పరికరంపై ఇటీవల భారత ప్రభుత్వం (ఇండియన్ పేటెంట్ అథారిటీ) నుండి పేటెంట్ హక్కు పొందిన ఏలూరుకు చెందిన వూసా.చిరంజీవి శ్రీనివాసరావు గురించే ఇప్పుడు మనం చెప్పకుంటోంది.



జీవ రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ చేసిన శ్రీనివాసరావు ప్రస్తుతం ఐఐటి కాన్పూర్‌లో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. 'మధుమేహాన్ని నిర్ధారణ చేయాలంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను అంచనా వేస్తాం. అయితే రక్తనమూనా తీసుకోవాలంటే ఒకింత నొప్పి ఉంటుంది. ఎప్పుడో ఒకసారి అయితే పర్వాలేదు. కొంతమంది బాధితులు తరచూ రక్త నమూనా ఇవ్వాల్సి వస్తుంది. ముఖ్యంగా ఈ రోజుల్లో పిల్లలు కూడా మధుమేహ బాధితులే. ఔషధాలు, ఇన్సులెన్లు వారి జీవితంలో భాగమై పోయాయి. ఒక్కోసారి రోజుకు రెండు నుండి నాలుగు సార్లు గ్లూకోజు స్థాయిలు అంచనా వేయాల్సి వస్తుంది. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు, పిల్లల్లో తరచూ ఈవిధమైన పరీక్షలు చేయాలి అంటే, అన్నిసార్లూ రక్తం సేకరించాలి. అప్పుడు విపరీతమైన నొప్పితో పాటు, ఇన్సులెన్ తీసుకునే క్రమం తప్పితే కోమాలోకి వెళ్లే ప్రమాదం వుంటుంది. అటువంటి బాధితుల కోసమే చెమట ద్వారా గ్లూకోజ్ స్థాయిలను అంచనా వేసే పరికరాన్ని ఆవిష్కరించాను. ఎలక్ట్రికల్, ఎలక్ట్రోకెమికల్, సెన్సర్లను ఉపయోగించి నాలుగేళ్ల పాటు శ్రమించి ఈ పరికరం తయారుచేశాను. నా పరిశోధనలో ఓ విద్యార్థి, ప్రొఫెసర్ కూడా భాగమయ్యారు. మన దేశంలో ఇది తొలి ప్రయోగం. రెండేళ్లపాటు దీనిని పరీక్షించి ప్రభుత్వం పేటెంట్ హక్కులు ఇచ్చింది. చాలా ఆనందంగా ఉంది' అంటున్న, శాస్త్రవేత్తగా అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తున్న శ్రీనివాసరావు నిరుపేద కుటుంబం నుండి వచ్చారు.



కుటుంబసభ్యులతో శ్రీనివాసరావు

ఆ రోజు రక్తం కంటే కన్నీళ్లు ఎక్కువ కారాయి

శ్రీనివాసరావు తండ్రి వాచ్‌మెన్‌గా, రోజు కూలీ చేస్తూ అమ్మ జీవనం సాగించేవారు. శ్రీనివాసరావుతో పాటు ఓ అమ్మాయి ఆ దంపతుల సంతానం. చాలీచాలని సంపాదనతో రెండు పూటలా తిండి తినడమే కష్టమైన ఆర్థికపరిస్థితుల్లో కుటుంబం గడవడం కోసం చదువుకు కొన్ని రోజులు విరామం ఇచ్చి మరీ ఆయన కూలి పనులు చేశారు. 'మా గ్రామం హైవే పక్కనే ఉండేది. అయినా అదంతా ఓ అడవిని తలపించేది. స్కూలుకు వెళ్లే పిల్లలు చాలా తక్కువ. అటువంటి చోట పుట్టి పెరిగిన నేను ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లోనే విద్యభ్యాసం సాగించాను. అయినా పుస్తకాలు, బట్టలు కొనుక్కునేందుకు ఇంట్లో డబ్బులు ఉండేవి కావు. ఒకసారి అక్క ప్రసవానికి ఇంటికి వచ్చింది. నెలలు దగ్గర పడడంతో అక్కను తీసుకుని అమ్మ ఆస్పత్రికి వెళ్లింది. అప్పుడే నాన్నకు లారీ యాక్సిడెంట్ అయ్యింది. మంచానికే పరిమితమయ్యాడు. ఆ పరిస్థితుల్లో నేను కూలి పనికి వెళ్లాల్సి వచ్చింది. స్కూలుకు సెలవు పెట్టి పొలం పనికి వెళ్లాను. కోత కోయడం చేతకాక, కొడవలి వేటుకు చేయి తెగింది. రక్తం ధారలాగా కారింది. విపరీతమైన నొప్పి వచ్చింది. అంత బాధలోనూ ఎవరైనా చూస్తే ఇంటికి పంపించేస్తారేమో, కూలీ డబ్బులు లేకుండా ఇంటికి వెళితే ఇల్లు గడిచేదెలా అన్న భయం వెంటాడింది. అక్కడే ఆకులు, అలములు గాయం చుట్టూ గట్టిగా కప్పుకుని కోత కోశాను. అయినా రక్తం అదేపనిగా కారింది. డబ్బులు ఇవ్వకుండా పని ఆపేసి మధ్యలో పంపుతారన్న భయంతో రక్తం కంటే ఎక్కువగా ఆరోజు నా కళ్లల్లో కన్నీళ్లు వచ్చాయి' అని తను 10వ తరగతి చదివేటప్పుడు జరిగిన సంఘటనను గుర్తుచేసుకున్నారు శ్రీనివాసరావు.

జాలి చూపులు ఇష్టం లేదు

ఇప్పుడు ఓ శాస్త్రవేత్తగా ఆయనను సమాజం ఎంతో గౌరవిస్తోంది. నూతన ఆవిష్కరణలు చేసిన గొప్ప వ్యక్తిగా కీర్తిస్తోంది. ఈ స్థాయికి రావడానికి ఆయన పడ్డ కష్టాలు, బాధలు, అవమానాలు ఎవరికీ తెలియవు. 'అసలు ఎవరికీ తెలియాల్సిన అవసరం లేదు. నేను పేదరిక కుటుంబం నుండి వచ్చానని, కూలీపనులు చేస్తూ చదువుకుంటున్నానని నా స్నేహితుల్లో కూడా చాలామందికి తెలియదు. పేదరికం పేరుతో ఇతరులు నాపై జాలి చూపించాలని నేనెప్పుడూ అనుకోలేదు. పేదరికం, కులం, మతం మన లక్ష్యానికి అడ్డుగోడలుగా ఉండకూడదు. మనుషులంతా ఒక్కటే. నాకు ఎదురైన పరిస్థితులే నన్ను ఈ స్థాయికి వచ్చేలా చేశాయి. విద్య ద్వారానే నా స్థితిని మార్చుకోవాలని లక్ష్యం పెట్టుకున్నాను. అయితే ఆ విద్య నాకు మాత్రమే కాక, నా చుట్టూ ఉన్న వారికి కూడా ఉపయోగపడాలని అనుకున్నాను. అందుకే ప్రజలకు ఉపయోగపడే, ముఖ్యంగా పేద కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని వివిధ పరిశోధనలు చేస్తున్నాను. అందులో ఒకటే చెమట ద్వారా గ్లూకోజ్ నిర్ధారణ' అంటున్నప్పుడు ఆయన మాటల్లో నిండైన ఆత్మవిశ్వాసం తొణికిసలాడింది.

సంభాషణ : జ్యోతిర్మయి

కలబందలో పోషకాలు




ఔషధ మొక్కగా ఉన్న కలబంద (అలోవెరా)లో అనేక పోషకాలు ఉన్నాయి. అందులో ఉండే గుజ్జు 96 శాతం నీటితోనే తయారవుతుంది. వేడి వాతావరణంలో పెరిగే ఈ మొక్కను నీడలో, ఎండలో ఎక్కడైనా పెంచుకోవచ్చు. కాస్మొటిక్, ఫుడ్, స్కిన్‌కేర్ ప్రొడక్ట్స్‌లో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

వీటిలో ఉండే గుజ్జు, కొబ్బరి నూనె కలిపి తలకు పట్టిస్తే చుండ్రు వదిలిపోతుంది. మృత కణాలు తొలగిపోతాయి. జుట్టు మెరుస్తూ, మృదువుగా మారిపోతుంది. జుట్టు రాలిపోయేవారు ఇలా చేయడం వల్ల మంచి ఫలితాలుంటాయి. బిపి, షుగర్ వంటివి తగ్గేందుకు కూడా అలోవెరా ఉపయోగపడుతుందని పరిశోధనల్లో తేలింది. రోజుకు రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జ్యూస్ తాగితే బిపి, డయాబెటిస్ కంట్రోల్‌లో ఉంటాయి. ఈ విషయంలో డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. చర్మం తెగినా, మండినా, కాలినా, వాపు వచ్చినా, కందినా, పొడిబారినా.. ఆ ప్రదేశంలో అలోవెరా గుజ్జును రాస్తే క్షణాల్లో ఫలితం కనిపిస్తుంది. గుజ్జును రాసిన తర్వాత ఆ ప్రదేశం గట్టిగా అయిపోయినట్లు అనిపిస్తుంది. కారణం అలోవెరా జ్యూస్ అక్కడి చర్మ కణాలకు ఎనర్జీ ఇస్తుంది. కలబందలోని పోషకాలు, ఎంజైములు, అమైనో యాసిడ్లు, ఖనిజాలు అధిక బరువును తగ్గించేవే. ప్రతి రోజూ గ్లాసు నీటిలో 20 శాతం అలోవెరా గుజ్జును కలిపి తాగితే కడుపులోని కొవ్వు, చెడు పదార్థాలు, పేగులకు అంటుకుపోయే ఆయిల్ వంటివన్నీ మొత్తం క్లీన్ అయిపోతాయి. ఉత్తి జ్యూస్ తాగలేమనుకునేవారు అందులో కాస్త నిమ్మరసం, తేనె లాంటివి కలుపుకోవచ్చు.

రంగవల్లి

9 చుక్కలు 9 వచ్చేవరకు





సుమేధ దామోదర, హైదరాబాద్.

ముగ్గులు పంపవల్సిన మా చిరునామా :
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496



గుంటూరులో నేడే ప్రీ రిలీజ్ ఫంక్షన్

త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మహేష్‌బాబు హీరోగా రూపొందున్న 'గుంటూరు కారం' చిత్రం ప్రీ రిలీజ్ కార్యక్రమం ఈ రోజు (జనవరి 9) గుంటూరులోని నంబూరు క్రాస్ రోడ్డులో నిర్వహించనున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రంలో శ్రీలీల, మీనాక్షి చౌదరీ హీరోయిన్స్‌గా నటించారు. సునీల్, అజయ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రమ్యకృష్ణ, ప్రకాష్ రాజ్, జగపతి బాబు, రఘుబాబు ముఖ్య పాత్రలు చేస్తున్నారు.

అప్పుడు నా గుండె పగిలింది
విజయ్‌సేతుపతి



విజయ్ సేతుపతి నటించిన తాజా చిత్రం 'మెరీ క్రిస్మస్' ఈనెల 12న విడుదల కానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఆస్కార్ నామినేషన్ల గురించి స్పందించారు. 'ఆస్కార్ నామినేషన్లకు ఎంపికైన చిత్రాల లిస్ట్‌లో 'సూపర్‌డీలక్స్' లేనందుకు నాతోపాటు చిత్రబృందమంతా బాధపడింది. ఆ క్షణం నా గుండె పగిలినంత పనైంది. నేను ఆ సినిమాలో ఉండడం వల్ల అది ఆస్కార్‌కు వెళ్లాలని కాదు.. నేను అందులో నటించకపోయినా నామినేట్ అవ్వాలని కోరుకునే వాడిని. మంచి చిత్రానికి ఆదరణ లభించాలనేది నా ఉద్దేశం. మధ్యలో ఏం జరిగిందనే దాని గురించి నేను మాట్లాడాలని అనుకోవడం లేదు' అని చెప్పారు. ఆ చిత్రంలో విజయ్ సేతుపతి ట్రాన్స్‌జెండర్ పాత్రలో నటించారు. ఇక తాజా చిత్రం 'మెరీ క్రిస్మస్', ఒక రాత్రి జరిగిన సంఘటన ఇద్దరి వ్యక్తుల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుందనే థ్రిల్లర్ కథాంశంతో రూపొందింది. శ్రీరామ్ రాఘవన్ తెరకెక్కించారు. కత్రినా కైఫ్ కథానాయిక. ప్రీతమ్ స్వరాలు అందించారు.

'ఓజీ' మాదే



పవన్‌కల్యాణ్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'ఓజీ'. డి.వి.వి దానయ్య నిర్మిస్తోన్న ఈ చిత్రంపై కొన్ని రోజులుగా రూమర్లు వస్తున్నాయి. సినిమా నిర్మాణ బాధ్యతలు వేరే ప్రొడక్షన్ హౌస్ చేతికి వెళ్లాయంటూ ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై చిత్ర నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ స్పందించింది. 'ఓజీ' మా సినిమా. ఎప్పటికీ మాదే. ఈ సినిమా ఎలా ఉండబోతుందో మాకు స్పష్టత ఉంది. ఆ దిశగా ముందుకు సాగుతున్నాం. ఆకలితో ఉన్న చిరుత దేనిని వదిలిపెట్టదు' అని ట్వీట్ చేసింది. జపాన్, ముంబై బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతోంది. ప్రియాంకా ఆరుల్ మోహన్ కథానాయికగా కనిపించనున్నారు. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

'దేవర' గ్లింప్స్ వచ్చేసింది..

ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దేవర'. తాజాగా ఈ చిత్రం నుండి 'గ్లింప్స్' వీడియో విడుదలైంది. ఇందులో ఒక పోరాట సన్నివేశాన్ని చూపించారు. సముద్ర నేపథ్యంగా జరిగే దొంగతనాలు, రెండు వర్గాల మధ్య జరిగే పోరాటంగా ఈ సినిమా కథ ఉండబోతుందని గ్లింప్స్‌ని చూస్తుంటే అర్థమౌతోంది. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. సైఫ్ ఆలీఖాన్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ సినిమా మొదటి భాగం ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది.

'ఓపెన్ హైమర్'కు గోల్డెన్ గ్లోబ్ అవార్డు



గతేడాది విడుదలై సంచలనం సృష్టించిన 'ఓపెన్‌హైమర్'కు 'గోల్డెన్ గ్లోబ్'అవార్డుల పంట పండింది. ఉత్తమ నటుడు, దర్శకుడు, నటుడు (డ్రామా), సహాయ నటుడు అవార్డులను కైవసం చేసుకుంది. ఉత్తమ నటుడిగా సిలియన్ మర్ఫీ, ఉత్తమ దర్శకుడిగా క్రిస్టఫర్ నోలన్‌కు అవార్డులు దక్కాయి. క్రిస్టఫర్ నోలన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సిలియన్ మర్ఫీ ప్రధాన పాత్రలో నటించారు. శాస్త్రవేత్త జె.రాబర్ట్ ఓపెన్‌హైమర్ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఘన విజయాన్ని అందుకుంది. కాలిఫోర్నియాలోని బేవర్లీ హిల్స్‌లో అవార్డుల వేడుక ఘనంగా జరిగింది. సిలియన్ మర్ఫీ ప్రధాన పాత్రలో నటించారు. మార్గోట్ రాబీ, ర్యాన్ గోస్లింగ్ 'బార్బీ' కూడా పలు కేటగిరీల్లో అవార్డులను సొంతం చేసుకుంది. ఉత్తమ చిత్రం– ఓపెన్‌హైమర్, ఉత్తమ కామెడీ చిత్రం– పూర్ థింగ్స్, ఉత్తమ దర్శకుడు – క్రిస్టఫర్ నోలన్ (ఓపెన్‌హైమర్), ఉత్తమ స్క్రీన్‌ప్లే–జస్టిన్ సాగ్ ట్రైట్, ఆర్థర్ హరారి (అనాటమీ ఆఫ్ ఎ ఫాల్), ఉత్తమ నటుడు–సిలియన్ మర్ఫీ(ఓపెన్‌హైమర్), ఉత్తమ నటి–లిల్లీ గ్లాడ్‌స్టోన్(కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్), ఉత్తమ హాస్య నటి–ఎమ్మా స్టోన్ (పూర్ థింగ్స్), ఉత్తమ హాస్య నటుడు–పాల్ గియామట్టి(ది హోల్డోవర్స్) తదితరులు అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.



షూటింగ్‌లో మరో రెండు

- **10మీ. ఎయిర్ పిస్టల్ టీం, మిక్స్‌డ్ విభాగాల్లో ఒలింపిక్ బెర్తులు**
- **ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో స్వర్ణాలు**



జకార్తా: భారత షూటర్లకు మరో రెండు ఒలింపిక్ బెర్తులు దక్కాయి. 10మీ. పురుషుల ఎయిర్ పిస్టల్ టీం, మిక్స్‌డ్ విభాగాల్లో భారత్‌కు ఒలింపిక్స్‌కు బెర్తులు ఖరారయ్యాయి. శనివారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో తోమర్, అర్జున్ సింగ్ చీమా, ఉజ్వల్ మాలిక్‌లతో కూడిన బృందం పసిడి పతకం కొల్లగొట్టింది. వరుణ్ (586), అర్జున్(579), ఉజ్వల్ (575)లు 1,740 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. ఈ విభాగంలో ఇరాన్, కొరియా షూటర్లు రజత, కాంస్య పతకాలను సాధించారు. దాంతో భారత్ నుంచి షూటింగ్ విభాగంలో పారిస్ ఒలింపిక్ బెర్తు దక్కించుకున్న 14వ షూటర్ల బృందంగా తోమర్ బృందం నిలిచింది. అలాగే వరణ్ తోమర్, ఈషా సింగ్‌లు 10మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించారు. ఈ జంట 15వ భారత షూటర్ల బృందంగా నిలిచారు. ఈ విభాగంలో పాకిస్తాన్‌కు రజత పతకం దక్కింది.

ఆంధ్రకు ఆధిక్యత

- **బెంగాల్ రంజీట్రోఫీ మ్యాచ్ డ్రా**
- **రికీ బుయ్ భారీ శతకం**

విశాఖపట్నం: బెంగాల్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 339పరుగులతో సోమవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్రజట్టు 445పరుగులకు ఆలౌటైంది. రికీ బుయ్(175) భారీ శతకానికి తోడు షోయబ్ ఎండి ఖాన్(56) అర్ధసెంచరీతో రాణించాడు. దీంతో ఆంధ్ర 165.4 ఓవర్లలో 445పరుగులకు ఆలౌట్ కాగా.. బెంగాల్ బౌలర్లు మహ్మద్ కైఫ్‌కు మూడు, ఆకాశ్, పోరల్, కరణ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. దీంతో ఆంధ్రకు 36పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బెంగాల్ జట్టు చివరిరోజు ఆట నిలిచే సమయానికి 25ఓవర్లలో వికెట్ నష్టపోయి 82పరుగులు చేసింది. దీంతో ఇరుజట్ల మధ్య జరిగిన రంజీట్రోఫీ తొలి లీగ్ మ్యాచ్ డ్రా అయ్యింది. దీంతో ఆంధ్రకు మూడు పాయింట్లు దక్కాయి.

రియాన్ రికార్డు సెంచరీ..

గ్రూప్–బిలో అస్సాం బ్యాటర్ రియాన్ పరాగ్ తక్కువ బంతుల్లో సెంచరీ కొట్టి రికార్డుపుటల్లోకెక్కాడు. రాయ్‌పూర్ వేదికగా ఛత్తీస్‌గఢ్‌తో జరిగిన 4వ రోజు ఆటలో రియాన్ కేవలం 56బంతుల్లోనే సెంచరీని మార్క్‌ను చేరుకున్నాడు. మొత్తం 87బంతుల్లో 11ఫోర్లు, 12సిక్సర్ల సాయంతో 155పరుగులు చేశాడు.

ఈ క్రమంలో 2016 రంజీ సీజన్‌లో జార్ఖండ్‌పై రిషబ్ పంత్(48బంతుల్లో) సెంచరీ తర్వాత 2వ స్థానంలో నిలిచాడు.

భారత్ తొలి ప్రత్యర్థి ఆస్ట్రేలియా

ఎఎఫ్‌సి ఆసియాకప్ ఫుట్‌బాల్ టోర్నీ

కతార్: ఎఎఫ్‌సి ఆసియాకప్ ఫుట్‌బాల్ టోర్నీలో భారత్‌కు క్లిష్టమైన డ్రా ఎదురైంది. మొత్తం 24జట్లు తలపడే ఈ టోర్నమెంట్‌లో భారత్ తన తొలి లీగ్ మ్యాచ్‌ను 12న పటిష్ట ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ టోర్నమెంట్‌కు చైనా ఆతిథ్యమివ్వాల్సి ఉన్నా.. కోవిడ్ కారణంగా అప్పట్లో ఈ టోర్నీని కతార్‌కు మార్పు చేయడం జరిగింది. 1956లో తొలిసారి కేవలం 4జట్లతో ప్రారంభమైన ఎఎఫ్‌సి టోర్నీ 2019లో అత్యధికంగా 24జట్ల మధ్య జరిగింది. ఈసారి కూడా 24జట్లు టైటిల్‌కు తలపడనున్నాయి. 12న ఆతిథ్య కతార్–లెబనాన్ జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ఈ టోర్నీ ప్రారంభం కానుండగా.. భారత్ తన తొలి గ్రూప్ లీగ్ మ్యాచ్‌ను 13న పటిష్ట ఆస్ట్రేలియాతో ఆడనుంది. గ్రూప్ లీగ్ పోటీలు ముగిసిన అనంతరం గ్రూప్ టాప్–2 జట్లు నాకౌట్‌కు చేరనున్నాయి. జనవరి 12నుంచి 25వరకు గ్రూప్ స్టేజ్ పోటీలు 28నుంచి, 21వరకు ప్రి క్వార్టర్స్, ఫిబ్రవరి 2, 3న క్వార్టర్‌ఫైనల్స్, 6, 7న సెమీఫైనల్ జరగనుండగా.. 10న లాసైల్ స్టేడియంలో ఫైనల్ పోరు జరగనుంది.

గ్రూప్‌లు...

గ్రూప్–ఎ : కతార్, చైనా, తజకిస్తాన్, లెబనాన్
గ్రూప్–బి : ఇండియా, ఆస్ట్రేలియా, ఉజ్బెకిస్తాన్, సిరియా
గ్రూప్–సి : ఇరాన్, యుఎఇ, హాంకాంగ్, పాలస్తీనా
గ్రూప్–డి : జపాన్, ఇండోనేషియా, ఇరాక్, వియత్నాం
గ్రూప్–ఇ : దక్షిణ కొరియా, మలేషియా, జోర్డాన్, బహ్రైయిన్
గ్రూప్–ఎఫ్: సౌదీ అరేబియా, థాయ్‌లాండ్, కిర్గిజిస్తాన్, ఒమన్

షెడ్యూల్..

13(శని)	:	భారత్ × ఆస్ట్రేలియా(సా.5.00గం॥)
18(గురు)	:	భారత్ × ఉజ్బెకిస్తాన్(రా.8.00గం॥)
23(మంగళ)	:	భారత్ × సిరియా(సా.5.00గం॥)


టెస్టులకు క్లాసెన్ గుడ్‌బై



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా వికెట్ కీపర్, విధ్వంసకర బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అనూహ్యంగా టెస్టు ఫార్మాట్ కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు.కెరీర్‌లో కేవలం నాలుగు టెస్టులాడిన క్లాసెన్ టెస్టులకు గుడ్ బై చెప్పిన విషయాన్ని దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు సోమవారం వెల్లడించింది. 'నేను తీసుకుంటున్న నిర్ణయం సరైనదా? కాదా? అనే ఆలోచనతో కొన్ని రోజులు నిద్రపట్టలేదు. మొత్తానికి టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాలని డిసైడ్ అయ్యా. నాకు ఎంతో ఇష్టమైన ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడం చాలా కష్టమైన నిర్ణయమే' అని 32ఏళ్ల క్లాసెన్ తెలిపాడు. 2019లో భారత్ పర్యటనలో క్లాసెన్ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. రాంచీ వేదికగా జరిగిన ఆ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 11 పరుగులే చేశాడు. 2023లో స్వదేశంలో జరిగిన ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపికై విఫలమయ్యాడు. మొత్తంగా టెస్టుల్లో 105 పరుగులు మాత్రమే చేశాడు.

సిరీస్ దక్కేదెవరికో..!

- **నేడు భారత్–ఆస్ట్రేలియా మహిళల చివరి టి20**
- **రాత్రి 7.00గం॥లకు**



ముంబయి: తొలి టి20లో నెగ్గిన భారత మహిళలజట్టు రెండో టి20లో అనూహ్యంగా ఓటమిపాలైంది. ఈ క్రమంలో సిరీస్ చేజిక్కించుకోవాలంటే మంగళవారం జరిగే మూడో, చివరి టి20లో భారత్ తప్పక గెలవాల్సిన పరిస్థితి. మరోవైపు వన్డే సిరీస్‌ను 3–0తో చేజిక్కించుకొన్న ఆస్ట్రేలియా టి20 సిరీస్‌ను చేజిక్కించుకోవాలన్న ఆశతో ఉంది. తొలి రెండు టి20ల్లోనూ తొలిగా బ్యాటింగ్ చేసిన జట్లు ఓటమిపాలవ్వగా.. ఛేదన దిగిన జట్లు గెలిచాయి. తొలి టి20లో టీమిండియా 9వికెట్ల తేడాతో నెగ్గి.. రెండో టి20లో 6వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. షఫాలీ వర్మ, మంధాన, రోడ్రిగ్స్, రీచా ఘోష్, దీప్తి శర్మ బ్యాటింగ్‌లో శ్రేయాంక, టిటాస్ సద్ధుకి తోడు దీప్తి శర్మ రాణిస్తే సిరీస్ మనదే..!

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68